
'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+48 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹7.00

సంపుటి: 17 సంచిక: 15

ఆదివారం 7-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ADITYA EDUCATIONAL INSTITUTIONS (AEI) IS PROUD TO ANNOUNCE
ADITYA ENGINEERING COLLEGE (A), Surampalem
as

ADITYA UNIVERSITY

[Established under Andhra Pradesh Private Universities (Establishment and Regulation) Act, 2016]


Dr. N. Sesha Reddy
CHANCELLOR
ADITYA UNIVERSITY
CHAIRMAN - AEI


Smt. N. Lakshmi Rajyam
DIRECTOR (AEI)


Dr. N. Satish Reddy
PRO-CHANCELLOR
ADITYA UNIVERSITY
VICE CHAIRMAN - AEI


Smt. N. Sruthi Reddy
DIRECTOR - AEI


N.K. Deepak Reddy
PRO-CHANCELLOR
ADITYA UNIVERSITY
SECRETARY - AEI


Dr. N. Suguna Reddy
DIRECTOR - AEI



OUR TOP RECRUITERS

Infosys, IBM, hp, amazon, springworks, Tech Mahindra, The India Cements Ltd, tcs, [24]7.ai, DXC TECHNOLOGY, keka, sears, tezo, VIT, Edu-versity

Above 30LPA 2 ADITYANS	Above 15 LPA 15 ADITYANS
Above 8 LPA 206 ADITYANS	Above 6 LPA 447 ADITYANS
Above 4 LPA 1069 ADITYANS	Above 25 LPA 9 ADITYANS
Above 10 LPA 33 ADITYANS	Above 7 LPA 220 ADITYANS
Above 5 LPA 498 ADITYANS	Above 3 LPA 1685 ADITYANS

ADITYA - A Synonym for Placements



- Suryakiran
B.Tech (IOT)

2370+

Offers & Still Counting...

2024 Placements



B.Tech (MECH) | B.Tech (ECE) | B.Tech (MECH) | B.Tech (MECH) | B.Tech (IT) | B.Tech (ECE) | B.Tech (MECH) | B.Tech (EEE) | B.Tech (MECH)

2025 PLACEMENTS

Walmart with Stipend ₹1 Lakh Per Month


Sri Lalitha (AIML) | Teja (AIML) | Priya (CSE) | Sowmya (CSE) | Prakeerthi (CSE)

ADITYA NAGAR, SURAMPALEM -533 437, KAKINADA DISTRICT, ANDHRA PRADESH.

adityauniversity.in

ADITYA UNIVERSITY

[Established under Andhra Pradesh Private Universities (Establishment and Regulation) Act, 2016]

ACCREDITATIONS AND RANKINGS

- NBA NATIONAL BOARD of ACCREDITATION — 6 UG Programs Accredited by NBA under tier I
- Accredited by NAAC with A++ Grade
- Recognized by UGC under sections 2(f) and 12(B)
- Recognized as SIRO by DSIR
- NABL — Civil Engineering Dept. Labs are Accredited by NABL
- MINISTRY OF SCIENCE AND TECHNOLOGY — DST Sponsored Technology Business Incubator
- THE WEEK — BEST PRIVATE ENGINEERING COLLEGES 2023-24 as per THE WEEK HANSA RESEARCH SURVEY 2023-24 — RANKED 59
- ARIIA ATAL RANKING OF INSTITUTIONS ON INNOVATION ACHIEVEMENTS — ARIIA 26-50 RANK BAND
- NPTEL AA — Recognized as best local chapter by NPTEL and stood 39th Position in India and 7th Position in AP
- DATAQUEST — TOP 100 T-SCHOOLS IN INDIA 2024 RANKINGS IN PRIVATE COLLEGES — RANKED 59
- DL — TOP ENGINEERING INSTITUE RANKING 2023-24 IN SOUTH INDIA — AAAA RANKED
- THE ACADEMIC INSIGHTS — INDIA'S TOP 50 ENGINEERING COLLEGES RANKING 2023-24 — 32
- siliconindia — AMONG TOP 10 ENGINEERING COLLEGES IN SOUTH INDIA 2023-24 — 4
- 10 AGRICULTURE INSTITUTES — THE 10 BEST AGRICULTURAL INSTITUTES IN INDIA 2023-24 — KNOWLEDGE REVIEW
- CAREERS360 A Career is a Life — INDIA'S BEST ENGINEERING COLLEGES 2023-24 in SOUTH ZONE — AAA+ RANKED
- TIMES ENGINEERING — AS PER TIMES ENGINEERING RANKINGS IN AP 2023-24 — 9

FOREIGN UNIVERSITIES COLLABORATION

- Stanford University
- RWTH AACHEN UNIVERSITY
- UNIVERSITY OF ILLINOIS URBANA-CHAMPAIGN
- THE UNIVERSITY of WISCONSIN MADISON
- Georgia Institute of Technology
- Learning Partner UNIVERSITY OF CAMBRIDGE

"ASAT"

ADITYA'S SCHOLASTIC APTITUDE TEST

for B.Tech aspirants (Phase-1 commencing from 13.04.2024) every Saturday & Sunday.

ACADEMICS

- Curriculum as per NEP 2020
- Choice based credit system
- Student Exchange Programs
- Joint Degree Certification
- Minors Degree
- Honors Degree
- Full Semester Internship
- Skill Oriented Certifications

RESEARCH CREDENTIALS

- Funded Projects **Rs. 16.3 Cr.**
- Research Publications indexed by Scopus/WoS **1015**
- Patents Published **235**
- Text Books Published **144**
- Doctorates **100+**
- Patents Granted **20**

PROGRAMMES OFFERED

BACHELOR OF TECHNOLOGY

- Civil Engineering
- Electrical & Electronics Engg.
- Mechanical Engineering
- Electronics & Communication Engg.
- Computer Science & Engineering
- Information Technology
- Artificial Intelligence & Machine Learning
- Data Science
- Petroleum Technology
- Mining Engineering
- Agricultural Engineering

MASTER OF TECHNOLOGY

- Structural Engineering
- Power Electronics & Drives
- Thermal Engineering
- VLSI Design
- Computer Science & Engineering

Master of Business Administration
MBA (INTEGRATED)
Master of Computer Applications



HOSTELS AC & NON AC

- WI-FI Facility
- Free Health Insurance
- Uninterrupted Power Supply
- Round the clock Ambulance Facility
- Banking Facility on the Campus
- A/C and Non A/C Rooms available with attached washroom
- 24/7 CCTV Surveillance
- Apollo shine functioning 24/7 on campus

Boys Hostels



Girls Hostels



INDUSTRY IMMERSION FOR CERTIFICATIONS & EXPERIENTIAL LEARNING

aws academy, paloalto, JUNIPER, UiPath, CERTIPORT, epam, Hero Vired, blueprism, HubSpot, AUTOMATION ANYWHERE, DASSAULT SYSTEMES, CFL, ARK, Infosys Springboard, SIEMENS CENTER FOR EXCELLENCE, celonis, mile2, CompTIA Authorized Partner, L&T EduTech, MICROCHIP, GitHub, PEGA, SkillAP

"THANKS"


to all the Parents, Students, Alumni, Faculty, and Staff for your unwavering trust & constant support....

- Management

adityauniversity.in | /adityauniversity | +91 95536 49666

ADITYA NAGAR, SURAMPALEM, KAKINADA DIST, ANDHRA PRADESH. Cell: (+91) 76590 76662, 70950 76663

KALYANI ADS


సత్యమేవ జయతే

సాక్షి

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+48 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 15

SUNDAY Special | ఆదివారం 7-4-2024



ఏయే వయసుల్లో.. ఏయే వ్యాక్సిన్లు.. ఏయే వైద్య పరీక్షలు..?

ఆరోగ్యంగా ఉండటం కోసం ముందస్తుగా ఏ వయసులో.. ఏ వ్యాక్సిన్, ఏ వైద్య పరీక్ష చేయించుకోవాలనే అంశంపై ప్రత్యేక కథనం.

- వివరాలు IVలో




రాజస్తాన్ రాయల్స్ ఘన విజయం

జైపూర్‌లో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్తాన్ 6 వికెట్ల తేడాతో బెంగళూరును ఓడించింది. బట్లర్ శతకం (100 నాటౌట్) రాయల్స్‌ను గెలిపించగా, కోహ్లి సెంచరీ (113 నాటౌట్) వృథా అయింది.

- వివరాలు 10లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వారిది ముస్లిం లీగ్ భావజాలం

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ముస్లిం లీగ్ భావజాలాన్ని, ఆలోచనా విధానాన్ని పోలి ఉందని ప్రధాని మోదీ విమర్శించారు.


వివరాలు 6లో ▸



ముగ్గురు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు.

వివరాలు 6లో ▸



ఎన్‌ఐఏ అధికారులపై దాడి

బెంగాల్‌లో 2022 నాటి పేలుడు ఘటన కుట్రదారులను ఎన్‌ఐఏ అదుపులోకి తీసుకోగా.. స్థానికుల దాడిలో ఓ అధికారి గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



భారత ఎన్నికలపై చైనా గురి

భారత్ ఎన్నికలపై చైనా సైబర్ గ్రూప్‌లు గురి పెట్టాయని.. ఫలితాలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తాయని 'మైక్రోసాఫ్ట్' తెలిపింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

నవరంగ్ కాంగ్రెస్ అధ్యక్షుడికి జనసేన బెదిరింపు



తమ పార్టీ గుర్తయిన బకెట్.. జనసేన గుర్తు గ్లాస్‌ను పోలి ఉన్నందున ఏపీలో పోటీ చేయడానికి వీల్లేదంటూ జనసేన నేతలు తమ బీఫామ్ పత్రాలు లాక్కున్నారని నవరంగ్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జలీల్‌ఖాన్ ఆరోపించారు. చంపుతానంటూ ఎంపీ బాలశౌరి గన్‌తో బెదిరించారని వాపోయారు.

వివరాలు 3లో ▸

మార్గదర్శి సిబ్బందిపై కేసు



ఇటీవల ఆధారాలు లేకుండా రూ.52 లక్షలు తరలిస్తూ చిక్కిన ఇద్దరు మార్గదర్శి ఉద్యోగులపై విశాఖ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల అధికారుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు చెప్పారు.

వివరాలు 2లో ▸

రాష్ట్రంలో భగభగలు



ఆంధ్రప్రదేశ్‌లో వేసవి ఉష్ణోగ్రతలు ఏప్రిల్‌లోనే రికార్డు సృష్టిస్తున్నాయి. అనకాపల్లి, నంద్యాల, పల్నాడు, పార్వతీపురం మన్యం, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లో శనివారం 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని సగానికి పైగా మండలాల్లో వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు దడ పుట్టించాయి.

వివరాలు 2లో ▸



శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

మోసానికి మారుపేరు

అబద్ధాలు, వెన్నుపోటు, మోసం, కుట్రలు కలిపితే చంద్రబాబు

కావలి బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- అయ్యా చంద్రబాబూ.. మీ పాలనలో గుర్తొచ్చే పథకమేదైనా ఉందా?
- ఎన్నిసార్లు అడిగినా ఎందుకు సమాధానం చెప్పడం లేదు?
- ఎన్నికల తర్వాత మీ మేనిఫెస్టోను పబ్లిక్‌గా చూపావా?
- అంత ధైర్యం, దమ్ము ఉందా?
- చూపవుగాక చూపవు.. ఎందుకంటే చేసిన మంచేమీ లేదు.. బాబును నమ్మితే పులి నోట్లో తల పెట్టినట్లే

7లో

- తోడేళ్లు, మోసగాళ్ల బ్యాచ్ మళ్లీ మోసం చేయడానికి వస్తోంది
- ఎవరి వల్ల మేలు జరిగిందో ఇంటింటా చర్చ జరగాలి.. ఇవి రాష్ట్ర భవిష్యత్, పేదల భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు
- మీ ఓటు.. మీ ఐదేళ్ల మీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.. 99 శాతం హామీలు అమలు చేసి మీ ముందుకు వచ్చా
- మీ ఇంట మీకు మేలు జరిగుంటే మీ బిడ్డకు తోడుగా నిలవండి

"ప్రజలకు ఫలానా మంచి చేశానని చెప్పుకోలేని వ్యక్తి చంద్రబాబు. వెన్నుపోట్లు పొడిచో, తడిగుడ్డతో గొంతు కోసో, కుట్రలు చేసో, కుతంత్రాలు చేసో, లేదా పొత్తులు పెట్టుకొనో, లేక ఎల్లో మీడియాలో అబద్ధపు వార్తలు ప్రచారం చేయించుకొనో.. ఏదోలా మొత్తానికి 30 ఏళ్ల క్రితమే ముఖ్యమంత్రి అయ్యారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన మీరు.. నిజంగా మంచి చేసి ఉంటే ఆ పార్టీలతో ఎందుకు పొత్తు పెట్టుకున్నట్లు? మేనిఫెస్టోలో కనీసం 10 శాతం హామీలు కూడా అమలు చేయలేదు. ప్రజల్ని మభ్య పెట్టడమే మీకు తెలిసిన విద్య. నా గతాన్ని చూసి ఓటు వేయండని ప్రజలను అడిగే ధైర్యం ఉందా చంద్రబాబూ? - సీఎం వైఎస్ జగన్



కోవూరు వద్ద ఓ వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నువ్వే కావాలి జగన్

9వ రోజు మేమంతా సిద్ధం బస్సు యాత్రలో నినదించిన సింహపురి ప్రజానీకం

నెల్లూరు జిల్లాలో బస్సుయాత్రకు బ్రహ్మరథం పట్టిన జనవాహిని

8లో

మారని బాబు.. మళ్లీ అదే రుబాబు

ఈసీ అయినా డోంట్ కేర్... పోలీస్ వ్యవస్థనూ బ్లాక్‌మెయిల్



- ఎన్నికల అక్రమాలే లక్ష్యం.. దుష్ప్రచారమే కుతంత్రం
- నాడూ నేడూ కుట్ర రాజకీయం ఇదే
- ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం
- వాటి తీరుపై ఐపీఎస్ అధికారుల మండిపాటు
- పూర్తి ఆధారాలతో ఈసీకి ఫిర్యాదు

2లో

దుష్ప్రచారాన్ని కట్టడి చేయండి

2లో

- పోలీసు వ్యవస్థ మనోస్థైర్యాన్ని దెబ్బ తీసేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కుట్ర
- ఆ పార్టీలకు కొమ్ముకాసే మీడియాను నియంత్రించండి.. ఈసీకి ఐపీఎస్ అధికారుల సంఘం వినతి

ఎన్నికల తర్వాత టీడీపీ గల్లంతే



- 2019 ఎన్నికల కంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఘోరంగా ఓడిపోవడం తథ్యం
- అందుకే నిరాశ నిస్పృహలతో సైకోలా ప్రవర్తిస్తున్న చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి 'సజ్జల' ఫైర్
- పెయిడ్ ఆర్టిస్టులా మాట్లాడుతున్న షర్మిల

2లో

బాబు చేతిలో కీలుబొమ్మ సునీత

- 2019లో కడప ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాశ్‌ను ఖరారు చేసిన వైఎస్ జగన్
- అవినాశ్ గెలుపు కోసం చివరి వరకూ కృషి చేసిన వివేకా.. అయినా సునీత దుష్ప్రచారం
- తాజాగా పులివెందుల ఉప ఎన్నికల అభ్యర్థిత్వంపై అవాస్తవాలు.. హేతుబద్ధ ప్రశ్నలు సంధిస్తే సమాధానం కరువు
- వివేకా రెండో వివాహంతోనే ఆ కుటుంబంలో విభేదాలు.. ఆస్తి, రాజకీయ వారసత్వం కోసం పంతంపట్టిన సునీత దంపతులు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకాను కుట్రతో ఓడించింది చంద్రబాబు ముఠానే.. 2019లో భౌతికంగా అంతం చేసిందీ ఎల్లో గ్యాంగే
- తండ్రి హంతకులు, కుట్రదారులతో సఖ్యతగా ఉంటున్న సునీత దంపతులు

9లో



ఎంపీ ఎన్నికల్లో సానుభూతి కోసమే

వివేకా హత్య

వైఎస్ వివేకా కుమార్తె సునీత ఆరోపణ

వివేకాకు మంత్రి పదవి ఇచ్చినందునే జగన్, విజయమ్మ కాంగ్రెస్‌ను వీడారు

- వివరాలు 9లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఎవరి సిఫార్సు లేకుండా ఇల్లు



నేను తాపీ పని చేస్తుంటాను. పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టానికి చెందిన మేము పొట్టకూటికోసం విజయనగరం జిల్లా రాజాం పట్టణానికి కొన్నేళ్ల క్రితం వలస వచ్చాం. గాయత్రీకాలనీలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉండేవాళ్లం. నా కొచ్చే అరకొర ఆదాయం సరిపోకపోవడంతో నా భార్య సంధ్య.. ఇంట్లో టైలరింగ్ పని చేస్తోంది. మాకు ఇద్దరు పిల్లలు. గత ప్రభుత్వ హయాంలో మాకు పని సరిగ్గా ఉండేది కాదు. ఎలాంటి సాయమూ అందేది కాదు. కానీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మా పరిస్థితి మెరుగు పడింది. మాకు చేతి నిండా పని దొరుకుతోంది. ఈ ప్రభుత్వంలోనే మాకు రైస్ కార్డు ఇచ్చారు. బడికెళ్తున్న మా అబ్బాయికి అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు వంతున వచ్చింది. మరీ ముఖ్యంగా ఎవరి సిఫారసు లేకుండానే ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి నిధులు ఇచ్చారు. అందరిలానే మేం కూడా కంచరాం సమీపంలో మాకు ఇచ్చిన స్థలంలో సొంత ఇంటిని నిర్మించుకున్నాం. నెల రోజుల క్రితం గృహ ప్రవేశం చేశాం. కేవలం అర్హతే ప్రామాణికంగా ఎలాంటి పైరవీలు లేకుండా ఇన్ని సౌకర్యాలు కల్పించిన ఈ ప్రభుత్వం రుణం ఎప్పటికీ తీర్చుకోలేం.

– గంధవరపు సురేష్, రాజాం.

(వి.వి.దుర్గారావు, విలేకరి, రాజాం)

పేపర్ ప్లేట్ల తయారీతో దర్జాగా జీవనం



నేను సాధారణ గృహిణిని. విశాఖ జిల్లా చిట్టివలస గ్రామానికి చెందిన నేను గత ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి పొందలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకుని స్వయం సమృద్ధి సాధించే దిశగా సాగుతున్నాను. నేను డ్వాక్రా గ్రూప్ సభ్యురాలిని కావడంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా జీవీఎంసీ భీమిలి జోన్ ద్వారా పట్టణ ప్రగతి యూనిట్ పేరుతో రెండు నెలల క్రితం పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్ పెట్టుకున్నా. ఈ యూనిట్ విలువ రూ.2,02,500. ఇందులో ప్రభుత్వ సబ్సిడీ రూ.39,600. యూనిట్‌కు యంత్ర పరికరాలు, మెటీరియల్ ప్రభుత్వమే ఇచ్చింది. ప్రోత్సాహకంగా నాలుగు నెలల అద్దె కింద మరో రూ.20 వేలు ఇచ్చారు. పేపర్ ప్లేట్ల తయారీలో భాగంగా పాలిథిన్ రహిత ప్లేట్ల తయారీలో శిక్షణ తీసుకున్నా. పేపర్ అట్టలపై విస్తర్లు ఉంచి సంప్రదాయ పద్ధతిలో భోజనాలకు అనువుగా వినియోగదారుల అభిరుచి మేరకు తయారు చేయగలుగుతున్నా. వ్యాపారం ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. ఇల్లు లేని మాకు ఇంటి స్థలం ఇవ్వడమే గాకుండా ఇంటి నిర్మాణానికి రూ. 1.80 లక్షల ఆర్థికసాయం చేశారు. దాంతో ఇంటి నిర్మాణం పూర్తిచేసుకోగలిగాం. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన ఈ ముఖ్యమంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– వెంపాడ అరుణ, చిట్టివలస

(గేదెల శ్రీనివాసరెడ్డి, విలేకరి, తగరపువలస)

మార్గదర్శి సిబ్బందిపై కేసు

- ఆధారాలు లేకుండా రూ.52లక్షలు తరలిస్తూ చిక్కిన ఇద్దరు ఉద్యోగులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎన్నికల అధికారులు
- సెక్షన్ 188 కింద కేసు నమోదు చేసిన పోలీసులు



సీతమ్మధార (విశాఖ ఉత్తర): మార్గదర్శి చిట్‌ఫండ్స్ కంపెనీ సిబ్బందిపై ద్వారకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల రెండో తేదీన నగరంలోని సీతంపేట మార్గదర్శి చిట్‌ఫండ్స్ శాఖ అకౌంట్ అసిస్టెంట్ వి.లక్ష్మణరావు, ఆఫీస్ బాయ్ శ్రీను స్కూటీలో రూ.51,99,800 నగదుతోపాటు రూ.36,88,677 విలువైన 51 చెక్కులు తీసుకువెళ్తుండగా.. ద్వారకానగర్ మొదటి లైన్‌లో పోలీసులు తనిఖీలు చేస్తూ పట్టుకున్నారు. పొంతన లేని సమాధానాలు చెప్పడం, ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు ఆ నగదు, చెక్కులను ఎన్నికల అధికారులకు అప్పగించారు. దీనిపై ఎన్నికల అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఫిర్యాదు మేరకు సెక్షన్ 188 ప్రకారం మార్గదర్శి సిబ్బంది వి.లక్ష్మణరావు, శ్రీనులపై ద్వారకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లడానికి వీలులేదని ద్వారకా సీఐ ఎస్.రమేష్ తెలిపారు.

బాప్‌రే.. భగభగలు



రికార్డు స్థాయిలో 45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు

- రాష్ట్రంలో సగానికి పైగా మండలాల్లో వడగాడ్పులు
- అనకాపల్లి, నంద్యాల, పల్నాడు జిల్లాల్లో 44.9 డిగ్రీలు
- పార్వతీపురం మన్యం, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లోనూ 44.9 డిగ్రీలు
- రెంటచింతలలో 44.6 డిగ్రీలు నమోదు



సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో వేసవి ఉష్ణోగ్రతలు ఏప్రిల్‌లోనే రికార్డు సృష్టిస్తున్నాయి. ఏప్రిల్ నెలలో మునుపెన్నడూ లేనంత తీవ్ర స్థాయిలో నమోదవుతున్నాయి. శనివారం ఏడు జిల్లాల్లో దాదాపు 45 డిగ్రీలకు చేరువలోకొచ్చి మంట పుట్టించాయి. రాష్ట్రంలోని 670 మండలాలకు గాను 358 మండలాల్లో (సగానికి పైగా) వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు దడ పుట్టించాయి. 127 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 231 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపాయి. శనివారం అనకాపల్లి జిల్లా రావికమతం, నంద్యాల జిల్లా బ్రాహ్మణ కొట్కూరు, పల్నాడు జిల్లా రావిపాడు, పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ, ప్రకాశం జిల్లా తోకపల్లె, వైఎస్సార్ జిల్లా బలపనూరుల్లో రికార్డు స్థాయిలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పల్నాడు జిల్లా రెంటచింతలలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లోనూ 40 నుంచి 44 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ఆదివారం 64 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 222 మండలాల్లో వడగాడ్పులు, సోమవారం 22 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఆదివారం శ్రీకాకుళం జిల్లాలో 15, విజయనగరం 24, పార్వతీపురం మన్యంలో 11, విశాఖపట్నం 1, అనకాపల్లి 7, కాకినాడ 4, తూర్పుగోదావరి జిల్లాలోని 2 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని తెలిపింది. ఎండలు, వడగాడ్పుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.


రేపట్నుంచి కాస్త చల్లదనం..

కొద్దిరోజులుగా భానుడి భగభగలతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఒకింత చల్లని వార్తను మోసుకొచ్చింది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడేందుకు కూడా ఆస్కారం ఉందని పేర్కొంది. ఫలితంగా పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి కాస్త ఊరటనిస్తాయని తెలిపింది. ఉష్ణతాపం తగ్గినా పలు ప్రాంతాల్లో ఉక్కపోత, అసౌకర్య వాతావరణం మాత్రం ఉంటుందని వివరించింది.

ఉష్ణోగ్రతలు	గరిష్ట	కనిష్ట
నందికొట్కూరు	44.9	28.0
గూడూరు (కర్నూలు జిల్లా)	44.6	29.0
భీమవరం	42.0	24.0
నర్సాపురం	42.0	24.0
తాడేపల్లిగూడెం	42.0	24.0
మార్కాపురం	42.0	27.0
గుంటూరు	42.0	27.0
రాజమహేంద్రవరం	42.0	24.0
ఏలూరు	41.0	26.0
చిత్తూరు	41.0	23.0
తిరుపతి	40.5	39.0
నెల్లూరు	40.5	26.0
నూజివీడు	40.0	25.0
ఒంగోలు	39.7	26.6
జంగారెడ్డిగూడెం	39.0	26.0
కాకినాడ	37.2	26.8
అమలాపురం	36.5	26.0

మారని బాబు.. మళ్లీ అదే రుబాబు

- ఈసీ అయినా డోంట్ కేర్... పోలీస్ వ్యవస్థనూ బ్లాక్‌మెయిల్ చేస్తాం
- ఎన్నికల అక్రమాలే లక్ష్యం...దుష్ప్రచారమే కుతంత్రం
- నాడూ నేడూ కుట్ర రాజకీయం ఇదే



ఎన్టీరామారావుకు వెన్నుపోటు పొడిచి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు రాజ్యాంగం అంటే ఏనాడూ లెక్కలేదు. రాజ్యాంగబద్ధ సంస్థలంటే ఏమాత్రం గౌరవం లేదన్నది జగద్విదితం. ప్రజా విశ్వాసం ఏనాడూ చూరగొనలేని ఆయన ఉపయోగించే ఏకైక కుతంత్రం దుష్ప్రచారం. అందుకు సాధనం ఈనాడు, ఇతర ఎల్లో మీడియా. రాజకీయ ప్రయోజనాల కోసం తాను పాల్పడే కుట్రలకు అడ్డువస్తే కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ) వంటి రాజ్యాంగబద్ధ సంస్థపైనా దుష్ప్రచారం చేసేందుకు వెనుకాడనని 2019 ఎన్నికల ముందే ఆయన చేతల్లో చూపారు. ఏకంగా ఈసీ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసేంత బరితెగింపు చంద్రబాబుకే సాధ్యం. కానీ హైకోర్టు తీర్పుతో టీడీపీ కుట్రబెడిసికొట్టడం... ఆ ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం ఘోరపరాజయం చెందడం చకచకా జరిగిపోయాయి. అయినా సరే 2024 ఎన్నికల ముందు కూడా చంద్రబాబు అదే రీతిలో దుష్ప్రచార కుట్రను తెరపైకి తెచ్చారు. ఈసారి కూడా ఏకంగా ఈసీతోపాటు యావత్ పోలీసు వ్యవస్థకు వ్యతిరేకంగా విష ప్రచారానికి తెగించారు. ఈసీ నిర్ణయాలను అధికార వైఎస్సార్‌సీపీ హుందాగా స్వీకరిస్తూ గౌరవిస్తుంటే... ప్రతిపక్ష టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి, వాటికి కొమ్ముకాస్తున్న ఎల్లో మీడియా మాత్రం రోజుకో రీతిలో విష ప్రచారంతో రాజ్యాంగ వ్యవస్థలు, ప్రభుత్వ యంత్రాంగాన్ని బ్లాక్‌మెయిల్ చేసేందుకు కుతంత్రం పన్నుతున్నాయి. ఈ కుట్ర రాజకీయాలపై రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం ఈసీకి ఫిర్యాదు చేయడం తాజా పరిణామం.

– సాక్షి, అమరావతి

2024 ఎన్నికల వేళ..

- మళ్లీ అదే కుట్రకు తెరతీసిన చంద్రబాబు
- పోలీసు వ్యవస్థ మనోస్థైర్యాన్ని దెబ్బతీసే కుతంత్రం
- ఈసీ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ దుష్ప్రచారం

ఎన్నికల అక్రమాలకు పాల్పడేందుకు 2019లో వేసిన పన్నాగం బెడికొట్టినా చంద్రబాబు తీరు మారలేదు. త్వరలో నిర్వహించనున్న ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు తన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలిగా ఉన్న తన వదిన దగ్గుబాటి పురందేశ్వరితో కలసి కుట్రకు తెరతీశారు. రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారులకు వ్యతిరేకంగా నిరాధార ఆరోపణలు మొదలు పెట్టారు. వాటిని తనకు వత్తాసు పలికే ఈనాడు, ఇతర పచ్చ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారంలోకి తీసుకువచ్చి అటు ఈసీని ఇటు ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న చిలకలూరిపేట బహిరంగ సభను విజయవంతం చేయడంలో విఫలమైన టీడీపీ ఆ నెపాన్ని పోలీసు అధికారులపై నెట్టివేసేందుకు యత్నించింది. ఐపీఎస్ అధికారులకు వ్యతిరేకంగా అటు పురందేశ్వరితోనూ ఇటు టీడీపీ నేతల ద్వారా ఈసీకి ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేయించింది. ఈ నేపథ్యంలో ఈసీ రాష్ట్రంలోని ఒక ఐజీ, అయిదుగురు ఎస్పీలు, ఇద్దరు కలెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ స్థానంలో కొత్తవారిని నియమించింది. 2019లో చంద్రబాబు వ్యతిరేకించినట్టు ప్రస్తుతం ఈసీ నిర్ణయాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమీ వ్యతిరేకించలేదు. ఈసీ నిర్ణయాన్ని హుందాగా స్వీకరించి గౌరవించింది. కానీ చంద్రబాబు మాత్రం తన కుట్రలకు తెరదించ లేదు. అటు ఈసీని ఇటు పోలీసు వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని మళ్లీ దుష్ప్రచారానికి తెర తీశారు. ఈసీ నియమించిన పోలీసు అధికారులకు వ్యతిరేకంగా టీడీపీ కరపత్రంగా ఉన్న ఈనాడు పత్రికలో ' వీళ్లా కొత్త ఎస్పీలు' అంటూ ఓ దురుద్దేశపూరిత కథనాన్ని బ్యానర్‌గా ప్రచురించేట్టు చేశారు. ఈసీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి, కొత్తగా నియమితులైన ఎస్పీలకు వ్యతిరేకంగా నిరాధార ఆరోపణలతో దుష్ప్రచారానికి పాల్పడ్డారు. ఈనాడు పత్రిక తీరును ఖండిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఐపీఎస్ అధికారుల సంఘం ప్రకటన జారీ చేస్తే... దానికి కూడా వక్రభాష్యం చెబుతూ ఈనాడు, ఇతర ఎల్లో మీడియా మరోసారి దుష్ప్రచారంతో చెలరేగిపోయాయి. చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే ఎల్లో మీడియా రాజ్యాంగబద్ధ సంస్థ ఈసీకి, పోలీసు వ్యవస్థకు వ్యతిరేకంగా విషం చిమ్ముతోందన్నది స్పష్టమైంది. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు, వాటికి కొమ్ముకాస్తున్న ఎల్లో పత్రికలు, టీవీ చానళ్లకు వ్యతిరేకంగా ఐపీఎస్ అధికారుల సంఘం ఈసీకి ఫిర్యాదు చేసింది.

2019 ఎన్నికల ముందు..

ఈసీ నిర్ణయాన్ని బేఖాతరు చేస్తూ సీఎస్ ద్వారా ఉత్తర్వులు

2019 ఎన్నికల్లో టీడీపీ ఘోర పరాజయం తప్పదని స్పష్టం కావడంతో సీఎం హోదాలో చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. అప్పటి నిఘా విభాగాధిపతిగా ఉన్న తన సన్నిహితుడు ఏబీవెంకటేశ్వరరావు ద్వారా కుట్రలకు తెరతీశారు. దీన్ని గుర్తించిన ఈసీ వెంటనే ఏబీ వెంకటేశ్వరరావుతోపాటు అప్పటి శ్రీకాకుళం, వైఎస్సార్ జిల్లా ఎస్పీలు అడ్డాల వెంకటరత్నం, రాహుల్ దేవ్ శర్మలను 2019, మార్చి 26న బదిలీ చేసింది.



ఆనాటి సీఈవో ద్వివేదీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నాటి సీఎం చంద్రబాబు

వారిని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులివ్వడంతో పాటు వారికి ఎలాంటి ఎన్నికల విధులు కేటాయించవద్దని స్పష్టం చేసింది. తన కుట్ర బెడిసికొట్టడంతో ఏకంగా ఈసీనే తూలనాడుతూ చంద్రబాబు చిందులు తొక్కారు. ఈసీ ఆదేశాలను అమలు చేసేది లేదని తేల్చిచెప్పారు. ఈసీ రాజకీయ దురుద్దేశంతో నిర్ణయం తీసుకుందని టీడీపీ తీవ్ర ఆరోపణలు చేసింది కూడా. ఇక చంద్రబాబు ఒత్తిడితో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న అనిల్ చంద్ర పునేఠా నిఘా విభాగాధిపతిగా ఏబీ వెంకటేశ్వరరావును కొనసాగిస్తున్నట్టు 2019, మార్చి 27న ఉత్తర్వులివ్వడం దేశంలోనే సంచలనం సృష్టించింది. అసలు నిఘా విభాగాధిపతికి ఎన్నికల విధులతో సంబంధంలేదని కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. మరోవైపు శ్రీకాకుళం, వైఎస్సార్ జిల్లా ఎస్పీలు తమను బదిలీ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై అభ్యంతరాలు తెలుపుతూ ఏకంగా ఈసీకే లేఖ రాయడం కూడా సంచలనమే. అంటే ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగబద్ధ అధికారాలు కలిగిన ఈసీనే చంద్రబాబు ప్రశ్నించారు. ఈసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టీడీపీ ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కానీ చంద్రబాబు కుట్ర బెడిసికొట్టింది. ఏబీ వెంకటేశ్వరరావును బదిలీ చేస్తూ ఈసీ జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేయలేమని హైకోర్టు 2019, మార్చి 28న తీర్పునిచ్చింది. తమ ఆదేశాలకు విరుద్ధంగా నిఘా విభాగాధిపతిగా ఏబీ వెంకటేశ్వరావును నియమిస్తూ ఉత్తర్వులిచ్చిన అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠాను సీఎస్ పోస్టు నుంచి ఈసీ తొలగించింది. దాంతో అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడాలన్న చంద్రబాబు పన్నాగం పూర్తిగా బెడిసికొట్టింది.

పల్నాడులో సీఎం జగన్ ఉగాది సంబరాలు

- శావల్యాపురం మండలం గంటావారిపాలెంలో ఏర్పాట్లు
- 8న వినుకొండలో సీఎం బస్సు యాత్ర
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ప్రజాప్రతినిధులు

శావల్యాపురం: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లాకు రానున్నారు. ఈ సందర్భంగా ఈ నెల 9న సీఎం ఉగాది సంబరాల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు వినుకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. ఈ మేరకు శావల్యాపురం మండలం వేల్పూరు శివారు గంటావారిపాలెంలో ఉగాది వేడుకల ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ నెల 8న సీఎం వైఎస్ జగన్ వినుకొండ, వితంరాజుపల్లె, కనమర్లపూడి, శావల్యాపురం, కృష్ణాపురం, గంటావారిపాలెం గ్రామాల పరిధిలో పర్యటిస్తారన్నారు. అదేరోజు రాత్రి గంటావారిపాలెంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బస చేస్తారని బ్రహ్మనాయుడు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ సుహాసిని అనిల్ కుమార్, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా సీఎం వైఎస్ జగన్ బస చేయనున్న ప్రాంగణాన్ని నరసరావుపేట డీఎస్పీ వత్సవాయి సత్యనారాయణవర్మ, సీఐలు ఉప్పుటూరి సుధాకర్, యం. సాంబశివరావు, ఎస్సై చల్లా సురేష్ పరిశీలించారు.

ఎన్నికల తర్వాత టీడీపీ గల్లంతే

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి 'సజ్జల'



సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో టీడీపీ 2019 ఎన్నికల కంటే ఘోరంగా ఓడిపోవడం ఖాయమని.. రాజకీయ తెరమీద ఆ పార్టీ పూర్తిగా కనుమరుగు కాబోతోందన్నది స్పష్టంగా కనిపిస్తుండడంతో దాని అధ్యక్షుడు చంద్రబాబు తీవ్ర నిరాశ నిస్పృహలతో శివాలెత్తిపోతున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు ఫ్రస్ట్రేషన్ పరాకాష్టకు చేరిందనేది వారం రోజులుగా ఆయన చేష్టలు చూస్తుంటే అర్థమవుతోందని.. ఆయన కలలుగన్న కూటమి, పొత్తు వికటించడంతో చంద్రబాబు ఏం చేస్తున్నారో ఆయనకే తెలియడంలేదని ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పొత్తు, సీట్ల ఖరారు నుంచి అభ్యర్థుల ఎంపిక వరకూ కూటమిలో ఉన్న పార్టీలు తన కింద పనిచేసేవిగా చంద్రబాబు భావిస్తున్నారని.. అందుకే ఆయన అనుకున్నవారే ఆయా పార్టీల్లో అభ్యర్థులు అవుతున్నారన్నారు. దీంతో బీజేపీ, జనసేనలను నమ్ముకున్న వారందరూ మండిపడుతున్నారని.. కూటమిలో జరుగుతున్న గొడవలు, గందరగోళాలే అందుకు నిదర్శనమన్నారు. ఫలితంగా ఎన్నికల తర్వాత టీడీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

ఓటమి భయంతో వ్యవస్థలపై దాడి..

ఘోర పరాజయం ఖాయమని ఆందోళన చెందుతున్న చంద్రబాబు తిట్లకు దిగుతూ.. వ్యవస్థలపై దాడిచేస్తున్నారు. చివరికి పిచ్చి పాటలు పెట్టుకుని డాన్స్‌లు కూడా వేస్తున్నాడు. 74 ఏళ్ల వ్యక్తి ఇలాగేనా చేసేది? ప్రజలు ఎన్నుకున్న ఒక సీఎం గురించి పిచ్చివాడిలా పిచ్చి మాటలు మాట్లాడుతున్న చంద్రబాబు.. జనం ఉమ్మేస్తారనే ఇంగితం కూడా లేకుండా సైకోలా ప్రవర్తిస్తున్నాడు. 2019లో సీఎంగా ఉన్న చంద్రబాబు అప్పటి సీఈవో గోపాలకృష్ణ ద్వివేదిపై ఏ విధంగా చిందులు వేశాడో అందరూ చూశారు. కానీ, జగన్ ఒక వ్యవస్థపై ఇలా మాట్లాడిన సందర్భాలు ఎన్నడూ చూడలేదు. ఈ రోజు వీళ్లు ఎడాపెడా ఫిర్యాదులిస్తుంటే బదిలీలు చేస్తున్నారు. వారి ఫిర్యాదుల్లో అవాస్తవాలున్నా ఆ వ్యవస్థను జగన్ ఎన్నడూ మాట్లాడలేదు. ఎన్నికల కమిషన్ పరిధిలోకి వెళ్లాక వారి విచక్షణాధికారాన్ని ప్రశ్నించకూడదనే గౌరవాన్ని సీఎం జగన్ పాటిస్తున్నారు. ఇక ఈసీకి ఫిర్యాదు చేసి వలంటీర్లనైతే ఆపావుగానీ పింఛన్లను ఆపలేవుగా బాబూ? శక్తి ఉంటే అవి కూడా ఈ సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ లాంటి సంస్థలతో ఆపించే వాడేగానీ ధైర్యం చాలలేదు.

పెయిడ్ ఆర్టిస్టులా షర్మిల మాటలు..

ఇక తెలంగాణనే తన జీవితమన్న షర్మిల ఎందుకిక్కడికి వచ్చారు? ఇక్కడ ఎత్తిపోయిన కాంగ్రెస్ బాధ్యతలను ఆమెకెవరు అప్పగించారు? అదే కాంగ్రెస్‌ను తెలంగాణలో విపరీతంగా తిట్టి ఇప్పుడెలా కలిశారు? ముందు వీటికి సమాధానాలు చెప్తే.. వివేకా హత్య, ఆమె తీసుకున్న పాత్రకు జవాబు కూడా దానిలోనే ఉంటుంది. నాలుగేళ్లుగా పట్టని వివేకా హత్య ఈ రోజు ఎందుకు పట్టింది? కోర్టు పరిధిలో ఉన్న అంశాలు తేలకముందే హంతకుడు అని ముద్ర వేస్తున్నారు. షర్మిల చంద్రబాబు అజెండాను భుజానకెత్తుకుంది. అందుకే షర్మిలను పెయిడ్ ఆర్టిస్టు అనాల్సి వస్తోంది.

టెర్రరిజంలా ఎల్లో గ్యాంగ్ అరాచకం..

చంద్రబాబే శాశ్వత సీఎంగా ఉండాలని పెడితే తప్ప చంద్రబాబు, రామోజీ, రాధాకృష్ణ, పురందేశ్వరి, లోకేశ్, దత్తపుత్రుడులకు మనసు శాంతించదేమో. రామోజీరావుకు మార్గదర్శి కేసు నడుస్తున్నప్పటి నుంచీ ఆయన తట్టుకోలేకపోతున్నాడు. ఈరోజు మళ్లీ 'సీఎస్ గారూ'.. అంటూ రాసుకొచ్చాడు. ముసుగు తొలగించి నేరుగా దాడికి దిగారు. ఇక పురందేశ్వరి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్నా.. ఆమె అజెండా మాత్రం చంద్రబాబుదే. రాష్ట్రంలో ఉన్న అధికారులందరినీ తీసేయాలంటూ ఈసీకి లేఖ రాసింది.

దుష్ప్రచారాన్ని కట్టడి చేయండి

ఈసీకి ఐపీఎస్ అధికారుల సంఘం ఫిర్యాదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, బీజేపీ, జనసేనలతోపాటు ఆ పార్టీకి కొమ్ముకాస్తున్న పత్రికలు, మీడియా చానళ్లు నిరాధార ఆరోపణలతో తమపై చేస్తున్న దుష్ప్రచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. కీలకమైన ఎన్నికల తరుణంలో ఐపీఎస్ అధికారులతోపాటు యావత్ పోలీసు వ్యవస్థ మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు పక్కా పన్నాగంతోనే ఈ దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని ఆధారాలతో సహా ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఉద్దేశించి 19 మంది ఐపీఎస్ అధికారుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని ఐపీఎస్ అధికారుల సంఘం ప్రతినిధులు కాంతిరాణా టాటా, రవీంద్రబాబు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనాకు శనివారం సమర్పించారు. ఆ వినతిపత్రంతో పాటు ఇటీవల ఐపీఎస్ అధికారులపై టీడీపీ, బీజేపీ, జనసేన అనుకూల మీడియాలో వచ్చిన 17 నిరాధారమైన వార్తా కథనాలను జత చేశారు.



రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు అందిస్తున్న ఐపీఎస్ అధికారుల సంఘం

ఫిర్యాదులో ముఖ్యాంశాలు

రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, బీజేపీ, జనసేనలతోపాటు ఆ పార్టీలకు వత్తాసు పలుకుతున్న పత్రికలు, టీవీ చానళ్లు పక్కా కుట్రతోనే దుష్ప్రచారం సాగిస్తున్నాయి. ముందుగా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ప్రతినిధులు పోలీసు అధికారులకు వ్యతిరేకంగా నిరాధార ఆరోపణలు చేస్తారు. అనంతరం అవే ఆరోపణలతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తారు. వారు చేసేఆరోపణలకు ఎలాంటి ఆధారాలుండవు. కానీ పదే పదే అసత్య ఆరోపణలు చేయడం ద్వారా పోలీసు వ్యవస్థ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయాలన్నది ఆ పార్టీల కుట్ర. దాంతో పోలీసు వ్యవస్థకు తీవ్ర నష్టం కలుగుతోంది. అనంతరం టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి మరీ ఆ ఆరోపణలను పునరుద్ఘాటిస్తారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే పోలీసు అధికారులకు వ్యతిరేకంగా అవినీతి, ఆశ్రిత పక్షపాతం, అసమర్థత మొదలైన నిందలు వేస్తారు. ప్రతిపక్ష పార్టీల ఆరోపణలను ఆ పార్టీలకు కొమ్ముకాస్తున్న పత్రికలు ప్రముఖంగా ప్రచురిస్తాయి. మీడియా చానళ్లు పదే పదే వాటినే ప్రసారం చేస్తాయి. ఇక టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల సోషల్ మీడియా విభాగాలు ఆ దుష్ప్రచారాన్ని పెద్ద ఎత్తున వైరల్ చేస్తాయి. మళ్లీ మరో అసత్య ఆరోపణలను ప్రతిపక్ష పార్టీలు ప్రస్తావిస్తాయి... మళ్లీ అదే తంతు సాగుతుంది. ఇలా ఈ దుష్ప్రచారాన్ని పదే పదే కొనసాగిస్తారు. కొన్ని ప్రధానపత్రికలు, టీవీ చానళ్లు ప్రతిపక్ష పార్టీల కుట్రలో భాగస్వాములవడం దురదృష్టకరం. ఈ దుష్ప్రచారంతో గత రెండు నెలల్లోనే 30మందికి పైగా పోలీసు అధికారులు మనోవేదనకు గురయ్యారు.

ఈసీ నిర్ణయాలపైనా దుష్ప్రచారం

టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు, వాటికి వత్తాసు పలికే మీడియా పదే పదే చేస్తున్న దుష్ప్రచారం తీవ్ర దుష్పరిణామాలకు దారి తీస్తోంది. ఇటీవల ఓ ఐజీ, కొందరు ఎస్పీలు, జిల్లా కలెక్టర్లను ఈసీ బదిలీ చేసింది. అనంతరం వారి స్థానాల్లో కొత్త అధికారులను నియమిస్తూ ఈ నెల 4న ఉత్తర్వులిచ్చింది. కొత్తగా నియమితులైన ఆ అధికారులు ఇంకా బాధ్యతలు తీసుకోకముందే వారికి వ్యతిరేకంగా టీడీపీ, బీజేపీ, జనసేన అనుకూల మీడియా మళ్లీ దుష్ప్రచారం మొదలెట్టింది. 'వీళ్లా కొత్త ఎస్పీలు ... సగానికి పైగా వైకాపా విధేయులే' అని కథనాన్ని ప్రముఖంగా ప్రచురించి ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించింది.

పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర

ఇలా రోజూ పెద్ద ఎత్తున చేస్తున్న దుష్ప్రచారం పోలీసు వ్యవస్థ మనో స్థైర్యాన్ని, గౌరవను దెబ్బతీస్తోంది. వాస్తవానికి అధికార యంత్రాంగం ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో పని చేస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి విధులు నిర్వహిస్తోంది. కాబట్టి ఆ మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు కొన్ని పరిమితులకు లోబడి వ్యవహరించాల్సి వస్తోంది. పోలీసు అధికారులు ఎన్నికల విధుల నుంచి పూర్తిగా వైదొలిగేలా చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు, వారికి కొమ్ముకాసే మీడియా కుట్ర పన్నుతోంది. వాస్తవానికి సక్రమంగా ఎన్నికల నిర్వహణ కోసం ఈసీకి విజ్ఞప్తి చేయాల్సిన ప్రతిపక్ష పార్టీలు అందుకు విరుద్ధంగా మీడియాను అడ్డంపెట్టుకుని పోలీసు అధికారులపై దుష్ప్రచారానికే ప్రాధాన్యమిస్తోంది. అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వహించకుండా వారిని బ్లాక్‌మెయిల్ చేసేందుకు యత్నిస్తోంది. తద్వారా రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్నాయి. నిబద్ధతతో పని చేస్తున్న పోలీసు వ్యవస్థ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి క్రియాశూన్యంగా చేయాలని టీడీపీ, బీజేపీ, జనసేనలు కుట్ర పన్నుతున్నాయి. వారి కుట్రతో రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజల్లో సందేహాలు కలిగిస్తే సమాజంలో వైషమ్యాలు చెలరేగే ప్రమాదం ఉంది. మావోలు ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన బృహత్తర బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉంది. ఇంతటి కీలక తరుణంలో కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారుల వరకూ పోలీసు యంత్రాంగం మనోస్థైర్యం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కాబట్టి పోలీసు వ్యవస్థపై జరుగుతున్న దుష్ప్రచారం కట్టడి చేయాలి. ఆ కుట్రకు పాల్పడుతున్న టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు, ఆ పార్టీలకు వత్తాసు పలుకుతున్న పత్రికలు, టీవీ చానళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

రూ.7 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

- నెల్లూరు నుంచి చెన్నైకు వెళ్తున్న వాహనం
- తిరుపతి జిల్లా బూదనం టోల్‌ప్లాజా వద్ద ఘటన



బంగారు వస్తువులు ప్యాక్ చేసి ఉన్న వాహనం

చిల్లకూరు(తిరుపతి జిల్లా): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రహదారిపై తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు రూ.7 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... కోల్‌కతా–చెన్నై 16వ నంబర్ జాతీయ రహదారిపై బూదనం టోల్ ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రం వద్ద పోలీస్ అధికారులు శనివారం నెల్లూరు నుంచి చెన్నైకు వెళ్తున్న మినీ ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో భారీగా బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. వాటికి ఎటువంటి రశీదులు లేవని ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్, ఆదాయ పన్ను, వాణిజ్య పన్నుల శాఖతో పాటుగా ఫ్లైయింగ్ స్క్వాడ్, సెబ్ అధికారులు పెద్ద ఎత్తున స్టేషన్‌కు చేరుకున్నారు. పట్టుబడిన వాహనంలో సుమారు రూ.7 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు ఉన్నాయని వాహనం నడిపే వ్యక్తులు, దానికి సెక్యూరిటీగా వచ్చిన వ్యక్తులు తెలియజేశారు. అయితే అధికారులు మాత్రం బంగారు ఆభరణాలకు చెందిన యజమానులు స్టేషన్‌కు వచ్చి బిల్లులు చూపించిన తర్వాత వివరాలు వెల్లడిస్తామన్నారు. కాగా, చివరికి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలకు రూ.17.27 లక్షలు పన్ను కట్టాల్సి ఉందని, దీన్ని వాణిజ్య పన్నులశాఖ వారికి అప్పగించడం జరుగుతుందని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. అయితే అధికారులు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా రూ.7 కోట్ల బంగారు ఆభరణాలు ఉన్నాయని చెప్పి చివరకు 299 గ్రాముల బంగారు ఆభరణాలకు అపరాధ రుసుము కట్టించేలా చేయడం గమనార్హం.

జనసేన ‘కిక్కు’ దిగింది

బెడిసికొట్టిన మద్యం వ్యూహం

- అనకాపల్లి జిల్లాలో దొరికిన రూ.50 లక్షల విలువైన మద్యం
- యలమంచిలి జనసేన అభ్యర్థికి విక్రయించేందుకు ఒప్పందం
- అడ్డంగా దొరికిపోయిన టీడీపీ నేతలు
- భారీగా గోవా మద్యం పట్టుకున్న పోలీసులు
- మీడియా సమావేశంలో ఎస్పీ మురళీకృష్ణ వెల్లడి



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల బాక్సులు

సాక్షి, అనకాపల్లి: ఎన్నికల్లో ఏదోవిధంగా తాయిలాలతో గెలవాలని, దానికి భారీగా మద్యం అందిస్తేనే ఫలితం ఉంటుందని భావించారు. భారీగా మద్యం తీసుకొచ్చి గంపగుత్తగా ఓట్లు కొల్లగొట్టాలనే ఆలోచనతో టీడీపీ, జనసేన నేతలు దాదాపు 39,163 క్వార్టర్ బాటిళ్ల గోవా నుంచి అక్రమంగా కొనుగోలు చేశారు. దశలవారీగా మద్యాన్ని వినియోగిస్తూ ఎవరికీ అనుమానం రాకుండా గడ్డివాములో దాచి సమావేశాలు నిర్వహించినప్పుడల్లా గుట్టు చప్పుడు కాకుండా బయటకు తీస్తున్నారు. తీరా తీగలాగితే డొంక కదిలినట్లు అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న ముగ్గుర్ని పోలీసులు ప్రశ్నిస్తే బండారం బయటపడింది. అనకాపల్లి జిల్లా యలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌కు మద్యం విక్రయించేందుకు అక్కడి టీడీపీ నాయకుడు కర్రి వెంకటస్వామి చేస్తున్న అక్రమ మద్యం సరఫరా గుట్టురట్టయింది. వారి నుంచి దాదాపు రూ. 50లక్షల విలువైన 7 వేల లీటర్ల గోవా మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ముగ్గురు టీడీపీ నేతలు అరెస్ట్

అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్న సంఘటనపై అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ శనివారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. యలమంచిలి మండలం సోమలింగపాలెంకు చెందిన ప్రధాన నిందితుడు, టీడీపీ నేత కర్రి వెంకటస్వామి అక్రమంగా మద్యం తీసుకువచ్చి విక్రయిస్తుంటాడు. అతనికి అదే గ్రామానికి చెందిన కర్రి ధర్మతేజ, బొడ్డేటి దినేష్‌కుమార్ సహకరించారు. పది రోజుల క్రితం గోవా నుంచి సరుకు తెప్పించి, యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగంపాలెంలోని తన పశువుల పాక వద్ద గడ్డివాములో దాచిపెట్టాడు. ఈ మద్యాన్ని యలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌కు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఒక్కసారిగా ఇస్తే పోలీసులకు దొరికిపోయే ప్రమాదం ఉందని సమావేశాలు నిర్వహించినప్పుడల్లా వెంకటస్వామి మద్యం అందించేవాడు. శనివారం మధ్యాహ్నం మునగపాక గ్రామంలో అక్రమ మద్యం రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారంతో మునగపాక ఎస్సై ఆధ్వర్యంలో పోలీసు బృందం తనిఖీలు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు రెండు మోటార్ సైకిళ్లపై అనుమానాస్పద వస్తువులను పట్టుకెళుతున్నట్టు గమనించి వారి లగేజ్‌ను తనిఖీ చేశారు. దీంతో వారి వద్ద 5 కేసుల్లో 180 మిల్లీ లీటర్లు కలిగిన 240 రాయల్ బ్లూ లిక్కర్ బాటిళ్లు లభ్యమయ్యాయి. అంతేగాక మరి కొంత మద్యాన్ని దాచిపెట్టినట్లు చెప్పడంతో గడ్డివాము వద్ద భారీ ఎత్తున దాచిన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అక్రమ మద్యం ఎవరెవరికి సరఫరా చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. డంపు వెనక ఎవరున్నారు, అనే విషయాలను విచారిస్తున్నామని ఎస్పీ చెప్పారు. దీని వెనుక ఎవరున్నా అరెస్టు చేస్తామన్నారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, యలమంచిలి సీఐ గఫూర్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి అనకాపల్లి జిల్లా జడ్జి వద్ద హాజరు పరిచారు. నిందితుల నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి జనసేన బెదిరింపు

- గన్‌తో చంపుతానని బెదిరించిన ఎంపీ బాలశౌరి
- జనసేన బరిలో ఉన్న స్థానాల్లో పోటీ చేయొద్దని దౌర్జన్యం
- బీఫామ్‌లను లాక్కొన్న వైనం
- నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ ఖాన్

తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్‌లో పోటీ చేయడానికి వీలు లేదంటూ జనసేన పార్టీ నేతలు తనను బెదిరించి బీఫామ్ పత్రాలు లాక్కున్నారని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ ఖాన్ ఆరోపించారు. జనసేన పోటీ చేసే స్థానాల్లో ఎన్నికల బరి నుంచి తప్పుకోవాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి తన తలపై గన్ పెట్టి బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో షేక్ జలీల్‌ఖాన్ మాట్లాడారు. జనసేన పార్టీ ఎన్నికల గుర్తు గ్లాసు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ గుర్తు బకెట్ రెండూ ఒకే పోలికతో ఉండటంతో తనను 15 రోజులుగా జనసేన నేతలు బాలశౌరి, నాదెండ్ల మనోహర్ బెదిరిస్తున్నారని ఆరోపించారు. రూ.5 కోట్లు ఇస్తామని, బీఫామ్‌లు తమకిచ్చేయాలని బాలశౌరి ఒత్తిడి చేశారన్నారు. రెండుసార్లు ఇదే విషయమై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌తో ఫోన్‌లో మాట్లాడించారని చెప్పారు. తాను ఒప్పుకోకపోవడంతో జనసేన కార్యకర్తలతో చంపిస్తామని మనోహర్ బెదిరించారన్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి విజయవాడ ఐలాపురం హోటల్ వద్ద ఉన్న తనను వల్లభనేని బాలశౌరి గన్ పెట్టి బెదిరించారన్నారు. తన వద్ద ఉన్న నవరంగ్ కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌లు లాక్కున్నారని వాపోయారు.

పవన్ నీచ రాజకీయాలు

బీజేపీతో కలసి మైనార్టీలను అణగదొక్కేందుకు పవన్ నీచ రాజకీయాలు చేస్తున్నారని జలీల్ ఖాన్ మండిపడ్డారు. పవన్ కళ్యాణ్‌పై పిఠాపురంలోనూ తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. ఇప్పటికే డీజీపీ కార్యాలయంలో బాలశౌరిపైన, ఆయనకు సహకరించిన పవన్, మనోహర్‌పైనా ఫిర్యాదు చేశామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. బీజేపీతో పొత్తు పెట్టుకుని మైనార్టీలను సర్వనాశనం చేసిన చంద్రబాబుతో జతకట్టిన పవన్‌కు రాష్ట్ర ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

దళిత ఎమ్మెల్యే అభ్యర్థిపై వివక్ష



రూపానందరెడ్డి సమక్షంలో నిలబడి ఉన్న జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ (కుడివైపు)

ఓబులవారిపల్లె: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌కు అవమానం జరిగింది. టీడీపీ ఉన్నతవర్గ నాయకులు ఆయనపై దళితుడన్న వివక్షను చూపించారు. ముక్కావారిపల్లెలో ఓ మహిళ మృతి చెందడంతో రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తన వర్గంతో అక్కడికి వెళ్లారు. అందరూ కుర్చీలో కూర్చొని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి అరవ శ్రీధర్‌ను మాత్రం నిలబెట్టారు. టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి దళితులపట్ల, దళిత ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్ పట్ల వివక్ష చూపడంపై జిల్లాలోని వివిధ దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

న్యాయవాద వృత్తి ఉన్నతమైనది

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్



గురుస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయమూర్తులు

తిరుపతి లీగల్: న్యాయవాది వృత్తి ఉన్నతమైనదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అన్నారు. తిరుపతిలోని కళ్యాపి ఆడిటోరియంలో సీనియర్ న్యాయవాది దివంగత ఇరుగు గురుస్వామి చిత్రపటం ఆవిష్కరణ కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ ఉజ్జల్ భుయాన్ మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య పెరుగుతుండడం బాధాకరమన్నారు. కొన్ని క్రిమినల్ అప్పీల్ కేసులలో శిక్ష పడినకాలం కంటే ఎక్కువకాలం నిందితులు జైల్లో ఉండాల్సి వస్తోందన్నారు. తిరుపతి కోర్టుల్లో 1999 సంవత్సరం కేసులు కూడా ఇప్పటికీ పెండింగ్ ఉన్నట్లు తెలిసిందన్నారు. న్యాయవ్యవస్థ గౌరవం న్యాయమూర్తులు, న్యాయవాదులపై ఆధారపడి ఉందన్నారు. కింది కోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసినప్పుడే న్యాయవాద వృత్తికి పరిపూర్ణత వస్తుందని పేర్కొన్నారు. కింది కోర్టులు న్యాయవ్యవస్థకు మూలాలని అన్నారు. కోర్టుల్లో కేసులు దాఖలు చేసిన వారికి తమ కేసు ఎంతకాలంలో పరిష్కారం అవుతుందో తెలియాల్సి ఉందన్నారు. ఐదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలన్నారు. న్యాయవాది వృత్తి టీ20 మ్యాచ్ లాంటిది కాదని, ఎవరూ రాత్రికి రాత్రే ఉన్నత స్థానాలకు ఎదగలేరన్నారు. యువ న్యాయవాదులు తమ సీనియర్ న్యాయవాదుల ప్రాక్టీసును గుర్తిస్తూ పూర్తికాలం న్యాయవాద వృత్తిలో ఉండి క్రమశిక్షణతో ఎదగాలని సూచించారు. దొడ్డిదారిన ఎవరికీ విజయం, డబ్బు రావని, కష్టపడితేనే వృత్తిలో రాణిస్తారన్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు మాట్లాడుతూ న్యాయవాదులు తన క్లయింట్ పట్ల ప్రవర్తన బాగున్నప్పుడే వృత్తిలో రాణిస్తారని చెప్పారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఒక లక్ష్యం నిర్ణయించుకుని న్యాయవాద వృత్తిలో ముందుకు సాగాలని, వాస్తవాలను దాచిపెట్టి కేసు విచారణ చేపట్టవద్దని సూచించారు. రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ప్రస్తుతం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు మాట్లాడుతూ దివంగత సీనియర్ న్యాయవాది గురుస్వామి వద్ద తాను జూనియర్ న్యాయవాది కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. సమయపాలన, వృత్తిలో కష్టపడేతత్వం తదితర విషయాలను ఆయన నుంచి నేర్చుకున్నానని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు, టీటీడీ ఆఫీసర్ వీర్రాజు, తిరుపతి, చిత్తూరుకు చెందిన న్యాయమూర్తులు, అంబేడ్కర్ న్యాయ కళాశాల కరస్పాండెంట్ తిప్పారెడ్డి, గురుస్వామి కుటుంబ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను గురుస్వామి జూనియర్ న్యాయవాదులు సన్మానించారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



వాహనంలో క్షేమంగా ఉన్న తల్లీబిడ్డ

మహానంది: పురిటి నొప్పులతో ఆస్పత్రికి బయలుదేరిన ఓ మహిళ 108లో పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఘటన నంద్యాల జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళితే... రుద్రవరం మండలం చిన్నకంబలూరు గ్రామానికి చెందిన సుజాతకు శనివారం పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే 108కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న మహానంది 108 అంబులెన్స్ ఈఎంటీ రాజయ్య, పైలట్ దస్తగిరి వెంటనే గ్రామానికి చేరుకున్నారు. గాజులపల్లె ఆస్పత్రికి తీసుకెళ్తుండగా పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో సిబ్బంది వాహనాన్ని ఆపి ఆశా కార్యకర్త, గర్భిణి సుజాత కుటుంబ సభ్యుల సాయంతో అంబులెన్స్‌లోనే ప్రసవం చేయించారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారు.

98.88 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

- 64,96,183 మంది లబ్ధిదారులకు రూ.1,931.33 కోట్లు అందజేత
- రేపు కూడా కొనసాగనున్న పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ 98.88 శాతం పూర్తయింది. శనివారం సాయంత్రం వరకు 64,96,183 మంది లబ్ధిదారులకు రూ.1,931.33 కోట్లు పంపిణీ చేశారు. ఏప్రిల్‌కు గాను ప్రభుత్వం 65,69,904 మందికి పంపిణీ చేసేందుకు రూ.1,951.69 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. అధికారులు తొలుత శనివారం వరకే పింఛన్ల పంపిణీ కొనసాగించాలని నిర్ణయించారు. అయితే మిగిలిన ఆ ఒక్క శాతం మందికి కూడా పింఛన్ అందజేసేందుకు సోమవారం వరకు పంపిణీ కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సెర్ప్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం అందించామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు అత్యంత అనుకూలుడుగా పేరున్న నిమ్మగడ్డ రమేష్‌కు చెందిన సిటిజన్ ఫర్ డెమోక్రసీ ఫిర్యాదుల మేరకు పింఛన్ల పంపిణీ ప్రక్రియ నుంచి వలంటీర్లను తప్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీంతో లబ్ధిదారులు సచివాలయాలకు వచ్చి పింఛన్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు టీడీపీ కుట్రలతో మళ్లీ నాటి పరిస్థితులే దాపురించాయి.



నన్ను కరుణింపుము దేవా నన్ను కరుణింపుము.
నేను నీ శరణుజొచ్చి యున్నాను. ఈ ఆపదలు తొలగిపోవు వరకు
నీ రెక్కల నీడను శరణుజొచ్చి యున్నాను.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం,
ఉత్తరాయణం, శిశిర ఋతువు
ఫాల్గుణ మాసం, **తిథి:** బ.చతుర్దశి రా.2.47 వరకు, తదుపరి అమావాస్య,
నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.11.51 వరకు తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** రా.8.48 నుండి 10.16 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.35 నుండి 5.23 వరకు, **అమృతఘడియలు:** తె.5.10 నుండి 7.11 వరకు (తెల్లవారితే సోమవారం).

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

కుమారస్వామి (మాజీ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

మాండ్య, హసన్, కోలార్... ఈ మూడు సీట్లిచ్చి... "సరిపోతాయి కదా కుమార్ స్వామీజీ?!" అని మోదీజీ అన్నప్పుడు... కనీసం ఇంకో రెండు సీట్ల కోసమైనా పట్టుబట్టి ఉండాల్సిందని నేనేమీ అనుకోలేదు. కనీసం ఇంకో రెండు సీట్లయినా మోదీజీ ఇచ్చి ఉంటే... మొత్తం 28 సీట్లలో బీజేపీకి 23 సీట్లు, జేడీఎస్‌కి 5 సీట్లు అన్నట్లుగా లెక్కకు బావుండేదని మాత్రం మనసులో అనుకున్నాను.

మనసులోనే మళ్లీ మరొకటి అనిపించింది. జేడీఎస్ ఎన్డీయేలో ఒక మిత్రభాగం అయినప్పుడు సీట్లకు లెక్కేమిటి, లెక్కకు బాగుండేదేమిటి?! 25+3 అయినా, 23+5 అయినా, 27 +1 అయినా, అసలు 28+0 అయినా లెక్క ఒకటే కదా అని!

ప్లస్‌గా ఉన్నామన్నదే లెక్క కానీ, ప్లస్‌కు అటెన్ని ఇటెన్ని అని లెక్కేసుకుంటూ పోతే మొత్తానికే మైనస్ అయిపోతాం. ఆ లెక్క నాకు తెలుసు కనుకే... "సరిపోతాయి కదా కుమార్ స్వామీజీ?!" అని మోదీజీ అనగానే నేనేమీ ఎక్కువ తక్కువ మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వాను.



నాన్నగారు ప్రధానిగా ఉన్న కాలంలో నాతో అంటుండేవారు – ఎక్కువ తక్కువ మాట్లాడవలసి వచ్చినప్పుడు చిరునవ్వుతో సరిపుచ్చాలని, లేదంటే చిన్న కునుకైనా తీయాలని! అంతే తప్ప, కినుక వహించినట్లు బయటికి కనిపించకూడదని!

"సంతోషమేనా?!" అన్నారు మోదీజీ, మాండ్యకు నేను నామినేషన్ వేసి బయటికి వచ్చీరాగానే నాకు ఫోన్ చేసి!!

ఆశ్చర్యచకితుణ్ణి అయ్యాను. మోదీజీ ప్రతి చిన్న విషయాన్నీ ఎలా పట్టించుకోగలుగుతున్నారు!

"కుమార్ స్వామీజీ... ఏంటి మాట్లాడరు?! సంతోషమేనా?" అని మళ్లీ అడిగారు మోదీజీ.

"ఆ... ఆ... సంతోషమే మోదీజీ! సంతోషంలో వెంటనే మాట్లాడలేకపోయా నంతే. ఈసారి కూడా ప్రధాని మీరే..." అన్నాను నేనూ నవ్వుతూ.

"హో హ్హ హో..." అంటూ ప్రసంగ ధ్వనితో పెద్ద పెట్టున నవ్వి... "అంటే మాండ్యలో మీరు ఎంపీగా గెలిచి, నన్ను మళ్లీ ప్రధానిని చేయబోతున్నారన్న మాట..." అన్నారు మోదీజీ.

"నేనొక్కడినే కాదు మోదీజీ... నాతో పాటుగా జేడీఎస్‌లోని మిగతా ఇద్దరు ఎంపీ అభ్యర్థులు, దేశంలోని తక్కిన 397 మంది... మొత్తం 400 మంది ఎన్డీయే అభ్యర్థులు మీరు ఆశించినట్లుగా మిమ్మల్ని మళ్లీ ప్రధానిగా గెలిపించబోతున్నారు..." అన్నాను.

మరొకసారి మనస్ఫూర్తిగా నవ్వారు మోదీజీ. ఆ నవ్వులోనే నా మాటల్ని కలిపేస్తూ... "మోదీజీ... నాదొక విన్నపం" అన్నాను.

"ఆ విన్నపం ఏమిటో నాకు తెలుసు కుమార్ స్వామీజీ... ట్రాక్టర్ తప్ప కారు లేని ఎంపీ మూడో టర్మ్ మోదీ గవర్నమెంటులో కేంద్ర వ్యవసాయ మంత్రి అంటే దేశానికీ ప్రతిష్ఠే కదా..." అన్నారు మోదీజీ.

"ధన్యవాదాలు మోదీజీ" అన్నాను.

"మీ అఫిడవిట్‌లో మీరు వ్యవసాయవేత్త అని రాసుకున్నారు. ఆ తర్వాతే రాజకీయవేత్త అని రాశారు. అది కూడా నాకు నచ్చింది..." అన్నారు మోదీజీ!

మళ్లొకసారి ఆశ్చర్యచకితుణ్ణయ్యాను. మోదీజీ ఇంత సూక్ష్మంగా చూస్తారా!!

"మా తాత గారు దొడ్డె గౌడ వరి పండించేవారు మోదీజీ. ఆయన అడుగు జాడల్లో, మీ అనుగ్రహంతో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా రైతుల కలల్ని పండిద్దామని అనుకుంటున్నాను..." అన్నాను.

మోదీజీ నవ్వారు. "అందరం గెలవాలి..." అన్నారు. ఆ వెంటనే ఫోన్ పెట్టేశారు.

సాయంత్రం గోధూళి వేళ... నేను ఇంటికి చేరుకునే సమయానికి... "డియర్ హెచ్.డి. కుమారస్వామి... మీతో కాస్త మాట్లాడవచ్చా?" అని మెసేజ్! ఆ మెసేజ్ ఇచ్చింది శ్రీ అర్జున్ ముండా! కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి!!

మోదీజీ సూక్ష్మంగా చూడటం మాత్రమే కాదు, సూక్ష్మంగా ఆలోచించి కూడా ఉండాలి. సూక్ష్మంగా ఆలోచిస్తేనే మోదీజీకైనా, మరొకరికైనా సెకండ్ థాట్స్ వస్తాయి.

ఒక అత్యాశ... ఒక అసూయ... ఒక మాయావి!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



పురందేశ్వరి

భారతీయ జనతా పార్టీ ఏపీ శాఖకు అధ్యక్షురాలు. ఎన్టీ రామారావు కూతురు అనే అర్హత ఆమెకు రాజకీయ ఆశ్రయాన్ని కల్పించింది. తాజా హోదాకు కూడా కారణమైంది. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబు, రామోజీల తర్వాత ఈమె పాత్రే ముఖ్యమైనదని లక్ష్మీపార్వతి ఇప్పటికీ చెబుతూనే ఉన్నారు. తండ్రి షాజహాన్‌కూ, పెద్దన్న దారాషికోకూ వెన్నుపోటు పొడిచిన ఔరంగజేబుతో చంద్రబాబును ఎన్టీఆర్ పోల్చారు. చంద్రబాబు ఔరంగజేబయితే లక్ష్మీపార్వతి లెక్క ప్రకారం పురందేశ్వరిది రోషనారా పాత్ర అవుతుంది. అంతఃపుర కలహాల్లో చిన్నక్క రోషనారా చేసిన సాయానికి గుర్తుగా తాను రాజైన పిదప ఔరంగజేబు ఆమెను అందలాలెక్కించి కృతజ్ఞతను ప్రకటించుకున్నాడు. ఎన్టీఆర్ కుటుంబం 'చిన్నమ్మ'గా పిలుచుకునే పురందేశ్వరి పట్ల చంద్రబాబు అటువంటి కృతజ్ఞత ప్రకటించుకోలేదని ఆమె క్యాంపు కినుకతో ఉండేది. చంద్రబాబు మోసంపై పురందేశ్వరి భర్త ఓ పుస్తకం కూడా రాశాడు.

షర్మిల

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోదరి. మూడేళ్ల కింద తండ్రి పేరుతో తెలంగాణలో ఒక పార్టీ పెట్టారు. పార్టీ ఎందుకు పెట్టారన్నది ఎవరికీ అర్థం కాలేదు. ఏపీలో అన్న ముఖ్యమంత్రి అయ్యారు కనుక తెలంగాణలో తానెందుకు కాకూడదన్న ఆరాటం తప్ప మరో హేతుబద్ధమైన కారణం కనిపించలేదు. కనుకనే ఆ ప్రాంతంలో వైఎస్ అభిమానులు లక్షల సంఖ్యలో ఉన్నా పార్టీలో చేరడానికి ఎవరూ ముందుకు రాలేదు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ పెట్టడంలోని ఔచిత్యాన్ని వారు ప్రశ్నించారు. అటువంటి వారికి షర్మిల ఘాటుగానే సమాధానం చెప్పారు. తెలంగాణ తాను మెట్టినిల్లనీ, తనకిక్కడ సర్వహక్కులున్నాయనీ ఢంకా భజాయించారు. అయితే తాను మెట్టినవారి ఇంటి పేరు మొరుసుపల్లిని మాత్రం ఆమె స్వీకరించలేదు. స్వీకరించాలనే రూల్ కూడా ఏమీ లేదు. తాను ఏ ఇంటి పేరు స్వీకరించాలో నిర్ణయించుకునే అధికారం ప్రతి మహిళకూ ఉంటుంది. కాకపోతే మెట్టినింటి ఆధారాలతో పొలిటికల్ క్లెయిమ్ పెట్టినప్పుడు ఇటువంటి ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. తలెత్తాయి.

చంద్రబాబు నాయుడు

వయోభారం మీద పడింది. ఈసారి గెలిస్తేనే పార్టీ బతుకుతుంది. కొడుకు రాజకీయ భవిష్యత్తు నిలబడుతుంది. కానీ క్షేత్రనాడి బలహీనంగా కొట్టుకుంటున్నది. ఆయన దగ్గర ఎన్నికల ఎజెండా లేదు. ఎజెండాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్ణయించేశారు. 'నా పరిపాలన వల్ల మీ ఇంట్లో మంచి జరిగితేనే నాకు ఓటేయండి. మీ ఊరికి మంచి జరిగిందనుకుంటేనే నాకు స్టార్ క్యాంపెయినర్లుగా నిలబడండ'ని జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. చరిత్రలో ఇంత సూటిగా, ఇంత నిక్కచ్చిగా చెప్పగలిగిన నేత వైఎస్ జగన్ మాత్రమే. ఐదేళ్ల పారదర్శక పాలన ఇచ్చిన ఆత్మవిశ్వాసం అది. ఈ ఛాలెంజ్‌ను చంద్రబాబు స్వీకరించలేకపోతున్నారు. తాను పాలించిన ఐదేళ్లలో మంచి జరిగితేనే ఓటేయండనే ధైర్యం చంద్రబాబుకు లేదు. ఛాలెంజ్ స్వీకరించకపోతే తాను చేసిన మంచి ఇసుమంతైనా లేదని అంగీకరించినట్టే! అందుకే ఆయన మల్లగుల్లాలు పడుతున్నారు. ఎజెండాల మీద చర్చలు జరగవద్దు. పొత్తులతో నెట్టుకుని రావాలి. దుష్ప్రచారంతో పబ్బం గడుపుకోవాలి. యెల్లో ముఠా ముందున్న ఆప్షన్లు ఇవే!

పురందేశ్వరి

తండ్రి అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని నంజుకోవడం కుదరలేదు. లక్ష్మీపార్వతిని అడ్డు తొలగిస్తే కుదురుతుందని చంద్రబాబు, రామోజీ నమ్మబలికారు. ఎన్టీ రామారావును గద్దె దింపకుండా లక్ష్మీపార్వతి అడ్డును తొలగించలేమని తీర్మానించారు. సోదర సోదరీమణులందరిలోకీ తెలివైనదిగా పేరున్న పురందేశ్వరికి కూడా ఈ తీర్మానంలో నిజాయితీ కనిపించింది. ఆపరేషన్ వైస్రాయ్‌కు తోబుట్టువులను సిద్ధం చేసింది ఆమేననే ప్రచారం ఉన్నది. వ్రతం చెడింది కానీ ఫలం దక్కలేదు. ఈసారి తాను మారిన మనిషినని బంధువర్గ సర్వసభ్య సమావేశంలో చంద్రబాబు ప్రకటించారట! పులి ముసలిదైపోయింది. శాకాహారిగా మారిపోయింది. బంగారు కడియాన్ని కూడా నమల్లేకపోతున్నది. మనం కలిసుంటే పిల్లలు సంయుక్తంగా నములుకుంటారని ప్రతిపాదించారట! తాము మిస్సయిన బస్సు తమ

> చంద్రబాబుకు వయోభారం మీద పడింది. ఈసారి గెలిస్తేనే పార్టీ బతుకుతుంది. కొడుకు రాజకీయ భవిష్యత్తు నిలబడుతుంది. కానీ క్షేత్రనాడి బలహీనంగా కొట్టుకుంటున్నది. ఆయన దగ్గర ఎన్నికల ఎజెండా లేదు. ఎజెండాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్ణయించేశారు. 'నా పరిపాలన వల్ల మీ ఇంట్లో మంచి జరిగితేనే నాకు ఓటేయండి. మీ ఊరికి మంచి జరిగిందనుకుంటేనే నాకు స్టార్ క్యాంపెయినర్లుగా నిలబడండని జగన్ పిలుపునిచ్చారు. చరిత్రలో ఇంత సూటిగా, ఇంత నిక్కచ్చిగా చెప్పగలిగిన నేత వైఎస్ జగన్ మాత్రమే. ఐదేళ్ల పారదర్శక పాలన ఇచ్చిన ఆత్మవిశ్వాసం అది. ఈ ఛాలెంజ్‌ను చంద్రబాబు స్వీకరించలేకపోతున్నారు. తాను పాలించిన ఐదేళ్లలో మంచి జరిగితేనే ఓటేయండనే ధైర్యం చంద్రబాబుకు లేదు. ఛాలెంజ్ స్వీకరించకపోతే తాను చేసిన మంచి ఇసుమంతైనా లేదని అంగీకరించినట్టే! అందుకే ఆయన మల్లగుల్లాలు పడుతున్నారు. ఎజెండాల మీద చర్చలు జరగవద్దు. పొత్తులతో నెట్టుకుని రావాలి. దుష్ప్రచారంతో పబ్బం గడుపుకోవాలి. యెల్లో ముఠా ముందున్న ఆప్షన్లు ఇవే!

వారసుడికి దొరికితే దగ్గుబాటి కుటుంబానికి ఇంకేమి కావాలి? చంద్రబాబు ఎటువంటి హామీ ఇచ్చారో తెలియదు కానీ డీల్ కుదిరింది. పురందేశ్వరికి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కడానికి చంద్రబాబు – రామోజీలు కలిసి ఆరెస్సెస్‌లో కదపాల్సిన పావులన్నీ కదిపి చివరికి కృతకృత్యులయ్యారని సమాచారం. ఎన్నికలు పూర్తయ్యేలోగా ఆమె నిర్వహించవలసిన పాత్రకు సంబంధించిన స్క్రిప్టు పుస్తకాన్ని ఆమె చేతిలో పెట్టారు.

షర్మిల

తాను పాదయాత్ర చేస్తే ఓట్లు జలజలా రాలతాయనే మూఢ నమ్మకం ఏదో షర్మిలకు ఉండేదట! ఆ నమ్మకాన్ని యెల్లో మీడియా పెద్దలు మరింత ఎగదోశారు. తెలంగాణలో ఆ నమ్మకం వమ్మయింది. వైఎస్సార్, వైఎస్ జగన్‌లలో ఉన్న 'మాట తప్పని – మడమ తిప్పని' లక్షణం షర్మిలలో ఏ కోశానా కనిపించలేదు. తెలంగాణలోనే ఆమె పలుమార్లు నాలుక మడతేశారు. దీంతో ఉన్న కొద్దిపాటి అనుచరుల్లోనూ భ్రమలు పటాపంచలైపోయాయి. 'చావైనా బతుకైనా తెలంగాణ'తోనే అంటూ ఆమె చేసిన ప్రకటన హాస్యాస్పదంగా మిగిలిపోయింది. 'ఏ పార్టీతో పొత్తు పెట్టుకోను, 119 సీట్లలో ఒంటరిగా పోటీ చేస్తాన'ని పలుమార్లు చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చకుండా చూడటం తమ పనికాదని చెప్పారు. అదే నోటితో వ్యతిరేక ఓటును చీల్చడం ఇష్టం లేదు. అందుకే కాంగ్రెస్‌తో పొత్తుకోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఏడాది తిరక్కుండానే కాంగ్రెస్ పిలుపు కోసం తహతహలాడారు. రేవంత్‌రెడ్డిని తిట్టని తిట్టు లేదు. ఆయన సీఎం కావడమే తరువాయి, ఆమె స్వరంలో చిత్రమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఆమె నిలకడలేనితనంపై అప్పటికే అవగాహన ఉన్నందువల్ల ఆమె స్వర విన్యాసాలను ఎవరూ పట్టించుకోలేదు. ఈ దశలో యెల్లో పెద్దలు మళ్లీ రంగంలోకి దిగారు. చంద్రబాబుకు రెండు అవసరాలున్నాయి కదా! బీజేపీతో పొత్తు – పొత్తు ద్వారా కలిగే ప్రయోజనాలు పొందడం మొదటిది. ఇందుకోసం పురందేశ్వరి డీల్. రెండోది జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారం. యెల్లో మీడియా దిగంబర ప్రదర్శన జనంలో వెగటు పుట్టిస్తున్నది. కొత్త గొంతుకతో యెల్లో పలుకులు పలకాలి. ఆ గొంతుక జగన్ ఇంటి నుంచే వస్తే ఇంకేం కావాలి? చకచకా ఏర్పాట్లు జరిగాయి. ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి షర్మిలను వరించేట్టుగా శకుని పాచికలు విసిరాడు. తల బీజేపీలో, మొండెం టీడీపీలో ఉండే సీఎం రమేశ్‌కు చెందిన ప్రైవేట్ విమానాలు అటూ ఇటూ పరుగులు తీశాయి. కొసమెరుపు ఏమిటంటే మొన్న కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాను విడుదల చేయడానికి కూడా సదరు బీజేపీ నాయకుడి విమానంలోనే షర్మిల కడపకు వెళ్లారు. తన ఉపన్యాసాల్లో మాటిమాటికీ రాజశేఖరరెడ్డి బిడ్డనని చెప్పుకునే షర్మిల ఆయన మరణానంతరం అవినీతి కేసులో ఆయన పేరు చేర్చిన కాంగ్రెస్‌లో చేరడంపై ఇప్పటికీ సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేకపోయారు. అలా చేర్చినట్టు సోనియాకూ, రాహుల్‌కూ తెలియదట! 'ఈ విషయం నాకు ప్రత్యేకంగా చెప్పార'ని షర్మిల చెప్పారు. క్విడ్ ప్రో కో కేసుల్లో విధాన నిర్ణయాలపై ప్రభుత్వాధి నేత పేరు లేకుండా బయటి వ్యక్తిపై కేసు ఎట్లా పెడతారు? సోనియాకు, రాహుల్‌కు తెలియదనడం చెవుల్లో పూలు పెట్టడంకాదా!

చంద్రబాబునాయుడు

అన్నిరకాల పొత్తుల్నీ జాగ్రత్తగానే అల్లుకుంటూ వచ్చాడు. ఇంటి ముందు 'ఎన్డీఏ' బోర్డు పెట్టుకున్నాడు. దొడ్లో ఇండియా కూటమిని కట్టేసుకున్నాడు. ఒక్క వైసీపీ తప్ప ఎవ్వరూ వ్యతిరేకం కాదు. అయినా గ్రాఫ్ వేగంగా పడిపోతున్నది. గుండె లయ తప్పుతున్నది. మాటలు తడబడుతున్నవి. దుష్ప్రచారాన్ని ఇప్పటికే ఆరున్నొక్క రాగంతో హైపిచ్‌కు తీసుకెళ్లారు. అయినా ఏదో వెలితి. రెండు జాతీయ పార్టీల రాష్ట్ర శాఖల అధ్యక్షురాళ్లతో సమన్వయం కుదిరినా కూటమిలో కళ లేదు, కలవరం తప్ప! రెండు జాతీయ పార్టీల రాష్ట్ర శాఖలను ఇద్దరు మహిళలే నడిపిస్తున్నందుకు గర్వపడాలో, ఒక ప్రాంతీయ పార్టీకి ఆ రెండు పార్టీల ఆఫీసులు సబ్–స్టేషన్‌లుగా మారినందుకు క్షోభ పడాలో తెలియని పరిస్థితి రాష్ట్ర ప్రజలది!

యెల్లో కార్డ్

రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా నియుక్తురాలైనప్పటి నుంచి టీడీపీ ప్రయోజనాలకే పురందేశ్వరి పెద్దపీట వేస్తున్నారని బీజేపీ కాషాయ టీమ్ వాపోతున్నది. టిక్కెట్ల పంపిణీలోనూ యెల్లో టీమ్‌కే పెద్దపీట వేశారన్న విమర్శలు వెల్లువెత్తాయి. బీజేపీ పోటీ చేస్తున్నదే 10 అసెంబ్లీ సీట్లకు! కానీ 22 మంది ఉన్నతాధికారులను తొలగించాలని, వారి స్థానంలో ఫలానా వారిని నియమించాలని బీజేపీ అధ్యక్షురాలి హోదాలో ఆమె ఎన్నికల సంఘానికి రాసిన లేఖ వివాదాస్పదంగా మారింది. చంద్రబాబు – రామోజీల డ్రాఫ్టు కింద ఆమె సంతకం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక షర్మిల కూడా యెల్లో కూటమి ప్రయోజనాలకు అనుగుణంగానే ప్రచారాన్ని ప్రారంభించారు. వివేకానందరెడ్డి హత్య

> బీజేపీకి జగన్ బానిసగా మారాడట! ఒక ముఖ్యమంత్రి బాధ్యతాయుతమైన వైఖరితో కేంద్రంతో సఖ్యంగా ఉంటే బానిసగా మారడమా? కేంద్రంలో జనతా పార్టీ ఉన్నా, కాంగ్రెస్ ఉన్నా ఎంజీఆర్ సఖ్యంగానే ఉండేవారు. ఆయన బానిసగా మారినట్టా? ఇప్పుడు నవీన్ పట్నాయక్ కూడా అదే వైఖరి అవలంబిస్తున్నారు. ఒడిశాకు ఈ విధానం వల్ల ప్రయోజనం కలుగుతున్నది. కేంద్ర – రాష్ట్ర సంబంధాలు అనేవి ఒక విధానపరమైన నిర్ణయం. దీనికి పార్టీల ఐడియాలజీలతో సంబంధం లేదు. బీజేపీకి జగన్ బానిసగా మారితే ఎన్డీఏలోనే చేరేవాడు కదా! వైసీపీ సిద్ధాంతాలకూ, బీజేపీ సిద్ధాంతాలకు పొసగదు కనుకనే జగన్ పార్టీ ఒంటరి పోరాటం చేస్తున్నది. ఇక వివేకా హత్యపై యెల్లో కూటమి చేస్తున్న ఆరోపణలను మరింత బలంగా షర్మిల వినిపిస్తున్నారు. ఆమెకు చంద్రబాబు అప్పగించిన బాధ్యత కూడా అదే కదా! ఈ హత్యపై వివిధ కోణాల్లో తలెత్తుతున్న సందేహాలన్నీ షర్మిల పక్కన తిరుగుతున్న సునీత కుటుంబం వైపే వేలెత్తి చూపుతున్నాయి. అయినా విచారణ పూర్తి కాలేదు కనుక బాధ్యత కలిగిన వ్యక్తులుగా ఎవరినీ హంతకులని సంబోధించడం లేదు. అటువంటి నాగరికమైన కట్టుబాటును కూడా షర్మిల గిరాటేశారు. చట్టాన్నీ, ఎన్నికల నియమావళిని కూడా ఉల్లంఘించారు. అవినాశ్‌రెడ్డిని పదేపదే హంతకుడని సంబోధించారు.

కేసులో జగన్ ప్రభుత్వాన్ని నిందించడం, ముస్లిం, మైనారిటీ ఓట్లను దూరం చేయడం అనే డబుల్ యాక్షన్ ప్రోగ్రామ్‌ను షర్మిలకు అప్పగించారు. ఈ కర్తవ్యంలో ఆమె టీడీపీ నేతలను కూడా మించిపోయి మాట్లాడుతున్నారు. మణిపూర్‌లో అల్లర్లు జరిగితే జగన్ ఖండించలేదట. మణిపూర్ అల్లర్ల నేపథ్యమేమిటి? దానికి మతం రంగు పులమాలని ఎందుకు ప్రయత్నిస్తున్నారు? కొండ ప్రాంతంలోని ప్రజలకూ, మైదాన ప్రాంత ప్రజలకూ మధ్యన చెలరేగుతున్న భూసమస్య. తెగల సమస్య. ఈశాన్య రాష్ట్రాలు కేంద్రం స్పందించాల్సిన సమస్య. భారత్‌లోని ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ఉక్రెయిన్‌పై రష్యా చేసిన దాడిని కూడా ఖండించవచ్చు. కానీ ప్రయోజనముంటుందా? ఉక్రోషం ఎక్కువైతే చేసే విమర్శల్లో పస ఉండదు.

బీజేపీకి జగన్ బానిసగా మారాడట! ఒక ముఖ్యమంత్రి బాధ్యతాయుతమైన వైఖరితో కేంద్రంతో సఖ్యంగా ఉంటే బానిసగా మారడమా? కేంద్రంలో జనతా పార్టీ ఉన్నా, కాంగ్రెస్ ఉన్నా ఎంజీఆర్ సఖ్యంగానే ఉండేవారు. ఆయన బానిసగా మారినట్టా? ఇప్పుడు నవీన్ పట్నాయక్ కూడా అదే వైఖరి అవలంబిస్తున్నారు. ఒడిశాకు ఈ విధానం వల్ల ప్రయోజనం కలుగుతున్నది. కేంద్ర – రాష్ట్ర సంబంధాలు అనేవి ఒక విధానపరమైన నిర్ణయం. దీనికి పార్టీల ఐడియాలజీలతో సంబంధం లేదు. బీజేపీకి జగన్ బానిసగా మారితే ఎన్డీఏలోనే చేరేవాడు కదా! వైసీపీ సిద్ధాంతాలకూ, బీజేపీ సిద్ధాంతాలకు పొసగదు కనుకనే జగన్ పార్టీ ఒంటరి పోరాటం చేస్తున్నది. ఇక వివేకా హత్యపై యెల్లో కూటమి చేస్తున్న ఆరోపణలను మరింత బలంగా షర్మిల వినిపిస్తున్నారు. ఆమెకు చంద్రబాబు అప్పగించిన బాధ్యత కూడా అదే కదా! ఈ హత్యపై వివిధ కోణాల్లో తలెత్తుతున్న సందేహాలన్నీ షర్మిల పక్కన తిరుగుతున్న సునీత కుటుంబంవైపే వేలెత్తి చూపుతున్నాయి. అయినా విచారణ పూర్తి కాలేదు కనుక బాధ్యత కలిగిన వ్యక్తులుగా ఎవరినీ హంతకులని సంబోధించడం లేదు. అటువంటి నాగరికమైన కట్టుబాటును కూడా షర్మిల గిరాటేశారు. చట్టాన్నీ, ఎన్నికల నియమావళిని కూడా ఉల్లంఘించారు. అవినాశ్‌రెడ్డిని పదేపదే హంతకుడని సంబోధించారు. ఈ వైఖరిని ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నానని అవినాశ్ హుందాగా స్పందించారు.

రెడ్‌కార్డ్

చంద్రబాబు, యెల్లో కూటముల కథ ముగిసింది. ఎన్ని కుప్పిగంతులు వేసినా ఈ రెండు నెలలే. యెల్లో కూటమితో ఊరేగుతున్న ఉపగ్రహాలన్నీ పునరాలోచించుకోవాలి. కూటమి క్షుద్రవిద్యల కారణంగా, కుయుక్తుల కారణంగా జనంలో వారి పట్ల ఏవగింపు కలుగుతున్నది. క్షేత్ర సమాచారం ప్రకారం వైసీపీ ఓటింగ్ బలం 55 శాతానికి చేరుకున్నది. కూటమి ఉమ్మడి మద్దతు 41 శాతం. ఈ తేడా మరింత పెరగనున్నది. రాబోయే ఘోర పరాజయం తర్వాత యెల్లో కూటమి బతికి బట్టకట్టడం జరిగితే అదొక ప్రపంచ వింతే!

vardhelli1959@gmail.com

కాలచక్ర భ్రమణంలో మార్పులెన్నో!

అభిప్రాయం



డా॥ కె.బి. గోపాలం

చాలామంది వచ్చే సంవత్సరం బతుకు ఎలా సాగుతుందని తెలుసుకోవాలి అనుకుంటారు. మరికొందరికి వచ్చే వారంలో విశేషాలు తెలియాలని ఆత్రం. రానున్న తరాల తీరు, మనుషుల బతుకు గురించి తెలుసుకోవాలనే వారు కూడా ఉన్నారు. నిజంగా తెలివి తెలిసిన తర్వాత కూడా వేల ఏళ్లు గడిచాయి. ఈ మధ్యన జరిగిన ఒక పరిశోధన ప్రకారం మన దేశంలో 54 వేల సంవత్సరాల కాలం నుంచి మను షులు ఉన్నట్టు ఆధారాలు కనిపించాయి. ఇప్పటికి పదివేల సంవత్సరాల మునుపు వ్యవసాయం మొదలైంది. అప్పటి వరకు మనిషి ప్రకృతి మీద ఆధారపడి మాత్రమే బతికాడని అర్థం. వ్యవసాయం వచ్చిన తర్వాతే నగరాలు పుట్టుకొచ్చాయి. నగరాలు వచ్చాయి అంటే నాగరికత వచ్చిందని అర్థం. ఇప్పుడేమో ఏకంగా 21వ శతాబ్దిలోకి వచ్చేశాము మనము!

ఉత్త రోజులు వస్తాయి అని అందరూ ఎదురుచూచిన కాలం ఇదేనేమో? కొంతకాలం పోతే నీళ్లు ఉండవు, తిండి ఉండదు, చివరకు గాలి కూడా ఉండదు, అంతా సర్వనాశనం అవుతుంది లాంటి మాటలు తరచుగా వినబడుతున్నాయి. అది నిజమేనేమో? ఇప్పటికే కొన్ని చోట్లలో మంచినీళ్లు దొరకక పెట్రోల్ కొన్నట్టు లీటర్ల ప్రకారం నీళ్లు కొంటున్నారట! అయినప్పటికీ మనిషి జాతి మరో లక్ష సంవత్సరాలు మనగలగడం మాత్రం గ్యారెంటీ అంటున్నారు మరికొందరు!

అటువంటి పరిస్థితులలో మనిషి మనుగడ ఏ రకంగా ఉంటుంది? యువాల్ నోవా హరారి లాంటివారు రానున్న కాలంలో బ్రతుకులను గురించి తమ ఊహలను బయట పెట్టి సంచలనం సృష్టించారు. మనకు గతం గురించి తెలుసు కనుక, ఆ విషయాలు, వివరాల ఆధారంగా భవిష్యత్తును కూడా ఊహించడానికి వీలవుతున్నది.

మనుషులు ఇలాగే ఉంటారా? మునుముందు కూడా ఈ రకంగానే మాట్లాడతారా? ఎక్కడ బతుకుతారు? ప్రకృతి మనకోసం ఇలాగే మిగిలి కొనసాగుతుందా? మనిషి విశ్వం లోతులలోకి వెళ్ళగలుగుతాడా? మనకు కావలసిన కనీసపు వనరులు మిగులుతాయా? దొరుకుతూనే ఉంటాయా? ఎన్నో ప్రశ్నలు! వాటికి జవాబులు కూడా!



పసిఫిక్ సముద్రంలో హవాయికి దగ్గర్లో కొత్త చిన్న ద్వీపం

ఈ ప్రశ్నలన్నీ వెనకటి నుంచి అడుగుతున్నవే. సాహస యాత్రికులు ఈ రకం ప్రశ్నలు ప్రేరణతో ప్రపంచమంతా తిరిగి కొత్త ప్రాంతాలను కనుగొన్నారు. భూమి పొరలలోని ప్లేట్ల కదలిక, మరిన్ని మార్పుల కారణంగా కొత్త భూభాగాలు వెలుగులోకి వస్తాయి అంటున్నారు సైంటిస్టులు. హవాయి ప్రాంతంలో సముద్రంలోనే అగ్నిపర్వతాల పేలుళ్ల కారణంగా ఎన్నో దీవులు పుట్టాయి. అలాంటి దీవులు అక్కడక్కడ మరిన్ని పుట్టే వీలు కూడా ఉంది. అవి ప్రపంచమంతా సముద్రంలో ఎక్కడయినా పుట్టవచ్చు. హవాయి ప్రాంతంలో సముద్రంలో లోహియా అనే అగ్ని పర్వతం మునిగి ఉంది. సముద్రమట్టంలో వచ్చే మార్పులను దృష్టిలో ఉంచుకుంటే అక్కడ ఒక కొత్త దీవి పుట్టడం తప్పదనిపిస్తుంది. అంటే బయటపడుతుంది. యూరప్, ఆఫ్రికా తీరాల వెంట కూడా కొత్త దీవులు పుడతాయి. ఈ రెండు ఖండాలు ఏటా రెండున్నర సెంటీమీటర్ల చొప్పున వాయవ్యం వైపు కదులుతున్నాయి. మరో కొన్ని మిలియన్ సంవత్సరాలలో జిబ్రాల్టర్ సంధి మూసుకుపోతుంది. అట్లాంటిక్ నీరు అందకుంటే మధ్యధరాసముద్రం ఎండిపోతుంది. ఆఫ్రికా ఖండం తోసుకువచ్చి కలిసే లోపల, దక్షిణ యూరప్ తీరాలలో కొత్త ప్రాంతాలు బయటపడతాయి. అవి జరగడానికి చాలా కాలం పడుతుంది. మానవ ఆవిర్భావం నుంచి జరిగిన మార్పులు మనకు ఫాస్ట్ ఫార్వర్డ్‌గా కనిపిస్తున్నాయి. రానున్న మార్పులను మనం స్లో మోషన్‌లో చూడాలి. అసలు మార్పుల గురించి మనకు ఆలోచన అంటూ ఉంటే, చూడడం వీలు కుదురుతుంది.

శుభకృతు, శోభకృతు అని రెండు సంవత్సరాలు గడిచాయి. వాటిలో ఎంత శుభం జరిగింది, ఎంతటి శోభ కుదిరింది అని అందరూ ఆలోచించుకోవాలి. ప్రమాది సంవత్సరంలో ప్రమాదాలు మాత్రమే జరుగుతాయి అనుకుంటే అంతకంటే అమాయకత్వం లేదు. ఇక ఈ ఉగాది నుంచి మొదలయ్యే సంవత్సరం పేరు క్రోధి అంటున్నారు. క్రోధం అంటే కోపం అని అర్థం. సంవత్సరాల పేర్లను బట్టి ఏమీ జరగదు. ప్రపంచం మొదటి నుంచి ఒకే రకంగా ముందుకు సాగుతున్నది. ఇప్పుడు కూడా అదేరకంగా సాగుతుంది. క్రోధి అని పేరుగల సంవత్సరంలో కూడా ఎప్పటిలాగే మంచి చెడులు కలగలుపుగా ఉంటాయని అనుకుంటే ఇక సమస్య ఉండదు.

వ్యాసకర్త సైన్స్ అంశాల రచయిత

ఘనమైన రేయి

ఏడాదిలోని పన్నెండు నెలల్లో రమజాన్ ఆద్యంతమూ కారుణ్య భరితమైన నెల. ఈ నెల చివరి రాత్రుల్లో ఒక జగ్నేకీ రాత్ ఉంది. ఖురాన్ పరిభాషలో దీన్ని 'లైలతుల్ ఖద్ర్' అంటారు. అంటే ఘనతగల రాత్రి అని అర్థం. ఈ రాత్రిలోనే పవిత్ర ఖురాన్ గ్రంథం అవతరించింది. అల్లాహ్ ఇలా ప్రకటించాడు:'మేము దీన్ని (ఖురాన్ గ్రంథాన్ని) ఘనమైనరాత్రిన అవతరింపజేశాము. ఆ రాత్రి ఘనత ఏమిటో మీకు తెలుసా? ఆ మహా రాత్రి వెయ్యి నెలల కన్నా ఎంతో శ్రేష్ఠమైనది. ఆ రాత్రి పరిశుద్ధాత్మ, దైవదూతలు తమ ప్రభువు అనుమతితో ప్రతి వ్యవహారానికి సంబంధించిన ఆజ్ఞలు తీసుకొని అవతరిస్తారు. అది ఉషోదయం వరకూ పూర్తిగా శుభవంతమైన రాత్రి.' (ఖురాన్ 97 – 1, 5).ఖురాన్‌లో మరొకచోట ఇలా ఉంది: 'ఖురాన్ అవతరించిన నెల రమజాన్. అది సమస్త మానవాళికీ మార్గదర్శక జ్యోతి. రుజుమార్గం చూపే, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన సూచనలు అందులో ఉన్నాయి' (2–185). మానవులకు సన్మార్గం చూపి, వారి ఇహపర సాఫల్యానికి దిక్సూచిగా నిలిచే మహత్తర మార్గదర్శిని రమజాన్‌లో– ప్రత్యేకించి చివరిభాగంలోని 'లైలతుల్ ఖద్ర్'లో అవతరించింది కాబట్టి ఈ రాత్రికి ఇంతటి ప్రాముఖ్యం ఏర్పడింది. ఈ ఒక్క రాత్రి చేసే ఆరాధన వెయ్యి నెలల ఆరాధన కన్నా అధికం. అందుకే రమజాన్ చివరి పదిరోజుల్లోని బేసి రాత్రుల్లో ఆరాధనలు ఎక్కువగా చెయ్యాలని ప్రవక్త (స) ఉపదేశించారు. అంటే 21, 23, 25, 27, 29 రాత్రులన్నమాట. ఎవరైతే ఆత్మసంతోషంతో, పరలోక పుణ్యఫలాపేక్షతో 'ఖియాముల్లైల్' చేస్తారో వారు నిజంగానే ధన్యులు. వారి గత అపరాధాలన్నీ మన్నించబడతాయి.



అందుకని ఈ పవిత్ర నెలలో, ముఖ్యంగా చివరి రోజుల్లోనైనా చిత్తశుద్ధితో, ఆత్మసంతోషంతో ఆరాధనలు చేయాలి. సదాచారాలు అధికంగా చేసి దైవ ప్రసన్నత పొందడానికి ప్రయత్నించాలి. 'ఏతెకాఫ్', 'ఫిత్రా'లకు కూడా ఇదే అనువైన కాలం. చివరి పదిరోజులు ఏతెకాఫ్ పాటించాలి. రమజాన్ చివరి రోజుల్లో పండుగకు కొన్ని రోజుల ముందు ఫిత్రాలు కూడా చెల్లిస్తే, పేదసాదల పండుగ అవసరాలు తీరతాయి. వారు కూడా సంతోషంగా పండుగ జరుపుకోగలుగుతారు. కొందరి సంతోషం కాకుండా అందరి ఆనందమే ఈద్! అల్లాహ్ అందరికీ ఇతోధికంగా పుణ్యకార్యాలు ఆచరించి, ఇహపర సాఫల్యాలకు అర్హత సాధించే విధంగా ఆశీర్వదించాలని కోరుకుందాం.

– మదీహా అర్జుమంద్

సమ సమాజం సీఎం జగన్‌తోనే సాధ్యం: బులుసు



తగరపువలస (భీమిలి): సమాజం బాగుండాలని ఆశించే వారిలో కవులు మొదటి స్థానంలో ఉంటారని ప్రముఖ పద్యకవి బులుసు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన చిట్టివలసలో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలకు విద్య, వైద్యం కోసం నిత్యం పరితపిస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌ను కవిగా తాను అమితంగా అభిమానిస్తానన్నారు. సమ సమాజం కోసం శ్రమిస్తున్న సీఎం జగన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం మళ్లీ వస్తేనే పేదలకు శ్రీరామరక్ష అన్నారు.

శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించాలి

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకూడదు

- నిష్పక్షపాతంగా నిర్వహించే బాధ్యత డీఈవోలు, ఎస్పీలదే
- ఎండల నేపథ్యంలో ఓటర్లకు తగిన ఏర్పాట్లు చేయండి
- ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి
- ముందస్తు ఏర్పాట్ల సమీక్షలో సీఈవో ముఖేష్ కుమార్ మీనా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఈవో మీనా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. ఈ బాధ్యత జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలపైనే ఉందన్నారు. ఓర్పు, సమన్వయంతో వ్యవహరించాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి శనివారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లు, నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎటువంటి హింసకు, రీపోలింగ్‌కు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలను చేపట్టాలన్నారు. గంజాయి, మద్యం, నగదు, ఉచితాల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రాలు, జిల్లాల సరిహద్దుల్లో ఉండే చెక్ పోస్టుల్లో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గోవా, హరియాణాల నుంచి అక్రమ మద్యం రాష్ట్రంలోకి రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, వ్యక్తులు రూ.50 వేలకు మించి నగదు కలిగి ఉంటే వెంటనే జప్తు చేయాలని ఆదేశించారు. వ్యాపారులు, సాధారణ పౌరుల విషయంలో ఆచితూచి అడుగేయాలని, వారిని ఎలాంటి ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. నగదు జప్తు కేసులను 24 గంటల్లోనే పరిష్కరించాలని సూచించారు. ఇందుకోసం రాష్ట్రమంతా ఒకే విధానాన్ని అనుసరించేలా త్వరలో నిర్దిష్ట నిబంధనలను (ఎస్‌వోపీ) ప్రకటించనున్నామని తెలిపారు.

10 లక్షలు దాటితే ఐటీకి సమాచారం ఇవ్వండి..

రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి, అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్) శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ప్రత్యేక సాధారణ పరిశీలకులు రాష్ట్ర పర్యటన సందర్భంగా చేసిన పలు సూచనలను డీఈవో, ఎస్పీలకు వివరించారు. రూ.10 లక్షలకు పైబడి జప్తు చేసిన నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆదాయపన్ను (ఐటీ) శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. మద్యం, గంజాయి రవాణా చేసే కింగ్‌పిన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు సీఈవో పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అదనంగా ఏఆర్వోలు కావాల్సినవారు సంబంధిత జాబితాలను మూడు రోజుల్లో సీఈవో కార్యాలయానికి పంపిస్తే, వాటిని కన్సాలిడేట్ చేసి ఈసీ ఆమోదం కోసం పంపిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు సీఈవో హరేంధిరప్రసాద్, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జాయింట్ సీఈవో ఎ.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఈవో కె.విశ్వేశ్వరరావు, అసిస్టెంట్ సీఈవో తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘనలపై తక్షణమే చర్యలు చేపట్టాలి..

రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇంటింటా ప్రచారానికి ముందుగా పొందాల్సిన అనుమతి విషయంలో మరింత స్పష్టత కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామని మీనా చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి తగిన వివరణ అందేలోపు ఇంటింటా ప్రచారానికి అభ్యర్థులు సంబంధిత ఆర్వో, పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే సరిపోతుందన్నారు. ఈ విషయాన్ని అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేయాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక పరిశీలకులను నియమించిందని, వీరే ఈసీకి కళ్లు, చెవులు వంటి వారని తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు విషయంలో ప్రత్యేక సాధారణ పరిశీలకులు, ప్రత్యేక వ్యయ పరిశీలకులు సంతృప్తి చెందేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తమ కార్యాలయం నుంచి పంపించే ఫిర్యాదులపై జిల్లా స్థాయిలోనే సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకున్నాకే నివేదిక పంపాలని సూచించారు.

దుర్గమ్మ సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు



జస్టిస్ గోపాలకృష్ణారావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన న్యాయమూర్తికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎన్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి శనివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయానికి చేరుకున్న జస్టిస్ మండవ కిరణ్మయికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. అలాగే శ్రీవారిని దర్శించుకున్న వారిలో అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, సినీ నటుడు రవిబాబు ఉన్నారు.

బాబు చేసిన మోసానికి చచ్చిపోదామనుకున్నా..

టీడీపీ నేత సియ్యారి దొన్నుదొర



కార్యకర్తలతో మాట్లాడుతున్న దొన్నుదొర

అరకులోయ టౌన్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): అరకు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా గత నాలుగు నెలలుగా ప్రచారం చేసుకున్న తనకు టికెట్ కాదని.. చంద్రబాబు బీజేపీకి కేటాయించడంతో భార్య, కుమారుడితో సహా ముగ్గురం ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నామని.. అయితే కార్యకర్తలను దృష్టిలో పెట్టుకుని ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నామని టీడీపీ సీనియర్ నేత సియ్యారి దొన్నుదొర ఆవేదన వ్యక్తం చేశారు. తన టికెట్ విషయమై విజయవాడలో చంద్రబాబు, లోకేశ్‌లతో భేటీ అయిన ఆయన శనివారం మండలంలోని పద్మాపురంలో నియోజకవర్గ నేతలతో సమావేశమయ్యారు. అరకులోయ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో బలం లేని బీజేపీకి టికెట్ ఎలా కేటాయిస్తారని దుయ్యబెట్టారు. రా కదలిరా.. అరకు సభతో పాటు తొలి జాబితాలో అరకు అసెంబ్లీ అభ్యర్థిగా చంద్రబాబు తన పేరు ప్రకటించడంతో గ్రామాల్లో తిరిగి ప్రచారం చేసుకున్నట్టు చెప్పారు. అనంతరం బీజేపీ అధిష్టానం పాంగి రాజారావును ప్రకటించడంతో తీవ్ర స్థాయిలో మనస్తాపానికి గురైనట్టు చెప్పారు. తనకు టికెట్ రాకుంటే తాను కనుసైగ చేస్తే దారుణాలు జరుగుతాయని హెచ్చరించారు. నామినేషన్ చివరి నిమిషం వరకు కార్యకర్తలు, నేతలు సంయమనం పాటించాలని సూచించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల మండల పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ తమ మాటలు వినేందుకు లోకేశ్ ఇష్టపడలేదని, బీజేపీ అభ్యర్థికి సహకరించే ప్రసక్తే లేదన్నారు. 2014 ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్సీ రవిబాబుకు బీఫాం ఇచ్చి కొద్ది క్షణాల్లోనే మరో అభ్యర్థి సోమకు బీఫాం ఇచ్చిన చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. అవసరమైతే దొన్ను దొరను రెబల్ అభ్యర్థిగా బరిలో దింపి ఆయన గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అన్యాయం

- కేంద్రం ఇచ్చేది రాష్ట్రం చెల్లించిన డబ్బులే..
- ఎంపీ మార్గాని భరత్‌రామ్



రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ఎల్లలు తెలియని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఇక్కడి అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని స్థానిక ఎంపీ, వైఎస్సార్‌సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. నగరంలోని తన కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ ఏపీకి నిధుల మంజూరు, విభజన హామీల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన రాష్ట్రాలతో పోల్చుకుంటే ఏపీకి ఇచ్చిన నిధులు, ఇతర పథకాలూ తక్కువేనన్నారు. ఎవరో చెప్పిన విషయాలను మైకుల ముందు మాట్లాడటం కన్నా స్వయంగా చూశాక మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. ఒకవైపు రాజమహేంద్రవరంలో అభివృద్ధి లేదంటూనే.. మరోవైపు కేంద్ర నిధులతోనే ఇక్కడ అభివృద్ధి జరిగిందంటూ రెండు నాల్కల ధోరణితో మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎక్కడి నుంచో వచ్చింది కాదని.. దేశంలోని అన్ని రాష్ట్రాలూ ఇచ్చిన నిధులనే కేంద్రం మళ్లీ రాష్ట్రాలకు ఇస్తుందన్నారు. రాజమహేంద్రవరం ఎంపీగా నగర అభివృద్ధి కోసం కేంద్రంతో పోరాడి నిధులు తెచ్చినట్టు తెలిపారు. గత ఎంపీ మాగంటి మురళీమోహన్ హయాంలో అభివృద్ధి పనులు ఎందుకు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏతో టీడీపీ చెట్టపట్టాలేసుకుని ఉన్నప్పుడు మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి, విమానాశ్రయం అభివృద్ధి, రైల్వేస్టేషన్ అభివృద్ధి, జాతీయ రహదారుల అభివృద్ధికి నిధులు తేలేకపోయారని ఎద్దేవా చేశారు. కేంద్రంతో పోరాడి సాధించాక అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అంటే సరిపోదని ఎంపీ భరత్‌రామ్ మండిపడ్డారు.

అగ్నిబాన్ రాకెట్ ప్రయోగం వాయిదా

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): అగ్నికుల్ కాస్మోస్ ప్రైవేట్ లిమిటెడ్ (చెన్నై) అనే ప్రైవేట్ అంతరిక్ష సంస్థకు చెందిన అగ్నిబాన్ ఎస్ఓఆర్ టీఈడీ మిషన్-01 అనే చిన్న తరహా రాకెట్ ప్రయోగం సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి శనివారం చేపట్టాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని షార్ అధికారులు తెలిపారు. ప్రయోగానికి ఆరు గంటల ముందు శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియను నిర్వహించే క్రమంలో సాంకేతికపరమైన లోపం తలెత్తడంతో ప్రయోగాన్ని వాయిదా వేసినట్టు తెలుస్తోంది. సెమీ క్రయోజనిక్ ఇంజన్ అందించడంలో ఇస్రో చేసిన జాప్యమే దీనికి కారణమని సమాచారం. అయితే ఈ ప్రయోగాన్ని మార్చి 22నే చేయాలని సిద్ధమైనా, ఆఖరి ప్రయత్నంలో వాయిదా వేశారు. ఈసారి అంతా సిద్ధమనుకున్న సమయంలోనే సాంకేతిక కారణాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో వాయిదా పడింది. ప్రయోగ తేదీని త్వరలోనే వెల్లడించనున్నారు.

శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు ప్రారంభం

భృంగి వాహనంపై దర్శనమిచ్చిన ఆది దంపతులు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం మహాక్షేత్రంలో శాస్త్రోక్తంగా ఉగాది మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఆగమశాస్త్రానుసారం పూజలు జరిపారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, స్థానాచార్యులు, అర్చక స్వాములు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రాంగణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉగాది మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శ్రీశైలం భ్రమరాంబదేవి మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అలంకార మండపంలో ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజలు జరిపి హారతులిచ్చారు. అలాగే శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి భృంగి వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా స్వామివారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది.

ఐఎంఏ హెల్త్ మేనిఫెస్టో విడుదల



హెల్త్ మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జాతీయ కమిటీ రూపొందించిన హెల్త్ మేనిఫెస్టోను శనివారం రాష్ట్ర కమిటీ విడుదల చేసింది. విజయవాడ గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ డాక్టర్ ఫణీంద్ర ఇతర నేతలతో కలిసి దీన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కేరళలో జరిగిన ఐఎంఏ 98వ వార్షిక సదస్సులో హెల్త్ మేనిఫెస్టోను జాతీయ కమిటీ రూపొందించినట్లు తెలిపారు. సార్వజనీన ఆరోగ్యం, ఆరోగ్య రంగం-ప్రభుత్వ నిధులు, వైద్య వృత్తిపై దాడులు, ప్రైవేటు వైద్య రంగం-అక్రిడిటేషన్ విధానం, నేషనల్ మెడికల్ కమిషన్, ఇండియన్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్), మందులు-వాటి నాణ్యతా ప్రమాణాలు వంటి అంశాలపై మేనిఫెస్టోను రూపొందించినట్లు తెలిపారు. విమానయాన సిబ్బందికి కల్పించిన విధంగా వైద్యులు, ఆస్పత్రులకు కేంద్రంలో చట్టపరమైన శాశ్వత రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ నందకిశోర్, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ రహమాన్ పాల్గొన్నారు.

హారతి ఇచ్చుకో.. వెయ్యి పుచ్చుకో!

- విజయవాడ పశ్చిమంలో డబ్బులు వెదజల్లుతూ కూటమి అభ్యర్థుల పర్యటన
- హారతి ఇస్తే రూ.వెయ్యి, కొబ్బరికాయలు కొడితే రూ. వెయ్యి
- ప్రచారం తొలిరోజే తాయిలాలకు తెరతీసిన సుజనా చౌదరి, కేశినేని చిన్ని



హారతి పళ్లెంలో డబ్బులు వేస్తున్న బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి, చిత్రంలో చిన్ని

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి, ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని ఎన్నికల తాయిలాలకు తెరతీశారు. ఇందుకు వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. హారతి పట్టు, వెయ్యి కొట్టు అన్న చందంగా తొలిరోజు వీరి ప్రచారం సాగింది. శనివారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గం భవానిపురంలోని 40, 41 డివిజన్ల నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి, టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ పర్యటనలో మహిళలు హారతులు పట్టి, కొబ్బరికాయలు కొట్టారు. హారతి పళ్లానికి రూ.వెయ్యి, టెంకాయ కొట్టినందుకు రూ. వెయ్యి చొప్పున సుజనా చౌదరి, కేశినేని చిన్ని మహిళలకు తాయిలాలు అందజేశారు. ప్రచారంలో మహిళలు వరుసగా నిలబడడం అభ్యర్థులకు హారతులు పట్టడం తంతుగా మారింది. హారతులు పట్టిస్తూ కొబ్బరి కాయలు కొట్టిస్తూ అభ్యర్థులు యథేచ్ఛగా నగదు పంపిణీ చేశారు. కూటమి అభ్యర్థుల ప్రచారం కాస్ట్‌లీగా మార్చేశారు. తొలిరోజే ఇలా ఉంటే ఎన్నికల వరకు ఇంకెంత విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేస్తారో.. ఇంకెన్ని వినూత్న మార్గాలు ఎంచుకుని డబ్బులు పంచుతారో అన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. ఒక సామాన్యుడిపై బీజేపీ తరఫున ఎన్నికల బరిలో దిగిన సుజానా చౌదరి ప్రచారం ప్రారంభం రోజే డబ్బులు వెదజల్లడం చూసి ఈ ఎన్నికలు పెత్తందారులకు, పేదలకు మధ్య యుద్ధమేనని పలువురు చర్చించుకుంటున్నారు. హారతి పట్టించుకుంటూ పళ్లంలో రూ. వెయ్యి చొప్పున వేస్తూ సుజనా చౌదరి కోడ్ ఉల్లంఘించారు.

అనర్హులుగా ప్రకటించాలి

పశ్చిమ నియోజకవర్గం ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసిన తెలుగుదేశం విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిలను పోటీకి అనర్హులుగా ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్‌కుమార్ ఓ ప్రకటనలో ఎన్నికల సంఘాన్ని కోరారు. భవానిపురం ప్రాంతంలో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు హారతుల పేరుతో డబ్బులు వేసి ఆశ చూపారన్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.



కృష్ణాజిల్లా గుడివాడలోని 22వ వార్డు కార్మికనగర్‌లో పెద్ద సంఖ్యలో ముస్లిం యువత ఎమ్మెల్యే కొడాలి నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి నాని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
- గుడివాడ టౌన్

కజిరంగాలో సీట్ల వేట!

అసోంలో పదేళ్లుగా కాషాయ రెపరెపలు
- లోక్‌సభ సీట్లతో పాటు అసెంబ్లీలోనూ పాగా
- పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ కసరత్తు..
- మళ్లీ బీజేపీదే ఆధిపత్యం అంటున్న సర్వేలు


హిమంత


సోనోవాల్


గౌరవ్ గొగోయ్

అసోం పేరు చెప్పగానే ఖడ్గమృగాలు, బెంగాల్ టైగర్స్, ఏనుగు సఫారీలతో యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన కజిరంగా నేషనల్ పార్క్ కళ్లముందు కదలాడుతుంది. బ్రహ్మపుత్ర నది పరవళ్లతో పాటు తేయాకు తోటలకు కూడా ప్రసిద్ధి. ఈశాన్య భారత్‌కు గేట్‌వేగా నిలుస్తున్న ఈ రాష్ట్రంలో దశాబ్దకాలంగా సమూల రాజకీయ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు కాంగ్రెస్, అసోం గణ పరిషత్ (ఏజీపీ) కంచుకోటగా ఉన్న అతిపెద్ద ఈశాన్య రాష్ట్రంలో ఇప్పుడు కాషాయజెండా రెపరెపలాడుతోంది. భూటాన్, మయన్మార్, బంగ్లాదేశ్.. మూడు దేశాలతో సరిహద్దు పంచుకోవడం వల్ల కూడా అసోం దేశ రాజకీయాల్లో కీలకంగా నిలుస్తోంది. 'సెవెన్ సిస్టర్స్'లో పెద్ద తోబుట్టువుగా.. 14 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండటంతో సార్వత్రిక సమరంలో పార్టీలన్నీ సీట్ల వేటకు సై అంటున్నాయి.

గతేడాది కేంద్ర ఎన్నికల సంఘం అసోంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను పూర్తిచేసిన నేపథ్యంలో 27 ఏళ్ల తర్వాత సీట్ల స్వరూపం స్వల్పంగా మారింది. కొలియాబార్ నియోజకవర్గానికి బదులు కొత్తగా కజిరంగా నియోజకవర్గం వచ్చి చేరింది. అలాగే, 126 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 19 స్థానాల పేర్లు మారాయి. 2009 నుంచి కమలనాథులు ఈశాన్యానికి విస్తరణ బాట పట్టారు. 2014లో అత్యధికంగా 7 సీట్లను దక్కించుకున్న బీజేపీ, 2019లో బలాన్ని మరింత పెంచుకుని 9 సీట్లు కొల్లగొట్టింది. ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలైన ఏజీపీ 3 చోట్ల, బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) ఒక స్థానంలో పోటీ చేయగా, వాటికి ఒక్క సీటు కూడా రాలేదు. మరోపక్క, కాంగ్రెస్ ఒంటరి పోరు చేసి 3 చోట్ల విజయం సాధించింది. 2014లోనూ మూడే సీట్లు దక్కాయి. ఇక రాష్ట్రంలో మూడో అతిపెద్ద పార్టీగా నిలుస్తున్న ఆలిండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) 3 స్థానాల్లో పోటీ చేసి ఒక్క చోట విజేతగా నిలిచింది. 2014లో గెలిచిన 3 సీట్లలో రెండు కోల్పోయింది. మొత్తం 14 నియోజకవర్గాల్లో, 2 సీట్లను ఎస్టీలకు, 1 స్థానం ఎస్సీలకు కేటాయించారు.

బీజేపీ పాగా...

ఉత్తరాదిన గట్టి పట్టున్న కమలనాథులు ఈశాన్యంలో ఎలాగైనా పాగా వేయాలని 2009 నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే అక్కడ బలమైన ప్రాంతీయ పార్టీగా ఉన్న ఏజీపీలోని కీలక నాయకుడు సర్బానంద సోనోవాల్‌ను 2011లో పార్టీలో చేర్చుకుని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించింది. 2014లో సోనోవాల్ సారథ్యంలో అసోం లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొన్న కమలనాథులు బంపర్ ఫలితాలను సాధించారు. బీజేపీకి ఏకంగా 7 సీట్లు (2009లో 2 సీట్లే) లభించాయి. రాష్ట్రంలో అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్ బలం 7 సీట్ల నుంచి 3 స్థానాలకు పడిపోయింది. మియా బెంగాలీ ముస్లింలకు దన్నుగా నిలుస్తున్న ఏఐయూడీఎఫ్ 2 స్థానాలను మెరుగుపరుచుకుని 3 చోట్ల విజేతగా నిలిచింది. ఇక, 2016 అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాలైన ఏజీపీ, బీపీఎఫ్ దన్నుతో బరిలోకి దిగిన కాషాయ పార్టీ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. 126 అసెంబ్లీ సీట్లకు గాను 86 స్థానాలను ఖాతాలో వేసుకుంది. సోనోవాల్ ముఖ్యమంత్రిగా ఈశాన్య రాష్ట్రంలో మొదటి బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, అసోంలో పాగా వేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మరింత బలం పుంజుకుంది. ఎన్‌డీఏ 9 సీట్లను దక్కించుకుంది. ఇవన్నీ కూడా బీజేపీకే రావడం గమనార్హం. భాగస్వామ్య పక్షాలకు ఒక్క సీటూ రాలేదు. ఈ ఘన విజయం తర్వాత 2021 అసెంబ్లీ ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో బీజేపీ బరిలోకి దిగింది. కాంగ్రెస్ కూటమి భారీగా పుంజుకున్నప్పటికీ, మళ్లీ ఎన్‌డీఏ మెజారిటీ దక్కించుకుంది. అయితే, కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి జంప్ చేసిన హిమంత బిశ్వ శర్మకు కమలనాథులు సీఎం పగ్గాలు అప్పగించి, సోనోవాల్‌ను మళ్లీ కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కాగా, మోదీ ప్రభుత్వం రెండోసారి పగ్గాలు చేపట్టిన తర్వాత ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. మౌలిక సదుపాయాలపై భారీగా వెచ్చించింది. దీన్నే ఇప్పుడు అక్కడ ప్రచారాస్త్రాలుగా చేసుకుంటోంది. మరోపక్క, ఇటీవల అమల్లోకి తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) కూడా ఎన్నికల్లో ప్రభావం చూపనుంది.

పట్టుకోసం కాంగ్రెస్ ప్రయత్నం...

స్టేట్ స్కాన్

రాష్ట్రాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ దశాబ్దకాలంగా తీవ్రంగా దెబ్బతింది. 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన దిగ్గజ నేత తరుణ్ గొగోయ్‌పై అసమ్మతి, హిమంత బిశ్వ శర్మ వంటి నేతలు పార్టీని వీడటంతో కష్టాలు చుట్టుముట్టాయి. దీంతో అటు అసెంబ్లీ, ఇటు లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయాలను మూటగట్టుకుంది. అయితే, 2019లో ఎంపీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు లభించిన ఓట్లలో తేడా 0.61 శాతం మాత్రమే కావడం గమనార్హం. 2021 ఎన్నికల్లో తరుణ్ గొగోయ్ కుమారుడు గౌరవ్ గొగోయ్ సారథ్యంలో బరిలోకి దిగిన హస్తం పార్టీ భారీగా పుంజుకుంది. అంతక్రితం ఎన్నికలతో పోలిస్తే 24 సీట్లు మెరుగుపరుచుకుని 50 స్థానాల్లో విజయం సాధించింది. మళ్లీ బలమైన ప్రతిపక్షంగా ఆవిర్భవించింది. కాగా, అతిచిన్న వయస్సులో అసోం సీఎం పగ్గాలు చేపట్టిన ప్రఫుల్ల కుమార్ మహంతి (ఏజీపీ వ్యవస్థాపకుల్లో ఒకరు) వంటి నేతలు ఎన్‌డీఏతో జట్టుకట్టడం కూడా కాంగ్రెస్‌పై ప్రభావం చూపుతోంది. అయితే, ఈసారి ఇండియా కూటమితో బీజేపీని ఢీకొట్టడం ద్వారా మెజారిటీ స్థానాలను చేజిక్కించుకునే ప్రయత్నాల్లో ఉంది హస్తం పార్టీ. కాగా, సీఏఏ అంశంతో పాటు మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఇండియా కూటమి ప్రచారాస్త్రాలుగా మలచుకుంటోంది. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రలో అసోం ప్రభుత్వంపై, మోదీ సర్కారు హయాంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలను ఎక్కుపెట్టారు. ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో మారణహోమానికి బీజేపీయే కారణమని కూడా ఇండియా కూటమి ప్రచారంలో హోరెత్తిస్తోంది.

కాంగ్రెస్ వల'సలసల'...

ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ నేతల పార్టీ ఫిరాయింపులు, వలసలు కూడా జోరందుకుంటున్నాయి. తాజాగా కాంగ్రెస్ ఎమ్మెల్యే భరత్ చంద్ర నారా రాజీనామా చేశారు. లఖీంపూర్ లోక్‌సభ సీటును తన భార్యకు ఇవ్వకపోవడమే దీనికి కారణం. రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రానా గోస్వామి కూడా బీజేపీలోకి జంప్ చేసిన సంగతి తెలిసిందే. శంకర్ ప్రసాద్ రాయ్, రతుల్ కుర్మి, కమలాఖ్య డే, బసంత దాస్ తదితర నాయకులు సైతం కాంగ్రెస్ నుంచి వలసబాట పట్టడం పార్టీని కలవరపెడుతోంది. కాగా, రాహుల్ గాంధీ అసోంలో ప్రచారానికి రావాలని కోరుకుంటున్నానని రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ స్టార్ క్యాంపెయినర్ హిమంత బిశ్వ శర్మ సిల్చార్ ఎన్నికల సభలో వ్యాఖ్యానించారు. అసలు రాహుల్‌కు ప్రధాని మోదీతో పోటీ ఏంటని కూడా ఎద్దేవా చేశారు. రాహుల్ ప్రచారానికొస్తే బీజేపీకే లాభమని, రాష్ట్రంలో కాంగ్రెస్ ఖాళీ అవుతుందన్నారు. మరోపక్క, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు భూపేన్ కుమార్ బోరా కూడా బీజేపీలో చేరబోతున్నారంటూ హిమంత బాంబు పేల్చారు. అయితే, దీన్ని బోరా ఖండించడమే కాకుండా, రూ.10 కోట్ల పరువు నష్టం దావా వేయడం విశేషం.

- సాక్షి, నేషనల్ డెస్క్

గొగోయ్ వర్సెస్ గొగోయ్

జోర్హాట్ లోక్‌సభ నియోజకవర్గంలో ఇద్దరు గొగోయ్‌లు తలపడుతున్నారు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం కోసం శ్రమిస్తున్న గౌరవ్ గొగోయ్... సిట్టింగ్ బీజేపీ ఎంపీ, తపన్ కుమార్ గొగోయ్ బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో గౌరవ్ కలియాబోర్ నుంచి ఎంపీగా గెలిచారు. కాగా, తాను 2 లక్షల ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్‌ను మట్టి కరిపిస్తానని తపన్ గొగోయ్ సవాలు విసిరారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని ఎన్నికల్లో బూచిగా చూపిస్తున్న ప్రతిపక్షాలను ఓటర్లు పట్టించుకోవడం లేదన్నారు. ప్రచారంలో దూసుకుపోతున్న గౌరవ్ గొగోయ్ కూడా గెలుపుపై ధీమాగా ఉన్నారు. తనతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడుతున్న వారంతా ఓట్లేస్తే తపన్ ఖచ్చితంగా ఓడిపోతారని అంటున్నారు. గౌరవ్ తండ్రి, అసోం సీఎంగా సుదీర్ఘకాలం పని చేసిన తరుణ్ గొగోయ్‌కు జోర్హాట్ నియోజకవర్గం ఒకప్పుడు కంచుకోటగా ఉండేది. జోర్హాట్ ఓటర్లతో ఈ అనుబంధాన్ని గుర్తు చేయడంతో పాటు యువ ఓటర్లపై గౌరవ్ ఎక్కువగా దృష్టి పెడుతున్నారు.

సర్వేలు ఏమంటున్నాయి...

ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమిగా పోటీ చేస్తున్న బీజేపీ 11 సీట్లలో అభ్యర్థులను ప్రకటించింది. ఇక ఏజీపీకి 2 సీట్లు, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్)కు 1 సీటు ఇచ్చింది. ఇటీవల వెలువడిన పలు సర్వేలు ఎన్‌డీఏ 12 సీట్లను (బీజేపీ 10, ఏజీపీ 1, యూపీపీఎల్ 1) దక్కించుకుంటుందని అంచనా వేశాయి. కాంగ్రెస్, ఏఐయూడీఎఫ్‌లకు చెరొక స్థానం రావచ్చని అంటున్నాయి.



ఎన్నికల తేదీలు
ఏప్రిల్ 19, 26 ; మే 7



ఎన్నికల విచిత్రం

ఉత్తరప్రదేశ్‌లోని ఘాజియాబాద్‌లో శనివారం జరిగిన భారీ రోడ్‌షోలో ప్రధాని మోదీ ఇలా కొత్తగా కన్పించారు. తలమీద కాషాయ టోపీ, చేతిలో కమలం గుర్తు. రోడ్డుకు ఇరువైపులా బారులుతీరిన బీజేపీ శ్రేణులు 'మోదీ న్యూలుక్' చూసి రెట్టింపు ఉత్సాహంతో నీరాజనం పలికారు.

ఎలక్షన్ బీట్

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ముస్లిం లీగ్ భావజాలం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం

షహరాన్‌పూర్/అజ్మీర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో స్వాతంత్య్ర ఉద్యమం నాటి ముస్లిం లీగ్ భావజాలాన్ని, ఆలోచనా విధానాన్ని పోలి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. కాంగ్రెస్, ముస్లిం లీగ్ ఒక్కటేనని పరోక్షంగా తేల్చిచెప్పారు. స్వాతంత్య్ర పోరాటం నాటి కాంగ్రెస్ పార్టీ కొన్ని దశాబ్దాల క్రితమే అంతరించిపోయిందని చెప్పారు. మహాత్మా గాంధీతోపాటు ఎందరో మహామహులకు కాంగ్రెస్‌తో అనుబంధం ఉండేదని గుర్తుచేశారు. ఇప్పుడు మిగిలిపోయిన కాంగ్రెస్‌కు దేశ ప్రయోజనాల పట్ల ఒక విధానం, అభివృద్ధి పట్ల ఒక విజన్ లేవని ఆక్షేపించారు. ఆ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోను పరిశీలిస్తే ప్రజల ఆశలు, ఆకాంక్షల నుంచి కాంగ్రెస్ పూర్తిగా దూరమైనట్లు తెలుస్తోందన్నారు. శనివారం ఉత్తరప్రదేశ్‌లోని షహరాన్‌పూర్‌లో ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఉత్తరప్రదేశ్‌లో 'ఇద్దరు బాలలు' అనే సినిమా గత ఎన్నికల్లో దారుణంగా పరాజయం పాలైందని, అయినా ఈ ఎన్నికల్లో రీరిలీజ్ చేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌పై ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు గంటకొకరు మారిపోతున్నారని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ వారసత్వ, అవినీతి పార్టీ

కాంగ్రెస్ లూటీ దుకాణాన్ని తాను మూసివేశానని, అందుకే ఆ పార్టీ ఆందోళన చెందుతోందని ప్రధాని మోదీ అన్నారు. ఎన్నికల్లో నెగ్గడానికి కాకుండా అవినీతిపరులను కాపాడడానికి కాంగ్రెస్ ర్యాలీలు, సభలు నిర్వహిస్తోందని మండిపడ్డారు. శనివారం రాజస్తాన్‌లోని అజ్మీర్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ముమ్మాటికీ వారసత్వ, అవినీతి పార్టీ అని ధ్వజమెత్తారు. ఆ పార్టీకి విలువలు, సిద్ధాంతాలు లేవన్నారు.

దేశ గౌరవం ధ్వంసం: సోనియా



జైపూర్: దేశ గౌరవాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ధ్వంసం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ఆరోపించారు. కుట్రలు కుతంత్రాలు, బెదిరింపులతో ప్రతిపక్ష నాయకులను బీజేపీలో చేర్చుకుంటున్నారని మండిపడ్డారు. శనివారం రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఎన్నికల ప్రచార సభలో ఆమె ప్రసంగించారు. గత పదేళ్ల ఎన్డీయే పాలనలో ఒరిగిందేమీ లేదని అన్నారు. దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం, అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయని చెప్పారు. నేడు దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో చిక్కుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు విధ్వంసానికి గురవుతున్నాయని తెలిపారు. ఎన్డీయే పాలనలో రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంకుశ పాలనలను సహించే ప్రసక్తే లేదని, తగిన బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ దేశం ఏ ఒక్కరి సొత్తు కాదని, ఇది ప్రజలందరికీ చెందుతుందని పేర్కొన్నారు.

'గ్యారంటీ'ని దొంగిలించిన మోదీ: ఖర్గే

అబద్ధాల నాయకుడు నరేంద్ర మోదీ అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. 'గ్యారంటీ' అనే పదాన్ని కాంగ్రెస్ నుంచి మోదీ దొంగిలించారని చెప్పారు. అవినీతిపరులు బీజేపీలో చేరగానే పరిశుద్ధులుగా మారిపోతున్నారని ప్రియాంకాగాంధీ వాద్రా ఎద్దేవా చేశారు.

అమేథీ నుంచి రాబర్ట్ వాద్రా..?

సాక్షి, న్యూఢిల్లీ: గాంధీ కుటుంబానికి కంచుకోటగా ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథీ నియోజకవర్గం నుంచి అగ్రనేత ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా రాజకీయ అరంగేట్రం చేసే అవకాశాలున్నాయని ఏఐసీసీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనికి తగ్గట్టుగా అమేథీ ప్రజలు తనను కోరుకుంటే ఎంపీగా ప్రాతినిధ్యం వహించేందుకు సిద్ధమని ఆయన ఇటీవల చేసిన ప్రకటన ఈ తరహా ప్రచారానికి బలాన్నిస్తోంది. దీనికి తోడు ప్రస్తుతం అమేథీ ఎంపీగా ఉన్న కేంద్రమంత్రి స్మృతి ఇరానీని ఉద్దేశించి, 'ఆమె వల్ల అమేథీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆమెను ఎన్నుకోవడం ద్వారా తప్పు చేశామని నమ్ముతున్నారు' అంటూ విమర్శలు సంధించడంతో వాద్రా పోటీ ఖాయమని ఏఐసీసీ వర్గాలంటున్నాయి.

ఉత్తమ ఫినిషర్ రాహుల్: రాజ్‌నాథ్

భోపాల్: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెణుకులు విసిరారు. క్రికెట్‌లో మహేంద్ర ధోనీ మాదిరిగానే దేశ రాజకీయాలకు ఉత్తమ ఫినిషర్ రాహుల్ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లోని సిద్ధిలో శనివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో రాజ్‌నాథ్ ప్రసంగించారు. ఒకప్పుడు దేశ రాజకీయాలను శాసించిన కాంగ్రెస్ పార్టీ అధికారం నేడు ఏవో రెండు మూడు చిన్న రాష్ట్రాలకు పరిమితం కావడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇందుకు కారణాలను ఆయన వివరిస్తూ..క్రికెట్‌లో బెస్ట్ ఫినిషర్ ఎవరని ప్రశ్నించగా జనం 'ధోనీ'అని సమాధానమిచ్చారు. భారత రాజకీయాల్లో బెస్ట్ ఫినిషర్ ఎవరని నన్ను ఎవరైనా అడిగితే రాహుల్ గాంధీ అనే బదులిస్తాను. ఎందుకంటే, ఆయన హయాంలోనే కీలక నేతలెందరో ఆ పార్టీని వీడారు'అంటూ రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

మ్యాచ్ ఫిక్సింగ్ అంటారని..

కాంగ్రెస్ ఎమ్మెల్యే అయిన భార్యను వదిలి వెళ్లిన బీఎస్పీ ఎంపీ అభ్యర్థి



బాలాఘాట్: అనుభా ముంజారే మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే. ఈమె భర్త కంకర్ ముంజారే గతంలో ఎమ్మెల్యే, ఎంపీగా ఎన్నికయ్యారు. తాజాగా బాలాఘాట్ లోక్‌సభ స్థానానికి బీఎస్పీ అభ్యర్థి. తామిద్దరి మధ్య సిద్ధాంత వైరుధ్యాలు ఉన్నందున ఒకే ఇంట్లో ఉండలేకపోతున్నానంటూ కంకర్ ముంజారే ఓ విచిత్ర నిర్ణయం తీసుకున్నారు. 'భిన్న సిద్ధాంతాలు కలిగిన పార్టీల్లో కొనసాగుతూ ఇద్దరం ఒకే చోట ఉంటే మ్యాచ్ ఫిక్సింగ్ అని అందరూ మమ్మల్ని అనుమానిస్తారు. అందుకే శుక్రవారం నుంచి వేరే చోట ఓ గుడిసెలో ఉంటున్నాను. ఎన్నికల పోలింగ్ రోజున ఏప్రిల్ 19వ తేదీన తిరిగి మా ఇంటికి వెళ్తా'అని ఆయన తెలిపారు. భర్త నిర్ణయం తనను బాధిస్తోందని అనుభ చెప్పారు. 'గతంలో ఆయన గోండ్వానా గణతంత్ర పార్టీ తరఫున పారస్‌వాడ స్థానానికి, నేను బాలాఘాట్‌లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసినప్పుడు కూడా ఒకే ఇంట్లో ఉన్నాం. పెళ్లైనప్పటి నుంచి 33 ఏళ్లుగా కుమారుడితోపాటు కలిసే సంతోషంగా ఉంటున్నాం'అని ఆమె అన్నారు. కాంగ్రెస్ తరఫున ఎన్నికల ప్రచారంలో భర్త కంకర్‌పై విమర్శలు చేయబోనన్నారు. కాగా, 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బాలాఘాట్‌లో బీజేపీ సీనియర్ నేత గౌరీశంకర్ బిసెన్‌పై అనుభా ముంజారే ఘన విజయం సాధించారు.

మనీశ్ సిసోడియా కస్టడీ పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియాకు సీబీఐ ప్రత్యేక కోర్టు జ్యుడీషియల్ కస్టడీకి పొడిగించింది. కస్టడీ గడువు ముగియడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులు ఆయన్ను శనివారం ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో హాజరు పరిచారు. ఈనెల 18వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరీ బవేజా తీర్పు ఇచ్చారు. గత ఏడాది ఫిబ్రవరి 26వ తేదీ నుంచి మనీశ్ సిసోడియా జైలులోనే ఉన్నారు.

సిరియాలో బాంబు పేలి.. ఏడుగురు చిన్నారులు మృతి

డెమాస్కస్: సిరియాలో కల్లోలిత దరా ప్రావిన్స్‌లో రోడ్డు పక్కన అమర్చిన బాంబు పేలిన ఘటనలో ఏడుగురు చిన్నారులు చనిపోగా మరో ఇద్దరు గాయపడ్డారు. బాంబు పేలుడుకు బాధ్యులెవరో తెలియాల్సి ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు దరా ప్రావిన్స్‌లో జరిగిన వివిధ ఘటనల్లో 100 మందికి పైగా చనిపోయారు. ఇజ్రాయెల్ ఆక్రమిత గొలాన్ హైట్స్, జోర్డాన్‌కు మధ్యలో దరా ప్రావిన్స్ ప్రాంతముంది. సిరియాలో 2011లో అంతర్యుద్ధానికి బీజం పడిందిక్కడే.

రష్యా క్షిపణి దాడుల్లో 8 మంది మృతి

కీవ్: ఉక్రెయిన్‌లోని రెండో అతిపెద్ద నగరం ఖార్కీవ్‌పైకి రష్యా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. శుక్రవారం రాత్రి నుంచి జరిపిన దాడుల్లో 8 మంది చనిపోగా మరో 12 మంది గాయపడ్డారు. రష్యా 32 ఇరాన్ తయారీ షహీద్ డ్రోన్లను, ఆరు క్షిపణులను ప్రయోగించగా 28 డ్రోన్లను, 3 క్రూయిజ్ మిస్సైళ్లను కూల్చివేశామని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. తాజా దాడులపై రష్యా మిలటరీ ఎటువంటి ప్రకటనా చేయలేదు.

సార్వత్రిక ఎన్నికలపై చైనా గురి

ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ఎత్తుగడ
- కృత్రిమ మేధతో తప్పుడు సమాచారం సృష్టి
- సైబర్ గ్రూప్‌లకు చైనా ప్రభుత్వం అండదండలు
- మైక్రోసాఫ్ట్ 'థ్రెట్ ఇంటెలిజెన్స్' అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: భారత్‌లో త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలపై చైనా సైబర్ గ్రూప్‌లు గురిపెట్టాయని అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం 'మైక్రోసాఫ్ట్' ఒక నివేదికలో వెల్లడించింది. సొంత ప్రయోజనాలు నెరవేర్చుకోవడమే లక్ష్యంగా తప్పుడు సమాచారంతో ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి చైనా ప్రభుత్వం ఇలాంటి గ్రూప్‌లకు అండగా నిలుస్తోందని స్పష్టం చేసింది. ఇతర దేశాల్లో ఎన్నికల విషయంలో చైనా అనుసరిస్తున్న ఎత్తుగడలపై మైక్రోసాఫ్ట్‌కు చెందిన 'థ్రెట్ ఇంటెలిజెన్స్' అధ్యయనం నిర్వహించింది. తప్పుడు సమాచారాన్ని విస్తృతంగా వ్యాప్తిలోకి తీసుకురావడం ద్వారా ప్రజాభిప్రాయాన్ని మార్చడానికి కృత్రిమ మేధ(ఏఐ)తో యాంకర్లను, మీమ్స్, ఆడియోలు, వీడియోలను సృష్టించి, సోషల్ మీడియాలో పోస్టు చేసే అవకాశం ఉన్నట్లు మైక్రోసాఫ్ట్ తెలియజేసింది. కొన్ని నెలల క్రితం జరిగిన తైవాన్ పార్లమెంట్ ఎన్నికల్లో చైనా సైబర్ గ్రూప్‌లు క్రియాశీలకంగా పని చేశాయని వెల్లడించింది. వీటికి చైనా మిత్రదేశమైన ఉత్తర కొరియా కూడా మద్దతిస్తోందని పేర్కొంది. అయితే, కృత్రిమ మేధ సాయంతో సృష్టించిన సమాచారంతో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశాలు స్వల్పమేనని తేల్చిచెప్పింది.

- చైనాకు చెందిన ఫ్లాక్స్ టైఫూన్ అనే సైబర్ కంపెనీ ఇండియా ఎన్నికలపై దృష్టి పెట్టిందని మైక్రోసాఫ్ట్ నివేదిక స్పష్టం చేసింది. ఈ కంపెనీ ప్రధానంగా టెలికమ్యూనికేషన్ల వ్యవస్థపై దాడులు చేస్తూ ఉంటుంది.
- భారత ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ)తోపాటు కేంద్ర హోంశాఖ కార్యాలయం, రిలయన్స్, ఎయిర్ ఇండియా వంటి కార్పొరేట్ సంస్థల ఆఫీసులను టార్గెట్ చేశామని చైనా ప్రభుత్వంతో సంబంధాలున్న ఓ హ్యాకింగ్ గ్రూప్ ఫిబ్రవరిలో బహిరంగంగా ప్రకటించింది.
- భారత ప్రభుత్వానికి చెందిన 95.2 గిగా బైట్ల ఇమ్మిగ్రేషన్ డేటాలోకి హ్యాకర్లు చొరబడినట్లు 'వాషింగ్టన్ పోస్టు' పత్రిక అధ్యయనంలో వెల్లడయ్యింది. లీక్ చేసిన ఫైళ్లను హ్యాకర్లు గిట్‌హబ్ అనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు.
- మయన్మార్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న అశాంతికి, సంక్షోభానికి భారత్, అమెరికా బాధ్యత వహించాలంటూ చైనా కమ్యూనిస్టు పార్టీ మద్దతున్న స్టార్మ్‌–1376 అనే సైబర్ కంపెనీ మాండరిన్, ఇంగ్లిష్ భాషల్లో ఏఐతో ఇటీవల వీడియోలు సృష్టించింది.
- మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత నెలలో సమావేశమయ్యారు. కృత్రిమ మేధతో తలెత్తుతున్న ముప్పు, ఏఐతో సృష్టిస్తున్న డీప్‌ఫేక్ కంటెంట్‌పై చర్చించారు.
- కేవలం ఇండియా మాత్రమే కాదు, త్వరలో జరుగనున్న అమెరికా, దక్షిణ కొరియా ఎన్నికలపైనా చైనా సైబర్ సంస్థలు దృష్టి పెట్టాయని మైక్రోసాఫ్ట్ గుర్తించింది.


పేరు జాన్ ఆల్ఫ్రెడ్ టిన్నిస్‌వుడ్. ఇంగ్లండ్‌కు చెందిన ఈయన వయస్సు 111 ఏళ్లు. వెనెజులాకు చెందిన జువాన్ విసెంట్ పెరెడ్ 114 ఏళ్ల వయస్సులో ఇటీవల చనిపోవడంతో ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడిగా గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో తాజాగా టిన్నిస్‌వుడ్ చోటు సంపాదించారు.

బెంగాల్‌లో ఎన్‌ఐఏ అధికారులపై దాడి

న్యూఢిల్లీ/బలూర్‌ఘాట్(పశ్చిమబెంగాల్): 2022 పేలుడు ఘటనలో ఇద్దరు కీలక కుట్రధారులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) శనివారం అదుపులోకి తీసుకుంది. ఈ సందర్భంగా స్థానికులు జరిపిన దాడిలో ఒక అధికారి గాయపడ్డారు. ఎన్‌ఐఏ ప్రతినిధి ఒకరు ఢిల్లీలో మీడియాకు ఈ విషయం వెల్లడించారు. 'బెంగాల్‌లోని భూపతినగర్ 2022 డిసెంబర్‌లో చోటుచేసుకున్న పేలుడు కేసులో కీలక పురోగతి సాధించాం. ముగ్గురి మృతికి కారణమైన అప్పటి ఘటనకు కీలక కుట్రదారులైన బలాయి చరణ మైతీ, మనోబ్రత జనాల కోసం తూర్పు మిడ్నాపూర్ జిల్లాలో ఐదు ప్రాంతాల్లో సోదాలు జరిపాం. స్థానికుల తీవ్ర ప్రతిఘటన నడుమ వారిద్దరినీ అరెస్ట్ చేశాం. స్థానికుల దాడిలో ఒక అధికారి గాయపడ్డారు. ఎన్‌ఐఏకి చెందిన ఒక వాహనం ధ్వంసమైంది. ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం'అని ఆయన వివరించారు. మైతీ, జనా అనే వారు స్థానికంగా భయోత్పాతం సృష్టించేందుకు నాటుబాంబులు తయారు చేసి, పేల్చారని ఆయన తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి రాష్ట్ర పోలీసులు అప్పట్లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. కానీ, పేలుడు పదార్థాల చట్టాన్ని అందులో చేర్చలేదు. దీనిపై దాఖలైన రిట్ పిటిషన్ మేరకు కలకత్తా హైకోర్టు కేసును ఎన్‌ఐఏకి అప్పగించింది.

సీరియస్‌గానే తీసుకుంటాం: గవర్నర్

ఎన్‌ఐఏ అధికారులపై దాడి అత్యంత తీవ్రమైన అంశమని బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ పేర్కొన్నారు. దీనిని అంతే తీవ్రంగా ఎదుర్కొంటామన్నారు. 'దర్యాప్తు విభాగాల అధికారులను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు ఎవరికీ మంచిది కాదు. ఇటువంటి గూండాయిజాన్ని అనుమతించబోం. కఠినంగా వ్యవహరిస్తాం'అని మీడియాతో అన్నారు.

మరోదారి లేకే గ్రామస్తుల దాడి: సీఎం మమతా బెనర్జీ

భూపతిపూర్‌లో ఎన్‌ఐఏ అధికారులపై స్థానికుల దాడిని సీఎం మమత సమర్థించారు. శనివారం వేకువజామున ఒక్కసారిగా ఇళ్లలోకి దూరి దాడి చేయడంతోనే స్థానిక మహిళలు ఆత్మరక్షణ కోసం ప్రతిదాడికి దిగారని ఆమె అన్నారు. 2022నాటి ఘటనను ఆమె బాణసంచా పేలుడుగా అభివర్ణించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి

మృతుల్లో ఒకరు భూపాలపల్లి జిల్లా వాసి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్ జిల్లాలో శనివారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధి పూజారి కాంకేర్– నంబి సమీపాన కర్రిగుట్టల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ, గ్రేహౌండ్స్ పోలీసు బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా శనివారం తెల్లవారుజామున కర్రిగుట్ట అడవుల్లో బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల నడుమ గంటసేపు ఎదురుకాల్పులు కొనసాగాయి. అనంతరం ఆ ప్రాంతంలో గాలించగా ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఒక ఏకే–47, ఒక మెషీన్‌గన్, ఒక 12 బోర్ తుపాకీతో పాటు పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి, ఔషధాలు, నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఒకరిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుష్‌పూర్ గ్రామానికి చెందిన అన్నె సంతోష్ అలియాస్ శ్రీధర్ అలియాస్ సాగర్‌గా గుర్తించారు. మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడైన(ఎస్‌సీఎం) సాగర్.. సెంట్రల్ రీజియన్ కమాండ్(సీఈసీ)కు డిప్యూటీగా వ్యవహరిస్తున్నాడు. ఇతనిపై రూ.25 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. మిగతా ఇద్దరినీ గుర్తించాల్సి ఉంది.

బీజేపీపైనా చర్యలు తీసుకోండి

ఈసీని డిమాండ్ చేసిన ఢిల్లీ మంత్రి అతిశి



న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ ఆరోపణలపై బీజేపీ నేతలపైనా చర్యలు తీసుకోవాలని ఢిల్లీ మంత్రి అతిశి శనివారం ఎన్నికల కమిషన్(ఈసీ)ని డిమాండ్ చేశారు. బీజేపీ కనుసన్నల్లో ఈసీ పనిచేస్తోందని శనివారం ఆమె మీడియా సమావేశంలో ఆరోపించారు. బీజేపీలో చేరడమో, ఈడీ అరెస్టును ఎదుర్కోవడమో తేల్చుకోవాలంటూ ఆ పార్టీ నేత ఒకరు తనను బెదిరించారంటూ అతిశి చేసిన ఆరోపణలపై ఈసీ ఆమెకు శుక్రవారం నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. 'మద్యం కుంభకోణంలో డబ్బు చేతులు మారిందనేందుకు ఎలాంటి ఆధారాలు దొరకనప్పటికీ కేవలం అనుమానంతోనే ఆప్ నేతలు సంజయ్ సింగ్, మనీశ్ సిసోడియా, సీఎం కేజ్రీవాల్‌లను ఈడీ అరెస్ట్ చేసింది. ఈ కుంభకోణంలో నిందితుడొకరు బీజేపీకి కోట్లాది రూపాయలను ఎలక్టోరల్ బాండ్ల రూపంలో అందజేసినట్లు ఆధారాలున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదు'అని ఆమె ప్రశ్నించారు.

సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో చిన్నారి





శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనసందోహానికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మోసానికి మారుపేరు

అబద్ధాలు, వెన్నుపోటు, మోసం, కుట్రలు కలిపితే చంద్రబాబు.. కావలి సభలో వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'మోసం, అబద్ధాలు, వెన్నుపోట్లు, కుట్రలు.. ఈ పాత్రలన్నీ కలిపితే చంద్రబాబు. సినిమాల్లో విలన్ క్యారెక్టర్లలో మనకు నచ్చనివన్నీ కలిపితే పుట్టే కొత్త క్యారెక్టర్ అన్నమాట. ఈ క్యారెక్టర్.. చంద్రబాబును 4 నెలలుగా నేను కొన్ని ప్రశ్నలు అడుగుతున్నా. 14 ఏళ్ల సీఎంగా చేశావు.. 3 సార్లు సీఎంగా చేశానని చెప్పుకుంటావు. మరి నీ పేరు చెబితే పేదలకు గుర్తుకొచ్చే పథకం కనీసం ఒక్కటంటే ఒక్కటైనా ఉందా? నువ్వు చేసిన మంచి పని ఏదైనా ఉందా? మీ ముందే, మీ సమక్షంలో.. ఇలా సిద్ధం సభల్లో లక్షలాది మంది ముందు ఇప్పటికే ఎన్నోసార్లు అడిగాను. నాకైతే సమాధానం చెప్పలేదు. పోనీ, మీకైనా చెప్పాడా.. అంటే అదీ లేదు' అని సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపడ్డారు. ఇదే మోసాల బాబును మరో ప్రశ్న కూడా అడిగానన్నారు. 'ఎన్నికల ముందు మూడుసార్లు ఎన్నికల మేనిఫెస్టో అంటూ రంగు రంగుల కాగితాలు ఇచ్చావు. ఎన్నికలైన తర్వాత ఒక్కసారి అయినా ఇలా.. నాలా.. పబ్లిక్‌గా నీ మేనిఫెస్టో చూపించి, ఇదిగో నా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు.. ఇదిగో నెరవేర్చాను.. అని చెప్పావా? మేనిఫెస్టోలో నీవు చెప్పింది ఒక్కటైనా అమలు చేశావా? చంద్రబాబు ఎన్నికలకు ముందు మాత్రమే మేనిఫెస్టో చూపిస్తాడు. ఆ తర్వాత అది చూపించరు. నాకైతే చూపించలేదు. పోనీ మీకైనా చూపించాడా? అసలు మేనిఫెస్టో కాపీలైనా చూపించే దమ్ము, ధైర్యం, నిబద్ధత నీకు ఉందా బాబూ..?' అని నిప్పులు చెరిగారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా శనివారం ఆయన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి బహిరంగ సభలో మాట్లాడారు. సీఎం ఏమన్నారంటే..



సభాస్థలి నిండిపోవడంతో బయటే వేచి ఉండి సీఎం ప్రసంగాన్ని వింటున్న ప్రజలు

వారంతా తోడేళ్లు, మోసగాళ్లు

- ప్రజలను మోసం చేయటమే అలవాటుగా పెట్టుకున్న చంద్రబాబుకు, ప్రజలకు మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. మీ బిడ్డ జగన్ పేదల పక్షం, ప్రజల పక్షం. ఈ యుద్ధంలో అటువైపు చంద్రబాబు, దత్తపుత్రుడు.. వీరిద్దరికీ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 తోడుగా ఉన్నారు. వీళ్ల సరిపోరని ఈ రాష్ట్రాన్ని విడగొట్టిన ఒక జాతీయ పార్టీ, ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా అన్యాయం చేసిన మరొక జాతీయ పార్టీ.. వీళ్లంతా ప్రత్యక్షంగా, పరోక్షంగా చంద్రబాబు పక్షమే. అవతలి పక్షంలో తోడేళ్లు, మోసగాళ్లుగా ఉంటున్న వాళ్లంతా కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు. వీరందరికీ వ్యతిరేకంగా మేమంతా సిద్ధం.. సిద్ధం.. అని లక్షల సింహాల గర్జనతో మన జైత్ర యాత్ర ముందుకు సాగుతోంది.
- 'మే 13న జరిగే ఈ ఎన్నికల్లో మన పార్టీకి, మన ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడానికి పేదలు, పిల్లలు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, రైతులు, బడుగులు, బలహీన వర్గాలు, మైనార్టీలు, వృత్తి వర్గాల వారంతా సిద్ధమేనా? మూడు ప్రాంతాల ప్రజల ప్రయోజనాలను రక్షించుకునేందుకు, జరిగిన మంచిని కొనసాగించేందుకు మీరంతా సిద్ధమేనా? ధర్మాన్ని గెలిపించడం కోసం, విశ్వసనీయతను కాపాడుకునేందుకు మీరంతా.. సిద్ధమేనా?' అని ప్రజలను ప్రశ్నించారు. (సిద్ధమేనని జనం నినదించారు). ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రజలకు మంచి చేశానని బాబు చెప్పలేడు

- నేను అది చేస్తాను.. నేను ఇది ఇస్తాను అని చెబుతాడు తప్ప.. తన గతం గురించి చెప్పడు. ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమంగా నాకు ఓటేస్తే కేజీ బంగారం ఇస్తాను, నాకు ఓటేస్తే ఇంటింటికీ బెంజ్ కారు కొనిస్తాను, సూపర్ సిక్స్.. సూపర్ సెవెన్ అని మాట్లాడతాడు తప్ప ఫలానా మంచి స్కీము తెచ్చాను.. దాన్ని చూసి నాకు ఓటు వేయండని ఈ పెద్దమనిషి అడగలేరు.
- ఎందుకంటే ప్రజలతో, పేదలతో ఈ పెద్దమనిషిది అతకని బంధం. చేసిన మంచి ఏమీ లేక నోటికి ఫెవికాల్ వేసుకుంటాడు. ఫెవిక్విక్ పూసుకుని నోరు మూసుకుంటాడు. మరి మీ బిడ్డ జగన్ ఇంటింటికీ మంచి చేస్తూ, ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు డీబీటీగా నేరుగా బటన్ నొక్కి నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి ఆ డబ్బులు జమ చేశారు. ఇంటింటికీ పౌర సేవలు డోర్ డెలివరీ చేయిస్తున్నాడు. అది పెన్షన్ కావచ్చు, రేషన్ కావచ్చు, వివిధ పథకాలు కావచ్చు.. లేదా బర్త్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కావచ్చు.
- మేనిఫెస్టో అంటే మన దృష్టిలో ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్. ఎన్నికల తర్వాత చంద్రబాబులా చెత్తబుట్టలో వేయాల్సింది కాదు. ఆ ఎన్నికల మేనిఫెస్టోలో ఏకంగా 99 శాతం హామీలు నెరవేర్చి మీ బిడ్డ మళ్లీ మీ ముందుకు వచ్చి నిలబడి మీ ఆశీస్సులు కోరుతున్నాడు.

లంచాలు, వివక్ష లేని వ్యవస్థను తెచ్చాం

- మీ జగన్‌లంచాలు లేని, వివక్ష లేని వ్యవస్థ తీసుకొచ్చాడు. గత ఎన్నికల్లో ఓటు వేయని వారికి సైతం అర్హత ఉంటే చాలని మేలు చేశాడు. గ్రామాల్లో స్కూళ్లు, ఆస్పత్రులను మార్చాడు. వ్యవసాయ రంగానికి ఊతంగా నిలిచాడు. సామాజిక న్యాయానికి అర్థం చెప్పాడు. అవ్వాతాతల సంక్షేమం, అక్కచెల్లెమ్మల సాధికారత అంటే ఇదీ అని చేసి చూపించాడు మీ బిడ్డ జగన్. మీ బిడ్డ చేసిన దాంట్లో కనీసం 10 శాతం అయినా నేను చేశానని ఇదే చంద్రబాబు గుండెల మీద చేయి వేసుకుని ధైర్యంగా నిబద్ధతతో చెప్పగలడా?
- జగన్ ఒకవైపున సిద్ధం సభలు పెట్టి ఏ గ్రామానికైనా కూడా 7 వ్యవస్థలు. ఓ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రం ఆర్బీకే వ్యవస్థ, విలేజ్ క్లినిక్ వ్యవస్థ, ఇంగ్లిష్ మీడియం, నాడునేడుతో మారిన మన గవర్నమెంట్ బడులు, ప్రతి గ్రామంలో ఓ మహిళా పోలీస్, ప్రతి అక్కచెల్లెమ్మ ఫోన్లో ఓ దిశ యాప్, అదే గ్రామంలో డిజిటల్ లైబ్రరీ, ఓ లంచాలు లేని, వివక్ష లేని పాలనతో గ్రామాన్నే మార్చిన వ్యవస్థ తీసుకొచ్చానని మీ బిడ్డ ధైర్యంగా చెబుతున్నాడు.
- కుప్పం నుంచి ఇచ్ఛాపురం మధ్య ఏ గ్రామమైనా తీసుకోండి. ఆ గ్రామంలో ఇవాళ మనం చెబుతున్న ప్రతి మాటా కళ్లెదుట కనిపిస్తోంది. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ, ఆర్బీకే, విలేజ్ క్లినిక్, మారిన ఇంగ్లిష్ మీడియం స్కూలు, మహిళా పోలీస్, ప్రతి అక్కచెల్లెమ్మ ఫోన్లో దిశ యాప్ కనిపిస్తుంది.

మంచి చేసి ఉంటే పొత్తులెందుకు?

చంద్రబాబును నిలదీసిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: చంద్రబాబునాయుడు నిజంగా ప్రజలకు మంచి చేసి ఉంటే.. ఆ పార్టీలతో పొత్తులు ఎందుకు పెట్టుకున్నారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. 'సిద్ధం సభల నుంచి మీ అందరి ముందు ఇదే ప్రశ్న అడుగుతున్నా. ఇప్పటి వరకు నాకైతే చంద్రబాబు సమాధానం ఇవ్వలేదు. మరి మీకేమైనా ఇచ్చాడా?' అని అడిగారు. 'అయ్యా చంద్రబాబూ.. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకుంటున్నావే.. ఎన్నికలు అయ్యాక ఒక్కసారైనా నాలా పబ్లిక్‌గా నీ మేనిఫెస్టోను చూపించి.. ఇదిగో నేను చెప్పిన హామీలను నెరవేర్చా అని చూపించే ప్రయత్నం చేశావా' అని కూడా ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్‌లో రెండు పోస్టులు చేశారు.

సీఎం జగన్ బస్సు యాత్రకు

ప్రవాసాంధ్రుల సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న ఎన్‌ఆర్‌ఐలు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు లండన్‌లోని వైఎస్సార్‌సీపీ నాయకులు జైకొట్టారు. వైఎస్సార్‌సీపీ యూకే కన్వీనర్లు డాక్టర్ ప్రదీప్ చింతా, ఓబుళ రెడ్డి పాతకోటల ఆధ్వర్యంలో యూకేలోని లీసెస్టర్ నగరంలో సమావేశమై బస్సుయాత్రకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులు భూమిరెడ్డి కార్తీక్, కోరముట్ల పునీత్, పాలెం క్రాంతి, చాళుక్య దేవరపల్లి, ఆదిత్య పుత్తికి రెడ్డి, ముడియాల కుమార్ పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండని ప్రతి ఒక్కరికీ చెప్పండి



- రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, చిన్నారులు, విద్యార్థులు, యువత కోసం, వైద్యం కోసం ఇవి చేశానని మీ బిడ్డ ధైర్యంగా చెప్పగలుగుతున్నాడు. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే తోడుగా నిలబడండి అని అడగగలుగుతున్నాడు.
- ఈరోజు ఇంటింటా మంచి జరిగింది. మీరంతా మీ ఇంట్లో ఉన్న అక్కచెల్లెమ్మలతో, ఇల్లాలితో, అవ్వాతాతలతో, చిన్న బిడ్డలు, పిల్లలతో మాట్లాడండి. చిన్న పిల్లలకు ఓటు లేదని వాళ్లతో మాట్లాడకుండా ఉండొద్దు. ఎవరి వల్ల మేలు జరిగిందని చర్చించండి. ఎవరు ఉంటే మన కుటుంబాలు బాగుపడతాయన్న విషయాన్ని లోతుగా ఆలోచించాలని కోరుతున్నా.
- ఈ విషయం ప్రతి ఒక్కరికీ కూడా చెప్పాలి. ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేస్తేనే ఇంటింటా అభివృద్ధి కొనసాగుతుందని చెప్పండి. ఇదే చంద్రబాబును పొరపాటున ఎవరైనా నమ్మారా.. అంటే బంగారు కడియం ఇస్తానన్న పులి.. కథను గుర్తు చేయండి. చంద్రబాబును నమ్మడం అంటే ఆ పులి నోట్లో తలకాయ పెట్టడమే అని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి. బాబు చరిత్రను వివరించండి. చంద్రబాబు పొత్తులు పెట్టుకున్న ఆ కూటమి చరిత్ర వివరించండి.

మన అభ్యర్థులను ఆశీర్వదించండి

మీ అందరి చల్లని దీవెనలు, ఆశీస్సులు మన అభ్యర్థుల మీద ఉంచవలసిందిగా కోరుతున్నా. నెల్లూరు ఎంపీ అభ్యర్థి, నాకు అత్యంత సన్నిహితుడు, సౌమ్యుడు విజయసాయిరెడ్డిని గొప్ప మెజార్టీతో గెలిపించాలి. కావలి నుంచి ప్రతాప్, నెల్లూరు రూరల్ నుంచి ఆదాల ప్రభాకర్, కొవ్వూరు నుంచి ప్రసన్నకుమార్, నెల్లూరు సిటీ నుంచి ఒక సామాన్యుడు, మీలో ఒకరైన ఖలీల్, ఉదయగిరి నుంచి రాజగోపాల్, ఆత్మకూరు నుంచి విక్రమ్ (నా స్నేహితుడు గౌతమ్ సోదరుడు), కందుకూరు నుంచి మధుసూదన్ యాదవ్‌లను గెలిపించాలి. మన గుర్తు ఫ్యాన్ అని మరచిపోవద్దు.

చంద్రబాబు విఫల హామీలు

- 2014లో చంద్రబాబు ఇదే కూటమిగా ఏర్పడి ఇదే ముగ్గురు.. ఇంటింటికీ పంపించిన పాంప్లెట్ ఇది. (చేత్తో చూపిస్తూ..) గుర్తుందా ఈ పాంప్లెట్? ఇందులో మోడీగారి ఫొటో ఉంది. దత్తపుత్రుడి ఫొటో, చంద్రబాబు నాయుడు ఫొటో ఉంది. కింద చంద్రబాబు నాయుడు సంతకం కూడా ఉంది. ప్రతి టెలివిజన్ చానల్‌లో వాళ్ల ఈనాడులో, ఆంధ్రజ్యోతిలో, టీవీ-5లో ఊదరగొడుతూ దీని గురించి అడ్వర్టైజ్ మెంట్లు కూడా ఇచ్చారు.
- రైతులకు రుణ మాఫీపై మొదటి సంతకం చేస్తా అన్నాడు. రూ.87,612 కోట్లు రుణ మాఫీ చేశాడా? పొదుపు సంఘాల డ్వాక్రా రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేశాడా? ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకు అకౌంట్లో డిపాజిట్ చేశాడా? మీ ఇంట్లో.. మీ పక్కిళ్లలో 2014-2019 మధ్య ఆడ బిడ్డలు పుట్టారు కదా.. వాళ్లలో ఒక్కరికైనా రూ.25 వేలు ఇచ్చారా? ఇంటింటికీ ఉద్యోగం.. లేదా నెలనెలా రూ.2 వేల నిరుద్యోగభృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లు.. అంటే 60 నెలలకు నెలకు రూ.2000 చొప్పున లెక్కిస్తే.. ప్రతి ఇంటికీ రూ.1.20 లక్షలు ఇచ్చారా? అర్హులైన వాళ్లందరికీ 3 సెంట్ల స్థలం ఇచ్చారా? రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాలన్నీ మాఫీ అన్నాడు.. చేశాడా?
- మహిళల రక్షణకు ఉమెన్‌ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు జరిగిందా? రాష్ట్రాన్ని సింగపూర్‌ను మించి అభివృద్ధి చేస్తానన్నాడు. ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి మన కావలిలో ఏమన్నా కనిపించిందా? ఇప్పుడు మళ్లీ అదే మోసం. అవే పొత్తులు. ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ మళ్లీ మోసం చేయడానికి వస్తున్నాడు. ఈ ముగ్గురూ కలిసి ఇంటింటికీ కేజీ బంగారం అంటున్నారు. ఇంటింటికీ బెంజ్ కారు కొనిస్తామంటున్నారు. సూపర్ సిక్స్.. సూపర్ సెవెన్.. అంటున్నాడు. నమ్ముతారా?
- ఇన్ని అబద్ధాలు, ఇన్ని మోసాలతో రాష్ట్ర పేదల భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునే ఈ యుద్ధానికి మీరంతా సిద్ధమేనా? (సిద్ధమేనని జనం నినాదాలు) మీలో ప్రతి ఒక్కరూ ఒక స్టార్ క్యాంపెయినర్‌గా ప్రతి పేదవాడి ఇంటికీ వెళ్లి నిజాలు చెప్పి వారిని కూడా స్టార్ క్యాంపెయినర్లుగా మార్చాలి. మీరు సిద్ధంగా ఉంటే మోసగాళ్ల సోషల్ మీడియా, ఎల్లో మీడియా అసత్యాల యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు మీ జేబులోంచి సెల్ ఫోన్ బయటకు తీసి, అందులోని టార్చ్ లైట్ వెలిగించండి. (అందరూ సెల్‌లో టార్చ్ వెలిగించి పైకెత్తి చూపారు). 175 అసెంబ్లీ స్థానాలకు 175, 25 ఎంపీ సీట్లుకు 25 మొత్తం రెండు వందల సీట్లు.. ఎక్కడా తగ్గేందుకు వీల్లేదు. ఓటు అడిగే నైతికత ఇంటింటికీ మంచి చేసిన మనకు మాత్రమే ఉంది. కాబట్టి మీ జగన్‌కు, మీ బిడ్డకు, మీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తోడుగా నిలవాలి.



వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నేతలు

- సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన జనసేన అమలాపురం ఇన్‌చార్జ్ రాజబాబు తదితరులు
- అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ కూడా..



సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన శెట్టిబత్తుల రాజాబాబు తదితరులు



సీఎం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన లాకా వెంగళరావు. చిత్రంలో ఎంపీ బీద మస్తాన్ రావు

సాక్షి, అమరావతి/కావలి: జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు శనివారం పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా శనివారం మధ్యాహ్నం నెల్లూరు జిల్లా ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో అమలాపురం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ శెట్టిబత్తుల రాజబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనరల్ సెక్రటరీ ఎస్.శ్రీనుబాబు, ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సీహెచ్ వెంకటేశ్వరరావు, కొవ్వూరు వీర మహిళా విభాగం నేత చెట్టి సుభాషిణి, అమలాపురం మండల జనరల్ సెక్రటరీ కె.చినబాబుతో పాటు జనసేన పార్టీలోని వివిధ విభాగాలకు చెందిన నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే అఖిల భారత యాదవ సంఘం, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ సీఎం జగన్ పార్టీ కండువా కప్పి.. సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు బీదమస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఇలా..

- ఉదయం 9 గంటలకు జువ్విగుంట క్రాస్ నుంచి యాత్ర ప్రారంభం
- పెద్ద అరికట్ల దాటిన తర్వాత భోజన విరామం
- సాయంత్రం కొనకనమెట్ల క్రాస్ వద్ద సీఎం బహిరంగ సభ



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర పదో రోజైన ఆదివారం(ఏప్రిల్ 7) షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం శనివారం విడుదల చేశారు. ఈ యాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్ శనివారం రాత్రి బస చేసిన జువ్విగుంట క్రాస్ నుంచి ఆదివారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. పెద్ద అలవలపాడు, కనిగిరి మీదుగా పెద్ద అరికట్ల దాటిన తర్వాత భోజన విరామం తీసుకుంటారు. అనంతరం చిన్న అరికట్ల, మూగచింతల మీదుగా కొనకనమెట్ల క్రాస్ వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 3.30 గంటలకు బహిరంగ సభలో పాల్గొని సీఎం జగన్ ప్రసంగిస్తారు. అనంతరం బత్తువారిపల్లి, సలకనూతల క్రాస్, పొదిలి, రాజంపల్లి, దర్శి మీదుగా వెంకటాచలంపల్లి వద్ద ఏర్పాటు చేసిన రాత్రి బసకు చేరుకుంటారు.

నెల్లూరు జిల్లా

సిద్ధమా?

మేమంతా సిద్ధం బస్సు యాత్ర శనివారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా 'నెల్లూరు జిల్లా సిద్ధమా?' అంటూ సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. మేమంతా సిద్ధమంటూ అశేష జనసందోహం సీఎం జగన్‌తో కలిసి ముందుకు సాగింది.

- సాక్షి, అమరావతి

9 వ రోజు

స్టార్ క్యాంపెయినర్‌లతో సీఎం వైఎస్ జగన్


'మేమంతా సిద్ధం యాత్రలో తొమ్మిదో రోజున నా స్టార్ క్యాంపెయినర్లతో..' అంటూ సీఎం జగన్ శనివారం కొన్ని ఫొటోలను ట్వీట్ చేశారు. ఓ నడవలేని దివ్యాంగ యువకుడిని కింద కూర్చొని పలకరించిన సీఎం జగన్.. నేనున్నాను అంటూ అతనికి ధైర్యం చెప్పారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ.. వారితో మమేకమయ్యారు. అలాగే పలువురు తమ సమస్యలు చెప్పకోగా.. వారికి నేనున్నాంటూ భరోసా కల్పించారు.

– సాక్షి, అమరావతి













రాజుపాళ్యం: బస్సుయాత్రకు హాజరైన భారీ జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

నువ్వే కావాలి జగన్

మేమంతా సిద్ధం బస్సు యాత్రలో నినదించిన సింహపురి ప్రజానీకం

(మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి)
సాక్షి ప్రత్యేక ప్రతినిధి:

కుల మతాలకు అతీతంగా తమకు మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌ను దగ్గరి నుంచి చూడాలని, వీలైతే మాట్లాడాలని ఊరూ వాడల్లోని చిన్నా, పెద్దా తరలివచ్చి శనివారం 9వ రోజు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టారు. 'మళ్లీ నువ్వే కావాలి జగన్' అంటూ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. కావలి బహిరంగ సభ జన సంద్రాన్ని తలపించింది. చింతారెడ్డిపాలెంలోని రాత్రి బస నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ యాత్ర ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. అంతకు ముందు తనను కలిసిన నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కావలి, సర్వేపల్లి, ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు ఎన్నికల కార్యాచరణపై సీఎం జగన్ దిశా నిర్దేశం చేశారు. ఈ క్రమంలో చింతారెడ్డిపాలెం రోడ్‌షోలో ఓ మహిళ తన బిడ్డ అనారోగ్య బాధను చెప్పుకునేందుకు ఎదురు చూస్తుండడాన్ని గమనించిన సీఎం.. దగ్గరకు పిలిపించుకుని మాట్లాడారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భగత్‌సింగ్ కాలనీకి చేరుకునే సరికి జాతీయ రహదారిపై భారీగా హాజరైన మహిళలు ఘన స్వాగతం పలికారు.

ఆ బిడ్డను చూడకపోతే ఎలా?

సూరీడు నడినెత్తిపైకి వచ్చాడు.. ఎండ వేడికి రోడ్డు సెగలు పుట్టిస్తోంది.. చెట్టు నీడలోనూ చెమట చుక్క ఆరట్లేదు.. ఇంతలో నెత్తిపై తుండు గుడ్డతో బక్కపల్చని శరీరంతో 70 ఏళ్ల వృద్ధురాలు కావలి పట్టణ శివారులో కనిపించింది. ఎవరి కోసమో ఎదురు చూస్తోంది. 'ఏం అవ్వా.. మండుటెండలో ఇక్కడేం చేస్తున్నావు' అని అడిగితే.. 'జగన్ బాబు ఇంకా రాలేదా.. ఎంత దూరంలో ఉన్నాడు..' అని ఎదురు ప్రశ్నించింది. 'ఈ వయసులో ఒక పక్క గస పోస్తూ ఎండుకీ తిప్పలు' అంటే.. ఒకింత కోపంతో చూసింది. నాలాంటోళ్లు ఎందరికో ఆయన ఎంతో మేలు చేశాడు. 'అలాంటి బిడ్డ మా ఊరికి వచ్చినప్పుడు చూడకపోతే ఎలా? నా పేరు శాంతమ్మ. నాకు ముగ్గురు ఆడ బిడ్డలు. పెళ్లిళ్లు చేసుకుని వెళ్లిపోయారు. అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్తుంటారు. కానీ.. జగన్ బాబు నా బాగు కోసం ప్రతి నెలా 1వ తేదీనే ఇంటికి పింఛన్ పంపించాడు. అది ఇప్పుడు ఇంటికి రాకుండా వాళ్లు (టీడీపీ)ఆపేశారు. అందుకే జగన్‌బాబు ఏం చేబితే అది చేద్దామని ఇక్కడికి వచ్చాను' అని చెప్పింది. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో శాంతమ్మలాంటి ఎంతో మంది అవ్వాతాతలు కనిపించారు.

అడుగడుగునా ఘన స్వాగతం

కోవూరు నియోజకవర్గం పడుగుపాడులో పలువురు మహిళలు గుమ్మడికాయలతో దిష్టితీసి సీఎం విజయాన్ని కాంక్షించారు. బుల్లితెర నటుడు రియాజ్ సైతం సీఎంను కలిసి బస్సు యాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం సున్నబట్టి, తిప్ప మీదుగా సీఎం రోడ్ షో నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజుపాళ్యంలో మండుటెండను సైతం లెక్కచేయకుండా ఎదురు చూస్తున్న అక్కచెల్లెమ్మలను ఆప్యాయంగా పలకరించి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. చింతరెడ్డిపాలెం నుంచి సింగరాయకొండ వరకు చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై ప్రజాభిమానం వెల్లువెత్తింది. బస్సు దిగి సీఎం జగన్ మహిళలు, వృద్ధులను పలుకరించారు.

ఎండను లెక్క చేయని అభిమానం

ఐదేళ్ల పాలనలో తాము ఆర్థికంగా నిలదొక్కుకుని, ఆత్మగౌరవంతో జీవించడానికి చేదోడుగా నిలిచిన సీఎం జగన్‌ను ఒక్కసారైనా చూడాలన్న ప్రజల కోరిక ముందు భగభగమండే సూరీడు సైతం చిన్నబోయాడు. మిట్ట మధ్యాహ్నం 41 డిగ్రీలకు పైగా ఉన్న ఎండను సైతం లెక్క చేయకుండా తిప్ప, గౌరవరం, కావలి బైపాస్‌లో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, చంటిబిడ్డ తల్లులు రోడ్లపై బారులు తీరి జననేతను చూడటానికి పోటీపడ్డారు. మార్గం మధ్యలో భారీ గజమాలతో సత్కరించారు. సీఎం జగన్ 4.30 గంటలకు రోడ్‌షో ద్వారా కావలిలోని సభా స్థలికి చేరుకున్నారు. సభ అనంతరం సీఎం బస్సు యాత్ర ఏలూరుపాడు, ఉలవపాడు మీదుగా 7 గంటలకు సింగరాయకొండ క్రాస్‌కు చేరుకుంది. ఉదయం నుంచి సీఎం రాక కోసం ఎదురు చూస్తున్న ప్రజలు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఓగురు మీదుగా 8 గంటలకు కందుకూరుకు చేరుకున్న సీఎం జగన్ బస్సు యాత్రపై బంతిపూల వర్షం కురిసింది.పొన్నలూరు, వెంకుపాలెం మీదుగా ప్రకాశం జిల్లాలోని జువ్విగుంట క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి సీఎం జగన్ చేరుకున్నారు.

జనసంద్రమైన కావలి

పెద్ద ఎత్తున కదలివచ్చిన జనం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా కావలిలో నినాదాలు హోరెత్తించారు. జాతీయ రహదారి జనాలతో కిక్కిరిసిపోయింది. సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసానికి జనసంద్రమే ప్రతీక అని పరిశీలకులు అభివర్ణిస్తున్నారు.



సింగరాయకొండ వద్ద సీఎం జగన్‌కు గజమాలతో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆదిమూలపు సురేష్ స్వాగతం



సింగరాయకొండ క్రాస్: సీఎం జగన్ రోడ్ షోలో రహదారికి రెండు వైపులా బారులుతీరిన జనం



కందుకూరు: సీఎం జగన్‌కు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



నెల్లూరు: బస్సుయాత్రకు హాజరైన భారీ జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

వుల్లపల: అవ్వలతో ఆత్మీయంగా...







మీ రాజీనామాలతో బాబు గుండెల్లో రైళ్లు

కావలికి చెందిన వలంటీర్లతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

రెండోసారి అధికారంలోకి వచ్చాక తొలి సంతకం వలంటీర్ల ఫైల్‌పైనేనని హామీ



టీషర్టు మీద 8/8 స్టాంప్ వేస్తున్న సీఎం జగన్

కావలి/నెల్లూరు(దర్గామిట్ట)/అల్లూరు/కావలి: రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల రాజీనామాలతో చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని సీఎం వైఎస్ జగన్ అన్నారు. మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా శనివారం మధ్యాహ్నం ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న ఆర్‌ఎస్‌ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్దకు వచ్చిన ఆయన్ను కావలికి చెందిన పలువురు వలంటీర్లు కలిశారు. ఈ సందర్భంగా సీఎం వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'రెండోసారి మిమ్మల్ని సీఎంగా చేసుకునేందుకు కావలి పట్టణానికి సంబంధించిన వలంటీర్లందరం రాజీనామా చేశాం' అని తెలపగా.. పైవిధంగా సీఎం జగన్ స్పందించారు. తాను రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసే సమయంలోనే వలంటీర్లకు సంబంధించిన ఫైలుపైనే తొలి సంతకం చేస్తానని, సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలను కొనసాగిస్తామని చెప్పారు.

జిల్లాలో క్లీన్ స్వీప్ ఖాయం

జిల్లాలోని ఒక పార్లమెంట్, 8 అసెంబ్లీ స్థానాల్లో క్లీన్‌స్వీప్ చేయడం తథ్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇందుకు గుర్తుగా నెల్లూరు జిల్లా చింతారెడ్డిపాలెం స్టే పాయింట్ వద్ద టీషర్టుల మీద 8 బై 8 వైఎస్సార్‌సీపీ స్టాంప్‌ను వేసి అందరికీ ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి, ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నేనున్నానంటూ భరోసా

బస్సు యాత్రలో సీఎం జగన్‌కు సమస్యలు చెప్పకున్న పలువురు బాధితులు

ఆదుకుంటానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి

వెంటనే అధికారులకు ఆదేశాలు



ఆత్మకూరు/నెల్లూరు(దర్గామిట్టా)/కావలి/కోవూరు: 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర చేస్తున్న సీఎం జగన్ శనివారం నెల్లూరు జిల్లాలో తనను కలిసిన పలువురు బాధితులకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. వారి సమస్యలను సావధానంగా విని.. 'బాధపడకండమ్మా.. ఆదుకుంటానంటూ' వారి కన్నీళ్లు తుడిచారు. అప్పటికప్పుడు తగిన సాయమందించాలంటూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి.. అండగా నిలిచారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం వల్లిపేడుకు చెందిన గద్దం పెద సుబ్బయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సీఎం జగన్‌ను కలిసి తన బాధను చెప్పుకునేందుకు శనివారం నెల్లూరు సింహపురి ఆస్పత్రి సెంటర్‌కు చేరుకున్నాడు. బస్సు యాత్రలో భాగంగా అక్కడికి చేరుకున్న సీఎం జగన్ అంతమంది జనంలోనూ వీల్‌చైర్‌లో ఉన్న పెద సుబ్బయ్యను చూసి.. పరిస్థితిని ఆరా తీశారు. వెంటనే సుబ్బయ్యకు మెరుగైన చికిత్స అందించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

నా బిడ్డను బతికించన్నా..

నెల్లూరు జిల్లా సింగపేటకు చెందిన వ్యవసాయ కూలీ రవిచంద్ర తన నాలుగేళ్ల కుమార్తె బ్లెస్సీతో కలిసి సీఎం జగన్‌ను కలిసేందుకు ఉలవపాళ్ల కూడలి వద్దకు వచ్చాడు. 'నా కుమార్తె పుట్టినప్పటి నుంచే జన్యు సంబంధిత సమస్యలతో బధిరత్వం, ఫిట్స్‌తో బాధపడుతోంది. రెండేళ్ల కిందట నా భార్య కూడా చనిపోయింది. చికిత్స కోసం నా కుమార్తెను చెన్నైలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లా.. అనంతరం అక్కడి వైద్యుల సలహా మేరకు రాయవెల్లూర్‌లో చూపిస్తున్నా. నా బిడ్డను బతికించుకునేందుకు.. చికిత్సకు తగిన సాయం కోసం సీఎం జగన్‌ను కలిసేందుకు వచ్చా'అని రవిచంద్ర చెప్పాడు. వీరి పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి వ్యక్తిగత సిబ్బంది వివరాలన్నీ నమోదు చేసుకున్నారు.

అవ్వా.. పింఛన్ వస్తోందా?

బస్సు యాత్ర చేస్తున్న సీఎం జగన్ నెల్లూరు జిల్లా నార్త్‌రాజుపాలేనికి చెందిన పుల్లా లక్ష్మమ్మను 'అవ్వా, పింఛన్ వస్తోందా' అంటూ ఆరా తీశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ తమ ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారని.. చంద్రబాబు నిర్వాకం వల్ల ఈనెల అష్టకష్టాలు పడ్డామని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. 'మళ్లీ నువ్వే రావాలి.. మాలాంటి వృద్ధులను కంటికి రెప్పలా కాపాడాలి' అని సీఎం జగన్‌ను కోరింది. ముఖ్యమంత్రి స్పందిస్తూ.. 'మరో రెండు నెలల్లో నీ మనవడి ప్రభుత్వం మళ్లీ రాబోతోంది. మీ సమస్యలు తీరుస్తా' అని భరోసా ఇచ్చారు.

కాలు దెబ్బతిన్న బాధితుడికి అండ



అల్లూరు మండలం తూర్పు గోగులపల్లికి చెందిన సత్యనారాయణకు 20 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు పూర్తిగా దెబ్బతింది. మెరుగైన వైద్యం కోసం సీఎం జగన్ సాయం కోరేందుకు నెల్లూరుకు వచ్చాడు. సత్యనారాయణను పరామర్శించిన ముఖ్యమంత్రి.. ఆయనకు ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆ దేవుడికి సమస్యలు చెప్పకున్నాం..



బుజబుజనెల్లూరుకు చెందిన చల్లా కృష్ణ దంపతులు సీఎం జగన్‌ను కలిసేందుకు జాతీయ రహదారిపైకి వచ్చారు. వారిని చూసిన సీఎం జగన్ బస్సులో నుంచి దిగివచ్చి.. చల్లా కృష్ణ దంపతులతో మాట్లాడారు. తాము అనారోగ్యంతో బాధపడుతున్నామని.. తనకు రెండుసార్లు వైద్యులు ఆపరేషన్ చేశారని చల్లా కృష్ణ సీఎం జగన్‌కు తెలిపారు. తన భార్య ఆరోగ్య పరిస్థితి కూడా సరిగ్గా లేదని.. ముగ్గురు సంతానం ఉన్నారని వివరించారు. వారి సమస్యను విన్న సీఎం జగన్ 'బాధపడకండి.. ఆదుకుంటా'నంటూ భరోసా ఇచ్చారు. పేదల పాలిట దేవుడైన సీఎం జగన్‌కు తమ సమస్యలు చెప్పుకున్నామని మీడియాకు చల్లా కృష్ణ తెలిపారు.

బాబు చేతిలో కీలుబొమ్మ సునీత

2019లో కడప ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాశ్‌ను ఖరారు చేసిన వైఎస్ జగన్ ● అవినాశ్ గెలుపు కోసం చివరి వరకూ కృషి చేసిన వివేకా

- సునీత దంపతుల ఆదేశాలతోనే వివేకా లేఖను దాచిన పీఏ
- గుండె పోటు ప్రచారం చేసిందే నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి
- తండ్రి హంతకులు, కుట్రదారులతో సఖ్యతగా ఉంటున్న సునీత దంపతులు



సాక్షి, అమరావతి: పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ లోకం అంతా కళ్లు మూసుకుందని అనుకున్నట్టుగా ఉంది నర్రెడ్డి సునీత తీరు. ఆమె చంద్రబాబు నాయుడు చేతిలో కీలుబొమ్మగా మారి, బాబు కుట్రలో భాగస్వామిగా మారి ఆమె తండ్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై అవాస్తవాలు ప్రచారం చేస్తూ.. రాష్ట్ర ప్రజలంతా నమ్మేస్తారని భ్రమపడుతున్నారు. ఇదే భావనతో హైదరాబాద్‌లో శనివారం మీడియా సమావేశం నిర్వహించి మరీ చంద్రబాబు స్క్రిప్ట్‌ను వినిపించారు. ఇన్నాళ్లు బాధితురాలిగా వేసుకున్న ముసుగును తొలగించి పూర్తిగా టీడీపీ మనిషినేనని బయటపడ్డారు. ఓ వైపు ఆమె తండ్రి వైఎస్ వివేకా హత్య వెనుక ఎవరున్నారో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తూనే, మరోవైపు వివేకా హంతకులతో జట్టు కడుతుండటం ఆమెకే చెల్లింది. వివేకానందరెడ్డి రెండో వివాహంతో కుటుంబంలో తలెత్తిన విభేదాలను మరుగున పెట్టి, తన తండ్రి హత్య వెనుక ఆస్తి వివాదాలు లేవని నమ్మిచేందుకు విఫలయత్నం చేస్తున్నారు. ఇన్నాళ్లు కడప ఎంపీ అభ్యర్థిత్వంపై అవాస్తవాలు ప్రచారం చేసిన సునీత.. తాజాగా పులివెందుల ఉప ఎన్నికల్లో అభ్యర్థిత్వంపైనా అబద్ధాలు చెబుతున్నారు. ఆమె తండ్రి రాసిన లేఖను వారే దాచిపెట్టిన నిజం, గుండెపోటు కథను వారే ప్రచారంలోకి తెచ్చిన వాస్తవం బయటపడకుండా చూడటమే ధ్యేయమన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ వివేకాను కుట్రతో ఓడించింది చంద్రబాబు ముఠాయేనని, 2019 ఎన్నికల్లో వివేకాను టీడీపీకి అడ్డుగా లేకుండా చేసిందీ ఎల్లో గ్యాంగేనన్నది బహిరంగ రహస్యం. అందుకే ఆమె అబద్ధాలను ప్రజలు నమ్మడంలేదు. అసత్య ప్రచారాన్ని పూర్తి ఆధారాలతో సహా, హేతుబద్ధమైన ప్రశ్నలతో ప్రజానీకం తిప్పికొడుతోంది.

విజయమ్మకు వ్యతిరేకంగా వివేకా ఎందుకు పోటీ చేశారు?

వైఎస్ రాజశేఖర రెడ్డి హఠాన్మరణం తర్వాత వైఎస్ కుటుంబంలో పరిణామాలను సునీత వక్రీకరించారు. పులివెందుల ఉప ఎన్నికల్లో వైఎస్ భాస్కర్ రెడ్డి పోటీ చేయాలని భావించగా వివేకానందరెడ్డి వ్యతిరేకించారని, వైఎస్ విజయమ్మే పోటీ చేయాలని పట్టుబట్టారన్నారు. సునీత ఎంత పచ్చిగా అబద్ధాలు చెబుతున్నారో ఇదే నిదర్శనం. పులివెందులలో విజయమ్మ పోటీ చేయాలని చెప్పిన వివేకా.. ఆమెకు వ్యతిరేకంగా పోటీ చేశారనే విషయాన్ని సునీత ఎందుకు చెప్పలేదు? ఎందుకంటే ఆ ఎన్నికల్లో భాస్కర్‌రెడ్డి పోటీ విషయం చర్చకే రాలేదు. విజయమ్మనే పోటీ చేయించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. ఆమే పోటీ చేశారు కూడా. కానీ వైఎస్ వివేకానందరెడ్డి తన సతీమణి సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఒత్తిడికి లొంగి కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా చేరారు. వారి ఒత్తిడితోనే పులివెందులలో విజయమ్మపై పోటీ చేశారు. ప్రజలు మాత్రం సీఎం జగన్, వైఎస్ విజయమ్మ వెన్నంటి నిలిచారు. ఆ ఉప ఎన్నికల్లో కడప ఎంపీగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, పులివెందుల ఎమ్మెల్యేగా వైఎస్ విజయమ్మ భారీ మెజార్టీతో గెలిచారు. దీన్ని వక్రీకరించి ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిపై దుష్ప్రచారం చేసేందుకు సునీత యత్నించడం విడ్డూరంగా ఉంది.

కడప ఎంపీ అభ్యర్థిత్వంపైనా అవాస్తవాలే?

2014లో కడప ఎంపీగా వైఎస్ షర్మిల పోటీ చేయాలని వివేకా భావించారని సునీత చెప్పుకొచ్చారు. అసలు కడప ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాశ్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ ఏకాభిప్రాయంతో ఎంపిక చేసింది. వివేకా కూడా ఏకీభవించారు. 2019 ఎన్నికల్లో కూడా అప్పటికే సిట్టింగ్ ఎంపీగా ఉన్న అవినాశ్ రెడ్డినే మరోసారి పోటీ చేయించాలని వైఎస్ జగన్ నిర్ణయించారు. ఆ ఎన్నికల ఇన్‌చార్జిగా వివేకానందరెడ్డినే నియమించారు. వివేకా చివరివరకూ అవినాశ్ రెడ్డి విజయం కోసం శ్రమించారు. హత్యకు గురికావడానికి ముందు రోజు కూడా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పర్యటించి ఎంపీగా అవినాశ్ రెడ్డిని, ఎమ్మెల్యేగా రఘురామిరెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. పార్టీ నేతలతో చర్చించి వచ్చారు. వివేకానందరెడ్డి చివరివరకూ అవినాశ్ విజయం కోసం పనిచేశారని సునీతే 2019 మార్చి 21న హైదరాబాద్‌లోనే మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ విషయం బాబు చేతిలో కీలుబొమ్మగా మారిన ఆమె మర్చిపోయిందేమో కానీ, ప్రజలందరికీ గుర్తుంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకాను ఓడించింది చంద్రబాబు ముఠానే

2017 వైఎస్సార్ జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో సునీత ఆరోపణలూ అసత్యాలే. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వివేకానందరెడ్డినే వైఎస్ జగన్ ఎంపిక చేశారు. జిల్లాలో మెజార్టీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందినవారే కావడంతో వివేకా విజయం సులువేనని అంతా భావించారు. వివేకా ఎమ్మెల్సీగా ఎన్నికైతే జిల్లాలో టీడీపీ ఉనికికే ప్రమాదమని చంద్రబాబు భావించారు. అందుకే వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురి చేసి, కుట్రపూరితంగా వివేకాను ఓడించారు. ఈ వ్యవహారంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణరెడ్డి కీలకపాత్ర పోషించారు. వాస్తవాలిలా ఉంటే.. సునీత మాత్రం వివేకాను ఎంపీ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి ఓడించారని పదే పదే అసత్యాలు చెప్పడం విడ్డూరంగా ఉంది.



నర్రెడ్డి సునీత - రాజశేఖర్‌రెడ్డి దంపతులు



దస్తగిరి

వివేకా హంతకులతో సునీత దంపతుల సాన్నిహిత్యం

వివేకానందరెడ్డి హత్యకు గురైన సమయంలో ఆయన నివాసంలో ఉన్న ఎర్ర గంగిరెడ్డి, దస్తగిరి, సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డితో సునీత దంపతులకే దశాబ్దాలుగా సాన్నిహిత్యం ఉంది. ఆ నలుగురితో వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డికి సాన్నిహిత్యం లేదు. ఇక వివేకాను గొడ్డలితో నరికి చంపానని అంగీకరించిన హంతకుడు దస్తగిరితో సునీత దంపతులు ఇప్పటికీ ఎందుకు సఖ్యతతో ఉంటున్నారన్నది మరో కీలకాంశం. టీడీపీ ప్రభుత్వంలో నియమించిన సిట్, తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్, సీబీఐ కూడా వివేకానందరెడ్డిని దస్తగిరితో సహా నలుగురు హత్య చేశారని నిర్ధారించాయి. వివేకాను గొడ్డలితో స్వయంగా నరికాను అని చెప్పిన దస్తగిరి అప్రూవర్‌గా మారడంతోనే ఈ కేసు దర్యాప్తు దారితప్పింది. సునీత, ఆమె భర్త దస్తగిరితో పలు సార్లు భేటీ అవుతున్నారు. టీడీపీ నేతలు ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవితోనూ సన్నిహితంగా ఉంటున్నారు. అంటే వివేకా కుటుంబం, టీడీపీ నేతల పన్నాగంలో భాగంగానే దస్తగిరి అప్రూవర్‌గా మారారన్నది సుస్పష్టం. వివేకా హంతకుడితో, రాజకీయ ప్రత్యర్థులతోనూ ఆ కుటుంబం సన్నిహితంగా ఉండటం ఈ హత్య కుట్రలో వారి సామూహిక భాగస్వామ్యాన్ని బహిర్గతం చేస్తోంది.

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే వివేకా హత్య.. అది ఎల్లో గ్యాంగ్ కుట్రే

తన తండ్రి హంతకులను శిక్షించడం కోసమే పోరాడుతున్నా అని చెబుతున్న సునీత ఉద్దేశపూర్వకంగా ఓ విషయాన్ని మర్చిపోతున్నారు. వివేకా హత్యకు గురైంది చంద్రబాబు ప్రభుత్వ హయంలోనే. 2019 ఎన్నికల్లో కడప లోక్‌సభ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం కోసం వివేకా ఎన్నికల వ్యూహాలు పన్నుతూ అందర్నీ కలుపుకొంటూ దూసుకుపోతున్నారు. దాంతో అప్పటి సీఎం చంద్రబాబు, మంత్రి ఆదినారాయణ రెడ్డి బెంబేలెత్తారు. వివేకా జీవించి ఉంటే వారితో పాటు బీటెక్ రవికీ రాజకీయంగా ప్రతిబంధకంగా మారుతారు. ఈ నేపథ్యంలోనే వివేకా హత్యకు గురయ్యారు. వివేకా భౌతికంగా లేకపోవడం రాజకీయంగా ప్రయోజనం కలిగిస్తుందని టీడీపీ పెద్దలు భావించారన్నది సుస్పష్టం. వివేకా హత్యకు ముందు టీడీపీ నేతలు కొందరితో రహస్య సమావేశాలు, హత్య తరువాత ఆ నేతలు వ్యవహరించిన తీరే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. వివేకాతో ఆర్థిక విభేదాలు తలెత్తిన కొమ్మారెడ్డి పరమేశ్వరెడ్డితో బీటెక్ రవి సాన్నిహిత్యం పెంచుకున్నారు. హత్యకు ముందు రోజు అంటే 2019 మార్చి 14 సాయంత్రం టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవితో హరిత హోటల్‌లో రెండుసార్లు సమావేశమయ్యారు. ఈ భేటీలో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి తర్వాత కొద్ది రోజులకే అనుమానాస్పద రీతిలో మృతి చెందడం గమనార్హం. సిట్ దర్యాప్తులో నార్కో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినా పరమేశ్వరరెడ్డి తిరస్కరించడం సందేహాలకు తావిస్తోంది. అంటే వివేకా హత్య వెనుక ఎల్లో గ్యాంగ్ ఉందన్నది స్పష్టమవుతోంది. సునీత మాత్రం చంద్రబాబు, ఆది నారాయణరెడ్డి, బీటెక్ రవిల పేర్లనే ప్రస్తావించడం లేదు.

హడావుడిగా ఆస్తుల బదిలీ ఎందుకో..

వివేకానందరెడ్డి హత్య వెనుక కుటుంబ ఆస్తి వివాదాలు లేవని నమ్మిచేందుకు సునీత యత్నించారు. అసలు తన తండ్రి వివేకానందరెడ్డి పేరిట ఆస్తులేవీ లేవని చెప్పుకొచ్చారు. మరి ఆస్తులు ఏవీ లేకపోతే కుటుంబ కంపెనీల్లో ఆయన చెక్ పవర్‌ను ఆమె తల్లితో కలిసి ఎందుకు రద్దు చేశారు? వివేకా హత్య తరువాత పులివెందులలో ఉన్న భూములను హడావుడిగా తన పేరిట సునీత మార్చుకున్నారని రెవెన్యూ రికార్డులు వెల్లడిస్తున్నాయి కదా. ఆస్తుల బదిలీలో ఈ హడావుడి ఎందుకు?

అంటే దస్తగిరి వాంగ్మూలం తప్పేకదా

అంతేకాదు దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పిన బెంగళూరు భూ సెటిల్‌మెంట్ వివాదం అన్నది లేనేలేదని సీబీఐ చెప్పిందని సునీత గుర్తుచేస్తున్నారు. అంటే అప్రూవర్‌గా మారుతూ దస్తగిరి చెప్పిన విషయాలు అవాస్తవాలేనని సునీత అంగీకరించినట్టే కదా. అలా అయితే దస్తగిరి ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిపై చేస్తున్న ఆరోపణలన్నీ కూడా అవాస్తవమే అవుతాయి కదా. వైఎస్ వివేకా హత్యతో వారికి సంబంధం లేనట్టే అవుతుంది. ఆ విషయాన్ని సునీత ఎందుకు అంగీకరించడంలేదు? అవినాశ్ రెడ్డిపై అసత్య ఆరోపణలను ఎందుకు కొనసాగిస్తున్నారు? అంటే.. కేవలం చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే ఆమె వ్యవహరిస్తున్నారన్నది స్పష్టమవుతోంది.

చంద్రబాబు చేతిలో కీలుబొమ్మే

తన వెనుక ఏ పార్టీ లేదని సునీత ఎంతగా నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, చంద్రబాబు చేతిలో ఆమె కీలుబొమ్మగా మారారన్నది ఆమె వ్యవహార శైలే చెబుతోంది. టీడీపీకి రాజకీయంగా ప్రయోజనం కలిగించేందుకే వైఎస్సార్‌సీపీకి ఓటేయకూడదని అంటున్నారు. బాబు ఐదేళ్లుగా చేస్తున్న అసత్య ఆరోపణలనే ఆమె పదే పదే వల్లిస్తున్నారు.

వివేకా రెండో వివాహం, కుటుంబ వివాదాల సంగతేమిటి?



వివేకానందరెడ్డి రెండో వివాహాన్ని సునీత ఉద్దేశపూర్వకంగా మరుగున పరుస్తున్నారు. షమీమ్ అనే మహిళను వివేకా రెండో వివాహం చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు ఉన్నారని, దాంతోనే కుటుంబంలో ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలు తలెత్తాయనే వాస్తవాన్ని కప్పిపుచ్చుతున్నారు. ఎందుకంటే వివేకా హత్య వెనుక కుటుంబంలో విభేదాలు కీలక పాత్ర పోషించాయి. ఆయన మరణిస్తే ఎవరికి ప్రయోజనం, ఆయనతో వ్యక్తిగతంగా, ఆస్తిపరంగా, రాజకీయంగా ఎవరికి విభేదాలు ఉన్నాయన్నది ఈ కేసు దర్యాప్తులో అత్యంత కీలకం. రెండో భార్య షమీమ్‌కు పుట్టిన కుమారునికి ఆస్తిలో భాగం ఇవ్వాలని వివేకా భావించారు. రాజకీయ వారసునిగా చేస్తానని కూడా ప్రకటించారు. దాంతో ఆ కుటుంబంలో ఆస్తి, రాజకీయ వారసత్వ వివాదాలు తీవ్రస్థాయిలో తలెత్తాయి. వివేకా మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆయనతో తీవ్రంగా గొడవపడి, ఆయన్ని విడిచిపెట్టి హైదరాబాద్‌లో ఉంటున్నారు. కుటుంబానికి చెందిన కంపెనీల్లో వివేకాకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేశారు. సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డి షమీమ్ ఇంటికి వెళ్లి ఘర్షణ పడ్డారు. వివేకానందరెడ్డి అప్పటికే ఆమెకు ఇచ్చిన ఓ ఇంటి పత్రాలను బలవంతంగా తీసుకున్నారు. షమీమ్, సునీత దూషించుకుంటూ చేసుకున్న వాట్సాప్ చాటింగ్‌ను కూడా అప్పట్లోనే సిట్ బృందం వెలికితీసింది. షమీమ్‌కు ఓ ఇల్లు ఇవ్వాలని, ఆమె కుమారుడిని హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివించాలని అనుకుంటున్నప్పటికీ అవడంలేదని వివేకా సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు కూడా. షమీమ్ కూడా సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో ఇవన్నీ వెల్లడించారు. ఈ నేపథ్యంలో వివేకానందరెడ్డి జీవించి లేకపోతే ఆయన కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిదికే ఎక్కువ ప్రయోజనమన్నది స్పష్టమవుతోంది. వివేకాను హత్య చేసిన తరువాత ఆయన నివాసంలో కొన్ని ఆస్తి పత్రాలు, రౌండ్ సీల్ కోసం హంతకులు వెదికారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అంటే వివేకా తన రెండో భార్యకు రాసిచ్చిన ఆస్తి పత్రాలను ఆ ఇంటి నుంచి తీసుకువెళ్లారన్నది సుస్పష్టం. వివేకా లేకపోతే ఆస్తి మొత్తం దక్కడంతోపాటు రాజకీయ వారసత్వం కూడా తమకే వస్తుందన్న ఉద్దేశం ఆయన బావమరిది, అల్లుడికి ఉందన్నది స్పష్టమైంది.

లేఖను దాచిందీ మీరే.. గుండెపోటు ప్రచారం చేసిందీ మీరే

ఇన్ని విషయాలు రెండేళ్లుగా మాట్లాడుతున్న సునీత.. వైఎస్ వివేకా గుండె పోటుతో మరణించారనే ప్రచారం ఎలా వచ్చిందో మాత్రం చెప్పరు. ఎందుకంటే ఆయన గుండెపోటుతో చనిపోయారన్న ప్రచారం వెనుక సునీత, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డే ఉన్నారు. వివేకా రాసిన లేఖను కూడా దాచిపెట్టి ఆ ప్రచారాన్ని వ్యాప్తిలోకి తెచ్చారు. శివప్రకాశ్ రెడ్డే మొదటగా ఆదినారాయణరెడ్డికి ఫోన్ చేసి వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారని చెప్పారు. అదే విషయాన్ని ఆదినారాయణ రెడ్డి మీడియాకు వెల్లడించారు. దాంతో వివేకా గుండెపోటుతో మరణించారనే అసత్య సమాచారం బయటకు వచ్చింది. టీవీ చానళ్లలో ప్రసారమైంది. ఆ ప్రచారాన్ని కొనసాగించేందుకు వివేకా రాసిన లేఖను కుమార్తె, అల్లుడు రహస్యంగా ఉంచారు. ఆ లేఖను మొదటగా ఆరోజు ఉదయం 6.10 గంటలలోపే చూసిన ఆయన పీఏ కృష్ణారెడ్డి ఆ విషయాన్ని సునీత భర్త రాజశేఖరరెడ్డికి చెప్పారు. తాము వచ్చే వరకు ఆ లేఖ, వివేకా సెల్‌ఫోన్‌ను ఎవరికి ఇవ్వకుండా దాచి ఉంచాలని రాజశేఖరరెడ్డి ఆయనతో చెప్పారు. ఆ లేఖను వెంటనే పోలీసులకు అప్పగించమని వారు చెప్పి ఉంటే వివేకాని హత్య చేశారన్న విషయం వెంటనే అందరికీ తెలిసిపోయేది. కానీ లేఖను ఉద్దేశపూర్వకంగానే గోప్యంగా ఉంచారు. ఆరోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో పులివెందుల చేరుకున్న సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డికి ఆ లేఖను, సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి ఇచ్చారు. వారు ఆ లేఖను చదివిన వెంటనే అయినా దాన్ని పోలీసులకు ఇచ్చారా అంటే అదీ లేదు. సునీత ఆదేశాలతో సాయంత్రం 5 గంటలకు కృష్ణారెడ్డి ఆ లేఖ, సెల్‌ఫోన్‌ను పోలీసులకు ఇచ్చారు.

బీజేపీకి ఏపీ దాసోహం

- సీఎం జగన్, చంద్రబాబు ఇద్దరూ బీజేపీ బానిసలే
- వివేకా నిందితులను ఎందుకు కాపాడుతున్నారో జగన్ చెప్పాలి
- కడప ఎన్నికల ప్రచారంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



సాక్షి ప్రతినిధి, కడప/కడప వైఎస్సార్ సర్కిల్: ఆంధ్రప్రదేశ్‌ను బీజేపీకి దాసోహం చేశారని.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇద్దరూ బీజేపీకి బానిసలయ్యారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలో రెండో రోజైన శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా అమీన్‌పీర్ దర్గా, తర్వాత దేవునికడపలో ప్రార్థనలు చేశారు. పెద్దదర్గా, ఐటీఐ సర్కిల్స్‌లో ఆమె మాట్లాడుతూ.. బీజేపీ ఎంత అన్యాయం చేసినా, పోలవరం ప్రాజెక్టు నిర్మించకపోయినా, రాజధాని నిర్మాణానికి పైసా నిధులు ఇవ్వకపోయినా జగన్, చంద్రబాబు నోరు మెదపరని మండిపడ్డారు. చంద్రబాబు బహిరంగంగా బీజేపీతో పొత్తు పెట్టుకుంటే, జగన్ రహస్యంగా పొత్తుపెట్టుకున్నారన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏపీకి పదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని రాహుల్‌గాంధీ చెప్పడంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరానని షర్మిల చెప్పారు. సీబీఐ నిందితుడిగా చేర్చిన అవినాష్‌రెడ్డికే జగనన్న మళ్లీ ఎంపీ టికెట్ ఇచ్చారని.. అందుకే తాను పోటీచేస్తున్నట్లు ఆమె చెప్పారు. అసలు అవినాష్‌ను నిందితుడిగా సీబీఐ ముద్రవేస్తే, ఆయనకు టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. వైఎస్ వివేకా హత్యకేసు నిందితులను ఎందుకు కాపాడుతున్నారో జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ఇక దివంగత వైఎస్సార్ బతికి ఉంటే కడప స్టీల్ ప్లాంట్ ఎప్పుడో పూర్తయ్యేదని షర్మిల తెలిపారు. ఇక చాలాచోట్ల ప్రజలు లేకపోవడంతో ఆమె ప్రచార రథానికి పరిమితమయ్యారు. ఆ తర్వాత పార్టీ ఆఫీసుకు చేరుకుని సాయంత్రం వరకూ అక్కడే ఉండిపోయారు. ఇదిలా ఉంటే.. చిత్తూరు జిల్లా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కాంగ్రెస్‌లో చేరారు. కడపలో శనివారం ఆయనకు షర్మిల కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎంపీ ఎన్నికల్లో సానుభూతి కోసమే

వివేకానందరెడ్డి హత్య

- వివేకా కుమార్తె సునీత ఆరోపణ
- పగ తీర్చుకోవడమే అయితే నేనే హంతకులను నరికేసే దాన్ని

సాక్షి, హైదరాబాద్: 2019 ఎంపీ ఎన్నికల్లో సానుభూతి కోసమే తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేశారని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత ఆరోపించారు. ఈ హత్య కేసులో సీబీఐ దర్యాప్తు, న్యాయస్థానాల్లో విచారణపై నమ్మకముందని, అయితే న్యాయం ఆలస్యమవుతున్నందునే ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తున్నానని అన్నారు. ఆమె శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ... వివేకానందరెడ్డికి మంత్రి పదవి ఇవ్వడం వల్లనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ విజయమ్మ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ప్రత్యేక పార్టీ పెట్టారన్నారు. 2017లో ఎమ్మెల్సీగా వివేకా పోటీ చేసినప్పుడు అవినాశ్‌రెడ్డి కుటుంబం చేసిన వెన్నుపోటు రాజకీయాలతో ఓడిపోయారని ఆరోపించారు. వివేకా హత్య జరిగాక కూడా కడప నుంచి అవినాశ్‌రెడ్డి ఎంపీగా గెలిచారు కదా అన్న ప్రశ్నకు.. దానికి తానే బాధ్యత తీసుకుంటానని, తన బుద్ధిలేనితనంతో కుటుంబ సభ్యులని విశ్వసించానని జవాబిచ్చారు. ప్రతీకారం తీర్చుకోవాలనుకొంటే కడప వాళ్లలాగా తాను కూడా తన తండ్రి హంతకులను నరికేసే దాన్నని వ్యాఖ్యానించారు. తన వెనకాల టీడీపీ ఉందని అందరూ భావిస్తున్నారని, తన వెనుక ఏ పార్టీ లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఏపీలో పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతున్న ఈ సమయంలో 2019లో జరిగిన హత్య గురించి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడటం రాజకీయ లబ్ధి కోసం కాదా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఐదేళ్లు గడిచినా పరిష్కారం లభించకపోవడంతో హత్యకు పాల్పడిన వారికి శిక్షపడాలనే ఉద్దేశంతోనే దానిని ప్రస్తావిస్తున్నానని సమాధానమిచ్చారు.

మనిషై పుట్టాక విచక్షణ ఉండాలి

- షర్మిల వ్యాఖ్యలకు ఎంపీ అవినాష్ కౌంటర్
- విజ్ఞత కలిగిన వారెవరూ అలా మాట్లాడరు
- బురద తుడుచుకుంటూ పోతే తిడుతూనే ఉంటారు
- ఎన్ని మాటలు అంటారో అననివ్వండి.. వారి విజ్ఞతకే వదిలేస్తున్నా
- కూటమి నాటకంలో షర్మిల పావు : రీజినల్ కోఆర్డినేటర్ సురేష్‌బాబు



బద్వేలు అర్బన్ : మనిషి పుట్టుక పుట్టాక కొంచెమైన విచక్షణ, విజ్ఞత కలిగి ఉండాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వైఎస్సార్ జిల్లా బద్వేలులో శనివారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, వివేకానందరెడ్డి కుమార్తె సునీత తాజాగా చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ సందర్భంగా ఘాటుగా స్పందించారు. భావనారాయణనగర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొంతమంది తనపై చేసే వ్యాఖ్యలు ఎంతో భయంకరంగా ఉంటున్నాయని.. కానీ, వాటిని వారి విచక్షణకే వదిలేస్తున్నానని, విజ్ఞత కలిగిన వారెవరూ ఇలాంటి వ్యాఖ్యలు చేయరన్నారు. ముఖానికి మసిపూయడం, మీద బురదజల్లడం వంటివి చేసి ఇక తుడుచుకొంటున్నారని, అలా తుడుచుకుంటూ పోతుంటే తిడుతూనే ఉంటారని.. దీని గురించి పెద్దగా చర్చించాల్సిన అవసరం లేదన్నారు. ఎన్ని మాటలు అంటారో అననివ్వండి, ఎంత ప్రచారం చేస్తారో చేయనివ్వండి.. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా అని ఎంపీ అవినాష్ వ్యాఖ్యానించారు.

ప్యాకేజీ తీసుకుని షర్మిల విమర్శలు..

అనంతరం, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కె. సురేష్‌బాబు మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కపట నాటకంలో షర్మిల పావుగా మారడంతో పాటు ప్యాకేజీ తీసుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కొన్ని లక్షల మంది అక్కాచెల్లెమ్మల కుటుంబాలు సంతోషంగా ఉండాలనే ఉద్దేశ్యంతో దేశంలో ఏ సీఎం చేయని విధంగా సంక్షేమ పథకాలను నేరుగా అక్కాచెల్లెమ్మలకు జగన్ అందిస్తున్నారన్నారు. వారు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందని విశ్వసించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత చెల్లెలి కుటుంబాన్ని ఆదుకోలేని వ్యక్తి కాదని, ఆమె కంట కన్నీరు తెప్పించే వ్యక్తి కాదన్నారు. కేవలం ప్యాకేజీకి అమ్ముడుపోయి షర్మిల మాట్లాడే మాటలు చూస్తుంటే అసహ్యమేస్తోందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నియోజకవర్గ అదనపు సమన్వయకర్త ఎస్. విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీఎస్, డీజీపీ పనికిమాలిన వెధవలు

- ఈ ఇద్దరు వెధవలను ఎన్నికల సంఘం మార్చలేదు
- టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు దుర్భాషలు
- ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి నర్సీపట్నంలో చీరల పంపిణీ
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చీరలు పంచితే నేరమా అంటూ ఎదురుప్రశ్న

నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ పనికిమాలిన వెధవలని టీడీపీ సీనియర్ నేత, నర్సీపట్నం అసెంబ్లీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ధ్వజమెత్తారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ శనివారం రాత్రి నర్సీపట్నంలో బహిరంగంగా చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉన్నతాధికారులపై చింతకాయల దుర్భాషలతో రెచ్చిపోయారు. రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను మార్చిన ఎన్నికల సంఘం ఇద్దరు వెధవలైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీని మార్చలేదని ఆరోపించారు. ఎవడో తప్పుడు సమాచారం ఇస్తే పోలీసులు, అధికారులు రావడం ఏంటన్నారు. తాము సమావేశం నిర్వహించి పది చీరలు ఇస్తే నేరమా అని ప్రశ్నించారు. సీఎం రమేష్ సమావేశంలో చీరలు, లంగాలు పంచితే తప్పా అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అయ్యన్న అధికారులపై నోరు పారేసుకోవడంతో టీడీపీ కార్యకర్తలు సైతం విస్తుపోయారు.

షర్మిల ఆత్మ పరిశీలన చేసుకోవాలి

- పీసీసీ అధ్యక్షురాలిగా వస్తే ప్రజాదరణ ఏ విధంగా ఉందో తెలుసుకో
- ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా




కడప కార్పొరేషన్: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆత్మ పరిశీలన చేసుకుని మాట్లాడాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా హితవు పలికారు. గతంలో జగనన్న చెల్లిగా ఈ జిల్లాకు వచ్చినప్పుడు ప్రజలు ఆమెకు బ్రహ్మరథం పట్టారని, ఇప్పుడు పీసీసీ అధ్యక్షురాలిగా వస్తే కనీస స్పందన కూడా లేదన్నారు. రాజన్న రాజ్యం స్థాపిస్తానని తెలంగాణలో పార్టీ పెట్టిన ఆమె అక్కడి ప్రజలను, నాయకులను నట్టేట ముంచి ఎన్నికల్లో పోటీచేయకుండా అస్త్ర సన్యాసం చేసిందన్నారు. ఇక్కడ తన క్యాంపు కార్యాలయంలో శనివారం అంజద్‌బాషా మీడియాతో మాట్లాడుతూ.. రెండ్రోజులుగా షర్మిల వైఎస్సార్ జిల్లాలో పర్యటిస్తున్నారని, ఈ సందర్భంగా ఆమె సీఎం వైఎస్ జగన్‌ని, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలపై వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారన్నారు.

జగన్‌పై అభాండాలు దారుణం..

దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్‌ను రెండు సార్లు ఒంటిచేత్తో అధికారంలోకి తీసుకొస్తే ఆయన పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చిన సంగతి షర్మిల మర్చిపోయారా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌పై సంబంధంలేని కేసులు పెట్టి 16 నెలలు జైల్లో పెట్టిన విషయాన్ని ఆమె మర్చిపోవచ్చేమోగానీ ప్రజలు మర్చిపోలేదన్నారు. షర్మిల పరిస్థితి చూస్తే తమకే బాధేస్తోందని, జనాలు లేక చాలాచోట్ల మాట్లాడకుండానే ఆమె వెళ్లిన పరిస్థితి ఉందన్నారు. మీ స్వార్థ రాజకీయాల కోసం బాబు మాయలో పడి వైఎస్ జగన్‌పై అభాండాలు దారుణమన్నారు. ఇష్టానుసారంగా సీఎం జగన్, అవినాష్‌రెడ్డిపై చేస్తున్న ఆరోపణలను ప్రజలు హర్షించలేదన్న సత్యాన్ని ఆమె గ్రహించాలన్నారు. కోర్టులో ఉన్న కేసుకు సంబంధించి అవినాష్‌రెడ్డిని హంతకుడని మాట్లాడటం అనైతికమని.. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని అంజద్‌బాషా చెప్పారు. టీడీపీ, బీజేపీ నేతలు బీటెక్ రవి, ఆదినారాయణరెడ్డిలతో వేదికను పంచుకుంటూ బాబు స్క్రిప్టును చదవడం దారుణమన్నారు. షర్మిల, సునీత గతంలో ఏం మాట్లాడారో, ఇప్పుడు ఎలా మాట్లాడుతున్నారో అందరికీ తెలుసన్నారు.

ఇక్బాల్ వ్యాఖ్యలు బాధాకరం

- బాబు స్క్రిప్టునే చదువుతున్నారు
- సీఎం జగన్ రెండు సార్లు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చినా ఇలా చేస్తారా?
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్



సాక్షి, అమరావతి: ఎమ్మెల్సీ ఇక్బాల్ వ్యాఖ్యలు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎంతో బాధ కలిగించాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇక్బాల్ చంద్రబాబు స్క్రిప్టునే చదువుతున్నారని మండిపడ్డారు. ఇక్బాల్ వైఎస్సార్‌సీపీలో పెద్దగా పని చేయకపోయినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆయన్ని ఎంతో గౌరవంగా చూసుకొన్నారని తెలిపారు. హిందూపురం సీటు ఇచ్చారని, అక్కడ ఓడిపోతే రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారని తెలిపారు. సీఎం జగన్ మైనార్టీల ద్రోహి కాదన్న విషయాన్ని ఇక్బాల్ గ్రహించాలని అన్నారు. ముస్లింల రిజర్వేషన్లు తీసేస్తామని, నల్ల చట్టాలు అమలు చేస్తామంటున్న బీజేపీతో పొత్తు పెట్టుకున్నది చంద్రబాబేనని చెప్పారు. నరేంద్ర మోదీతో పొత్తు పెట్టుకోనని చెప్పిన చంద్రబాబు ఈరోజు పొత్తు పెట్టుకొన్నారని తెలిపారు. ముస్లింల 4 శాతం రిజర్వేషన్‌ను కాపాడటానికి సీఎం జగన్ ప్రయత్నిస్తున్నారని, కపిల్ సిబాల్‌ను లాయర్‌గా పెట్టి మరీ రిజర్వేషన్లు కాపాడే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. ఎన్ఆర్‌సీపై బాబు స్పందించలేదని, సీఎం జగన్ మాత్రం రాష్ట్రంలో ఎన్ఆర్‌సీ అమలు చేయం అని చెప్పారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉండగా మైనార్టీలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి పదవులు ఒక్కటి కూడా ఇవ్వలేదన్న విషయాన్ని ఇక్బాల్ గ్రహించాలన్నారు. నంద్యాల ఉప ఎన్నికలు వచ్చేంత వరకు బాబుకు మైనార్టీలు గుర్తుకు రాలేదని చెప్పారు. మైనార్టీలకు నాలుగు ఎమ్మెల్యే, నాలుగు ఎమ్మెల్సీలతో పాటు అనేక పదవులిచ్చి, రాజ్యాధికారంలో పూర్తిగా వాటా ఇచ్చింది సీఎం జగన్ కాదా అని ప్రశ్నించారు. మైనార్టీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు అందిస్తున్నారన్నారు. ఇవన్నీ మరచి స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు స్క్రిప్ట్ చదివితే తాము కూడా చూస్తూ ఊరుకోబోమని ఇక్బాల్‌ను హెచ్చరించారు.

విజేత తరుణ్ మన్నేపల్లి

కజకిస్తాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన తరుణ్ మన్నేపల్లి విజేతగా నిలిచాడు. అస్తానాలో శనివారం జరిగిన ఫైనల్లో తరుణ్ 21-10, 21-19 స్కోరుతో ఎనిమిదో సీడ్, మలేసియాకు చెందిన సూంగ్ జూ విన్‌పై విజయం సాధించాడు. గత ఏడాది జాతీయ చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన తరుణ్‌కు ఇదే తొలి అంతర్జాతీయ టైటిల్ కావడం విశేషం. మహిళల సింగిల్స్‌లో భారత షట్లర్ అనుపమ ఉపాధ్యాయ టైటిల్ సాధించింది. ఫైనల్లో భారత్‌కే చెందిన ఇషారాణి బారువాపై 21-15, 21-16తో అనుపమ గెలుపొందింది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి కె.మనీషా రన్నరప్‌గా నిలిచింది. మనీషా - సంజయ్ శ్రీవత్స జోడి ఫైనల్లో 21-9, 7-21, 12-21తో వాంగ్ టిన్ సి - లిమ్ చూ సిన్ (మలేసియా) చేతిలో పరాజయంపాలైంది. టైటిల్ సాధించే క్రమంలో తరుణ్ సహచరుడు గగన్ బల్యాన్, 2022 వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్ రన్నరప్ శంకర్ ముత్తుసామి, దిమిత్రి పనరియన్ (కజకిస్తాన్), ఏడో సీడ్ లీ డ్యూక్ (వియత్నాం)లను ఓడించాడు.



రాజస్తాన్ 4/4

- 6 వికెట్లతో బెంగళూరుపై రాయల్స్ ఘనవిజయం
- బట్లర్ మెరుపు శతకం
- కోహ్లి సెంచరీ వృథా


కోహ్లి

జైపూర్: ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ అజేయంగా దూసుకెళ్తోంది. వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ ఆ జట్టు జయభేరి మోగించింది. శనివారం జరిగిన పోరులో రాజస్తాన్ 6 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఓడించింది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (72 బంతుల్లో 113 నాటౌట్; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఐపీఎల్‌లో 8వ శతకం సాధించగా, కెప్టెన్ డుప్లెసిస్ (33 బంతుల్లో 44; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం రాజస్తాన్ 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 189 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జోస్ బట్లర్ (58 బంతుల్లో 100 నాటౌట్; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు శతకం సాధించగా, కెప్టెన్ సంజూ సామ్సన్ (42 బంతుల్లో 69; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఫ్రాంచైజీకి చెందిన 'రాయల్ రాజస్తాన్ ఫౌండేషన్' చేపట్టిన 'పింక్ ప్రామిస్'లో భాగంగా మహిళా సాధికారత ప్రచార కార్యక్రమం కోసం రాజస్తాన్ జట్టు నిలువెల్లా గులాబీ రంగు జెర్సీతో బరిలోకి దిగింది.

కోహ్లి శతక్కొట్టాడు కానీ...

బెంగళూరుకు ఓపెనర్లు విరాట్ కోహ్లి, డుప్లెసిస్ శుభారంభం ఇచ్చారు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 53/0 స్కోరు చేసింది. ఓవర్లు గడుస్తున్న కొద్దీ బ్యాటర్లు పాతుకుపోయినా... పరుగుల వేగం మాత్రం అంతంతమాత్రంగానే సాగింది. కోహ్లి 39 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 12వ ఓవర్లో బెంగళూరు స్కోరు వందకు చేరింది. అప్పటికీ ఓపెనింగ్ జోడీనే అజేయంగా ఉంది. సింహభాగం ఓవర్లు (14) ఇద్దరే ఆడారు. కానీ బ్యాటింగ్‌కు బాగా అనుకూలించిన పిచ్‌పై ధాటిని ప్రదర్శించలేకపోయారు. 14వ ఓవర్లో డుప్లెసిస్ నిష్క్రమించడంతో 125 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. హిట్టర్ మ్యాక్స్‌వెల్ (1), సౌరవ్ చౌహాన్ (9) నిరాశపరిచారు. గ్రీన్ (5 నాటౌట్) వచ్చినా... కోహ్లి 67 బంతుల్లోనే సెంచరీతో అజేయంగా నిలిచినా... డెత్ ఓవర్లలో బెంగళూరు పెద్దగా మెరిపించలేదు. 19వ ఓవర్లో 4 పరుగులు, 20వ ఓవర్లో 14 పరుగులు రావడంతో 200 మార్క్‌కు ఆమడ దూరంలో నిలిచింది.

బట్లర్, సామ్సన్ ధనాధన్

జైస్వాల్ (0) ఇన్నింగ్స్ రెండో బంతికే డకౌట్ కావడంతో బెంగళూరు శిబిరం సంబరాల్లో మునిగింది. కానీ ఈ ఆనందం ఆవిరయ్యేందుకు ఎంతోసేపు పట్టలేదు. బట్లర్‌కు కెప్టెన్ సంజూ సామ్సన్ జతవడంతో చేజింగ్ చాలా సులువుగా సాగింది. మయాంక్ డాగర్ వేసిన 6వ ఓవర్‌ను పూర్తిగా ఆడిన బట్లర్ 4, 0, 4, 6, 4, 0లతో 20 పరుగులు పిండుకున్నాడు. పవర్‌ప్లేలో రాయల్స్ స్కోరు 54/1 తక్కువే అయినా అక్కడ్నుంచి ఇద్దరు దంచేసే పనిలో పడటంతో బౌండరీలు, సిక్సర్లు క్రమం తప్పకుండా వచ్చేశాయి. బట్లర్ 30 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా... కాసేపటికే సామ్సన్ ఫిఫ్టీ 33 బంతుల్లో పూర్తయింది. ఇద్దరి దూకుడు కొనసాగడంతో బంతులు, పరుగుల మధ్య అంతరం తగ్గిపోయింది. సామ్సన్‌ను ఎట్టకేలకు సిరాజ్ అవుట్ చేయగా... 148 పరుగుల రెండో వికెట్‌కు భాగస్వామ్యం ముగిసింది. తర్వాత పరాగ్ (4), జురెల్ (2) స్వల్ప వ్యవధిలోనే అవుటయ్యారు. కానీ అప్పటికే 18 బంతుల్లో 14 పరుగుల సమీకరణం రాజస్తాన్‌కు విజయాన్ని ఖాయం చేసింది. 6 బంతుల్లో పరుగు అవసరమైన చోట 94 పరుగుల వద్ద ఉన్న బట్లర్ సిక్సర్‌తో సెంచరీని, మ్యాచ్‌ను ఒకేసారి పూర్తి చేశాడు.


బట్లర్

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి నాటౌట్ 113; డుప్లెసిస్ (సి) బట్లర్ (బి) చహల్ 44; మ్యాక్స్‌వెల్ (బి) బర్గర్ 1; సౌరవ్ (సి) జైస్వాల్ (బి) చహల్ 9; గ్రీన్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 183. వికెట్ల పతనం:** 1-125, 2-128, 3-155. **బౌలింగ్:** బౌల్ట్ 3-0-30-0, బర్గర్ 4-0-33-1, అశ్విన్ 4-0-28-0, అవేశ్‌ఖాన్ 4-0-46-0, చహల్ 4-0-34-2, పరాగ్ 1-0-10-0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) టాప్లీ 0; బట్లర్ నాటౌట్ 100; సామ్సన్ (సి) యశ్ (బి) సిరాజ్ 69; పరాగ్ (సి) కోహ్లి (బి) యశ్ 4; జురెల్ (సి) కార్తీక్ (బి) టాప్లీ 2; హెట్‌మైర్ నాటౌట్ 11; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (19.1 ఓవర్లలో 4 వికెట్లకు) 189. వికెట్ల పతనం:** 1-0, 2-148, 3-155, 4-164. **బౌలింగ్:** టాప్లీ 4-0-27-2, యశ్ దయాళ్ 4-0-37-1, సిరాజ్ 4-0-35-1, మయాంక్ 2-0-34-0, గ్రీన్ 3.1-0-27-0, హిమాన్షు 2-0-29-0.

ఐపీఎల్‌లో నేడు

ముంబై × ఢిల్లీ
వేదిక: ముంబై
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

లక్నో × గుజరాత్
వేదిక: లక్నో
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	4	4	0	8	1.120
కోల్‌కతా	3	3	0	6	2.518
చెన్నై	4	2	2	4	0.517
లక్నో	3	2	1	4	0.483
హైదరాబాద్	4	2	2	4	0.409
పంజాబ్	4	2	2	4	-0.220
గుజరాత్	4	2	2	4	-0.580
బెంగళూరు	5	1	4	2	-0.843
ఢిల్లీ	4	1	3	2	-1.347
ముంబై	3	0	3	0	-1.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

భారత్‌కు భారీ ఓటమి

5-1తో ఆస్ట్రేలియా ఘన విజయం



పెర్త్: ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల హాకీ సిరీస్‌ను భారత జట్టు పరాజయంతో మొదలు పెట్టింది. శనివారం జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా 5-1 గోల్స్ తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. ఆరంభంనుంచి చివరి వరకు తమ పట్టు నిలబెట్టుకున్న కంగారూలు ప్రత్యర్థికి ఎలాంటి అవకాశమూ ఇవ్వలేదు. ఆసీస్ సాధించిన ఐదు గోల్స్‌లో నాలుగు ఫీల్డ్ గోల్స్ కావడం విశేషం. ఆస్ట్రేలియా తరఫున బ్రాడ్ టిమ్ (3వ నిమిషం), వికామ్ టామ్ (20వ ని., 38వ ని.), రింటాలా జోయెల్ (37వ ని.), ఒగిల్వి ఫ్లయిన్ (57వ ని.) గోల్స్ కొట్టారు. భారత్ తరఫున ఏకైక గోల్‌ను గుర్జంత్ సింగ్ (47వ ని.) నమోదు చేశాడు. మ్యాచ్ మొదలైన కొద్ది సేపటికే లాంగ్ పాస్ అందుకున్న బ్రాడ్... భారత ఆటగాడు జర్మన్‌ప్రీత్‌ను దాటి గోల్ పోస్టును ఛేదించడంలో సఫలమయ్యాడు. 10వ నిమిషంలో భారత్‌కు పెనాల్టీ దక్కినా అది గోల్‌గా మారలేదు. ఆ తర్వాత ఆసీస్ భారత డిఫెన్స్‌పై ఒత్తిడి పెంచింది. తొలి అర్ధభాగం ముగిసే సరికి జట్టు 2-0తో ఆధిక్యంలో నిలిచిన ఆసీస్ మూడో క్వార్టర్‌లోనూ దూకుడు సాగించింది. అయితే చివరి క్వార్టర్‌లో కోలుకున్న భారత్ ప్రతిఘటించింది. రెండు నిమిషాలకే రాహిల్ ఇచ్చిన పాస్‌ను అందుకున్న గుర్జంత్ దానిని గోల్‌గా మలిచాడు. కొద్ది సేపటికే పెనాల్టీ వచ్చినా భారత్ దానిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు నేడు జరుగుతుంది.


విదిత్ గుజరాతీ సంచలన విజయం

- హంపికి 'డ్రా'
- క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్



టొరంటో: ప్రతిష్టాత్మక 'ఫిడే' క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో రెండో రౌండ్‌లో నాలుగు గేమ్‌లలో కూడా ఫలితం వచ్చింది. భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతీ...అమెరికాకు చెందిన వరల్డ్ నంబర్ 3 హికారు నకమురాపై 29 ఎత్తుల్లో సంచలన విజయం సాధించడం విశేషం. వరుసగా 47 గేమ్‌లలో ఓటమి లేకుండా కొనసాగిన నకమురా విజయయాత్రకు విదిత్ బ్రేక్ వేశాడు. భారత ఆటగాళ్ల మధ్య జరిగిన పోరులో డి.గుకేశ్ 33 ఎత్తుల్లో ప్రజ్ఞానందను ఓడించాడు. ఇతర రెండో రౌండ్ గేమ్‌లలో ఇయాన్ నెపోమ్నియాచి (రష్యా) 45 ఎత్తుల్లో అలీ రెజా ఫిరోజా (ఫ్రాన్స్)పై విజయం సాధించగా...మరో గేమ్‌లో ఫాబియానో కరువానా (అమెరికా) 37 ఎత్తుల్లో నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)పై గెలుపొందాడు. మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కోనేరు హంపి తన రెండో రౌండ్ గేమ్‌ను 'డ్రా'గా ముగించింది. కటారినా లాగ్నో (ఉక్రెయిన్)తో ఈ గేమ్ 38 ఎత్తుల తర్వాత ముగిసింది. మరో గేమ్‌లో మ్యాచ్‌లలో చైనాకు చెందిన టాన్ జోంగి చేతిలో భారత ప్లేయర్ వైశాలి ఓటమిపాలైంది.

వెర్‌స్టాపెన్‌కు పోల్




సుజుకా: ఫార్ములా వన్ సీజన్ జపాన్ గ్రాండ్‌ప్రి ప్రధాన రేసును రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ కొత్త ఉత్సాహంతో మొదలు పెట్టనున్నాడు. మెల్‌బోర్న్‌లో జరిగిన గత రేసులో కారు బ్రేకులు వైఫల్యంతో రేసు మధ్యనుంచి తప్పుకున్న వెర్‌స్టాపెన్... శనివారం జరిగిన జపాన్ గ్రాండ్ ప్రి క్వాలిఫయింగ్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. క్వాలిఫయింగ్ రేసును వెర్‌స్టాపెన్ 1 నిమిషం 28.197 సెకన్లలో పూర్తి చేశాడు. రెడ్‌బుల్‌కే చెందిన సెర్గియో పెరెజ్ (1 నిమిషం 28. 263 సెకన్లు)కు రెండో స్థానం దక్కగా...ల్యాండో నోరిస్ (మెక్లారెన్ - 1 నిమిషం 28.489 సె.) మూడో స్థానంలో నిలిచాడు.

సినిమా

సేనాపతి రాక అప్పుడే...!

జూన్‌లో థియేటర్స్‌కు రానున్నాడు భారతీయుడు. హీరో కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు'). ఈ సినిమాలో సేనాపతి పాత్రలో కనిపిస్తారు కమల్‌హాసన్. 1996లో విడుదలైన ఈ సినిమాకు పాతికేళ్ల తర్వాత 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' సీక్వెల్స్‌ను రూపొందించారు హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్. ఈ రెండు చిత్రాల చిత్రీకరణ పూర్తయింది. 'ఇండియన్ 2' సినిమాను జూన్‌లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ శనివారం అధికారికంగా ప్రకటించారు. ''సేనాపతి మళ్లీ వస్తున్నాడు. జూన్‌లో 'ఇండియన్ 2' సినిమా థియేటర్స్‌లో విడుదల కాబోతోంది'' అని 'ఎక్స్'లో ఈ సినిమా కొత్త పోస్టర్‌ను షేర్ చేశారు కమల్‌హాసన్. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా, సిద్ధార్థ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. సుభాస్కరన్, ఉదయనిధి స్టాలిన్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 14న విడుదలయ్యే అవకాశం ఉందని కోలీవుడ్ సమాచారం. ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ స్వరకర్త.


• కమల్‌హాసన్

అర్జున్‌కి కనెక్ట్ అయ్యా!

''**ఓ**పెన్ చేస్తే వైజాగ్‌లో అందమైన ఇల్లు...'' అంటూ నాగచైతన్య ఇచ్చిన వాయిస్ ఓవర్‌తో మొదలైంది 'డియర్' చిత్రం ట్రైలర్. జీవీ ప్రకాశ్ కుమార్, ఐశ్వర్యా రాజేశ్ నటించిన చిత్రం 'డియర్'. తమిళంలో ఈ నెల 11న, తెలుగులో 12న ఈ చిత్రం విడుదల కానుంది. వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి. పృథ్వీరాజ్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఆంధ్రాలో అన్నపూర్ణ స్టూడియోస్, తెలంగాణలో ఏషియన్ సినిమాస్ తెలుగులో విడుదల చేస్తున్నాయి. భార్య (ఐశ్వర్యా రాజేశ్) గురక కారణంగా భర్త (జీవీ ప్రకాశ్) సతమతమవుతుంటాడు. ఆ గురక కారణంగా వారి అనుబంధంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయనేది 'డియర్' కథాంశం. ''ఈ ప్రపంచంలో నాకు బాగా నచ్చేది ఏంటో తెలుసా? రాత్రిపూట మంచి నిద్ర. ఈ కథను ('డియర్'కి ఇచ్చిన వాయిస్ ఓవర్‌ని ఉద్దేశించి) నెరేట్ చేయడాన్ని ఎంజాయ్ చేశాను. అర్జున్ (జీవీ ప్రకాశ్ పాత్ర) భయానికి నేను కనెక్ట్ అయ్యాను. మీరూ కనెక్ట్ అవుతారనుకుంటున్నాను'' అంటూ 'ఎక్స్'లో 'డియర్' ట్రైలర్‌ని షేర్ చేశారు నాగచైతన్య. ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది.


• నాగచైతన్య

మమ్మీ తిరిగొస్తోంది


• 'ది మమ్మీ' పోస్టర్

హాలీవుడ్ హారర్ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'ది మమ్మీ' రీ రిలీజ్‌కు సన్నాహాలు మొదలయ్యాయి. స్టీఫెన్ సోమర్స్ దర్శకత్వంలో 1999లో విడుదలైన 'ది మమ్మీ' చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. ఈ యాక్షన్ అడ్వెంచరస్ హారర్ ఫిల్మ్‌లో బ్రెండెన్ ఫ్రేజర్, రాచెల్ వీజ్, జాన్ హాన్నా, ఆర్నాల్డ్ వోస్లూ, జోనాథన్ హైడ్ లీడ్ రోల్స్‌లో నటించారు. జేమ్స్ జాక్స్, సీన్ డేనియల్ నిర్మించిన 'ది మమ్మీ' సినిమాను 1999 మే 7న యూనివర్సల్ పిక్చర్స్ పంపిణీ చేసింది. ఈ సినిమా విడుదలై పాతిక సంవత్సరాలు సమీపిస్తున్న సందర్భంగా ఏప్రిల్ 26న థియేటర్స్‌లో రీ రిలీజ్ చేస్తున్నట్లుగా యూనివర్సల్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది.

ఆర్‌జీవీ యువర్ ఫిల్మ్


• రామ్‌గోపాల్ వర్మ

దర్శక-నిర్మాత రామ్‌గోపాల్ వర్మ (ఆర్‌జీవీ) 'యువర్ ఫిల్మ్' అంటూ ఓ కాన్సెప్ట్‌ను క్రియేట్ చేశారు. ప్రేక్షకులే ఓ సినిమా నటీనటులు, సాంకేతిక నిపుణులను ఫైనలైజ్ చేసే విధానానికి శ్రీకారం చుడుతూ ఆర్‌జీవీడెన్.కామ్ అనే వెబ్‌సైట్‌ను మొదలుపెట్టారు ఆర్‌జీవీ. ఈ వెబ్‌సైట్‌లో నటీనటులు, సాంకేతిక నిపుణులు, క్లుప్తంగా సినిమా కథాంశం వంటి వివరాలను ఉంచుతారు. ఆడిషన్స్ ఇచ్చే వారి వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. ఈ ఆడిషన్స్‌లో ప్రేక్షకులు ఎవరికి ఎక్కువ ఓట్లు వేస్తే, వారు ఆ ప్రాజెక్ట్‌కి ఫైనలైజ్ అవుతారు. అలా ఫైనల్ అయినవారితో ఆరు నెలల్లో సినిమా నిర్మిస్తారట రామ్‌గోపాల్ వర్మ. ఆర్‌జీవీ డెన్ ద్వారా భాషతో సంబంధం లేకుండా ఈ ఎంపిక జరుగుతుందని రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు.

గాయనిగా...

'హైవే', 'హంప్టీ శర్మకీ దుల్హనియా' సినిమాల్లో హీరోయిన్‌గా నటించడంతో పాటు గాయకురాలిగా పాటలు పాడారు ఆలియా భట్. ఇలా గాయకురాలిగా కాస్త అనుభవం ఉన్నా కూడా స్వరాలాపనలో మరింత పట్టు సాధించేందుకు ఆలియా భట్ ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నారని బాలీవుడ్ సమాచారం. ఎందుకంటే తన తాజా చిత్రం 'లవ్ అండ్ వార్'లో ఆలియా భట్ పూర్తి స్థాయి గాయకురాలి పాత్రలో కనిపిస్తారట. పాత్ర దృష్ట్యా కథలో చాలా పాటలు పాడతారట ఆలియా భట్. ఈ చిత్రం కోసమే ఆమె స్పెషల్ ట్రైనింగ్ తీసుకోనున్నారు. రణ్‌బీర్ కపూర్, విక్కీ కౌశల్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించనున్న ఈ సినిమాకు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ ఆరంభం కానుంది. ఈ సినిమా వచ్చే ఏడాది క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. పెళ్లి తర్వాత రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ స్క్రీన్ షేర్ చేసుకోనున్న ఈ సినిమాపై అంచనాలు ఉన్నాయి.


• ఆలియా భట్


వేడుక వేళ.. ఆనంద హేల

హీరోయిన్ అమలా పాల్ తల్లి కాబోతున్నారు. తాజాగా తన సీమంతం వేడుక ఫొటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. భర్త జగత్ దేశాయ్‌తో కలిసి అమలా పాల్ గుజరాత్‌లోని సూరత్‌లో ఈ వేడుక జరుపుకున్నారు. 'ట్రెడిషన్ అండ్ లవ్' అనే క్యాప్షన్‌తో అమలా పాల్ షేర్ చేసిన ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఈ వేడుక వేళ అమల, జగత్‌ల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇక కొన్ని సంవత్సరాలు రిలేషన్‌షిప్ కొనసాగించి 2023లో అమలా పాల్, జగత్ దేశాయ్ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే.


• అమలా పాల్, జగత్ దేశాయ్

రాజాసాబ్‌లో ఆత్మ...?

రాజా సాబ్‌తో ఆత్మరూపంలో మాట్లాడుతున్నారట సంజయ్ దత్. ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రాజా సాబ్'. ఈ హారర్ థ్రిల్లర్ మూవీకి మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా, ఓ కీలక పాత్రలో సంజయ్ దత్ కనిపిస్తారనే టాక్ ఎప్పట్నుంచో వినిపిస్తోన్న సంగతి తెలిసిందే. 'రాజాసాబ్' తాత-మనవడి నేపథ్యంలో సాగే కథ అని, ప్రభాస్‌కు తాతగా సంజయ్ దత్ కనిపిస్తారని టాక్. అంతేకాదు.. ఈ సినిమాలో ఆత్మ రూపంలో ప్రభాస్‌తో సంజయ్ దత్ మాట్లాడిన తర్వాతే కథ కీలక మలుపు తిరుగుతుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. మరి.. సంజయ్ దత్ ఆత్మగా ప్రభాస్‌తో ఏం చెప్పారు? అనేది తెలియాలంటే 'రాజా సాబ్' చిత్రం రిలీజయ్యే వరకు ఎదురు చూడాల్సిందే. ఈ సినిమా వచ్చే ఏడాది ప్రారంభంలో రిలీజ్ అయ్యే అవకాశం ఉంది.


• సంజయ్ దత్

టిల్లులో రాధికలా...

'**బి**గ్ బాస్' ఫేమ్ అశ్విని శ్రీ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'మిస్ జానకి' ప్రారంభోత్సవం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి నిర్మాత సి. కల్యాణ్ క్లాప్ ఇచ్చారు. సతీష్‌కుమార్ దర్శకత్వంలో నాగరాజు నెక్కంటి నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 20న ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా అశ్వినీ మాట్లాడుతూ- ''మిస్ జానకి' కథ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. 'డీజే టిల్లు' సినిమాలోని రాధిక పాత్రలా, ఈ సినిమాలో నేను చేసే జానకి పాత్ర కూడా గుర్తుండిపోతుందనుకుంటున్నాను'' అన్నారు. ''ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు దర్శక-నిర్మాతలు.


• అశ్విని శ్రీ

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ప్రత్యేక ప్యాకేజీ బిర్యానీలాంటిది

- జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి

కడప రూరల్: 'రాష్ట్రానికి ప్రత్యేక హోదా కంటే ప్రత్యేక ప్యాకేజీతోనే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. ప్రత్యేక ప్యాకేజీ బిర్యానీలాంటిది. దానిలో ఎన్నో మసాలాలు ఉండి మంచి రుచిగా ఉంటుంది' అని బీజేపీ జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి అభివర్ణించారు. కడపలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కంటే ప్రత్యేక ప్యాకేజీతోనే ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. సమావేశంలో టీడీపీ, బీజేపీ, జనసేన జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, వి.శశిభూషణ్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్, కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా అభివృద్ధి జరగలేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ప్రజల ఆకాంక్షలకు తగిన రీతిలో అభివృద్ధి జరగలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం బీజేపీ ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తనను రాజమహేంద్రవరం ఎంపీగా గెలిపిస్తే ప్రజల ఆకాంక్ష మేరకు సేవలందిస్తానని చెప్పారు. ఏపీ బీజేపీ రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జ్ సిద్ధార్థనాథ్ సింగ్‌తో కలసి రాజమహేంద్రవరంలో జాతీయ రహదారిపై జిల్లా ఎన్నికల కార్యాలయాన్ని శనివారం ప్రారంభించి, పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. విలేకరులతో పురందేశ్వరి మాట్లాడుతూ..వైఎస్సార్ సీపీ నాయకులు ఇళ్ల స్థలాల కొనుగోలు పేరుతో వందల కోట్ల రూపాయలు దోచేశారని ఆరోపించారు. విపక్ష కూటమి తరపున ఎంపీ స్థానంతో పాటు దీని పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటామని చెప్పారు. అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. కేంద్రం 23 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం 3 లక్షల ఇళ్లు మాత్రమే నిర్మించిందని అన్నారు.

రాష్ట్రంలో పెరిగిన ఓటర్లు



ఓటేయడానికి ముందుకు వస్తున్న యువత

- మార్చిలో షెడ్యూల్ తర్వాత కొత్తగా 1.26 లక్షల ఓటర్లు చేరిక
- 2.09 కోట్లకు పెరిగిన మహిళా ఓటర్లు
- 2.01 కోట్లకు చేరిన పురుష ఓటర్లు
- జనవరిలో తుది జాబితా ప్రకటన తర్వాత 2.56 లక్షలు పెరుగుదల
- స్వీప్ ప్రచార కార్యక్రమంతో భారీగా చేరుతున్న కొత్త ఓటర్లు

సాక్షి, అమరావతి: ఎప్పుడూ లేని విధంగా ఈసారి సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంపై యువత ఆసక్తిని చూపిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత కూడా ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటమే దీనికి నిదర్శనం. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి ఈ నెల రెండో తేదీ నాటికి రాష్ట్రంలో కొత్తగా 1,26,549 మంది ఓటర్లు నమోదు అయినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ప్రకటించింది. షెడ్యూల్ ప్రకటించిన రోజుకి రాష్ట్రంలో మహిళా ఓటర్ల సంఖ్య 2,08,49,730 గా ఉంటే ఏప్రిల్ 2కి 2,09,16,389కు పెరిగినట్లు తెలిపింది. పురుష ఓటర్ల సంఖ్య 2,00,84,276 నుంచి 2,01,44,166కు పెరిగినట్లు పేర్కొంది. నామినేషన్లు దాఖలు చివరి రోజు వరకు కొత్త ఓటర్లను చేర్చుకొనే అవకాశం ఉండటంతో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. జనవరి 22న విడుదల చేసిన తుది ఓటర్ల సవరణ జాబితాతో పోలిస్తే ఈ రెండున్నర నెలల్లో 2,56,781 మంది ఓటర్లు పెరిగారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు, కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వీప్ కార్యక్రమం సత్ఫలితాలను అందిస్తోందని, దీంతో ఈసారి పెద్ద ఎత్తున యువ ఓటర్లు నమోదవుతున్నారని అధికారులు తెలిపారు. ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే వారి సంఖ్య రికార్డు స్థాయిలో 10 లక్షలు దాటుతోందంటున్నారు.

2019 తర్వాత పెరిగిన ఓటర్లు 41.31 లక్షలు

2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పురుష, మహిళా ఓటర్ల సంఖ్య 3,69,29,330 (సర్వీస్, థర్డ్ జెండర్ ఓట్లు కాకుండా)గా ఉంటే అది ఇప్పుడు 4,10,60,555కు పెరిగింది. అంటే 41,31,225 మంది కొత్తగా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 2019లో పురుష ఓటర్లు 1,83,24,588 మంది ఉండగా ఇప్పుడు 2,01,44,166కు, మహిళా ఓటర్లు 1,86,04742 నుంచి 2,09,16,389కు పెరిగారు. సర్వీసు, ఎన్నారై, థర్డ్ జెండర్ ఓటర్లను కూడా పరిగణనలోకి తీసుకుంటే 4.12 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు పెరుగుతున్న ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ స్టేషన్ల సంఖ్యను పెంచడానికి కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపారు.

ఎన్నికల కమిషన్‌ను శాసిస్తారా!

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి లేఖ రాయడం గర్హనీయం
- ఇది ఎన్నికల కమిషన్ స్వతంత్రతను దెబ్బ తీయడమే
- ఆ లేఖలో దురుద్దేశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి
- సీపీఎం కార్యదర్శి శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్‌ను శాసించేలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి లేఖ రాయడం గర్హనీయమని, ఇది ముమ్మాటికీ ఎన్నికల కమిషన్ స్వతంత్రతను దెబ్బతీయడమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తప్పుబట్టారు. పురందేశ్వరి లేఖ రాసిన తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆయన శనివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కీలక స్థానాల్లో ఉన్న 22 మంది ఐపీఎస్‌లను బదిలీ చేసి, వారి స్థానంలో ఎవర్ని నియమించాలో కూడా పేర్లను సూచిస్తూ ఎన్నికల కమిషన్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి లేఖ రాయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విధంగా రాజ్యాంగ వ్యవస్థలను బ్లాక్‌మెయిల్ చేయడాన్ని పౌర సమాజం ప్రశ్నించాలన్నారు. కొంతమంది అధికారులకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేస్తూ వారి స్థానంలో ఎవరెవరిని నియమించాలో కూడా సూచిస్తూ లేఖ రాయటం అనుచితమన్నారు. ఒక రకంగా అనధికారిక సిఫారసు చేయడమేంటని అన్నారు. పురందేశ్వరి రాసిన లేఖలో ఎన్నికలు సజావుగా జరగాలన్న ఆలోచన కన్నా దురుద్దేశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే సీబీఐ, ఈడీ, ఐటీ లాంటి సంస్థలను ప్రతిపక్ష నాయకులపై ఉసిగొల్పి దుర్వినియోగం చేస్తోందన్నారు. అదే దారిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు కేంద్రంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని లేఖ రాయడం దారుణమన్నారు. అధికార దురహంకారంతో ఎన్నికల కమిషన్‌ను శాసించే ప్రయత్నం చేయడం అప్రజాస్వామికమన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను చైతన్యవంతమైన ఆంధ్రప్రదేశ్ ప్రజలు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ ముసుగులో సీఎం రమేష్ రౌడీయిజం

- ఇలాంటి వారిని గెలిపిస్తే జిల్లా రావణ కాష్టమే
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ సుబ్బారెడ్డి

సాక్షి, అనకాపల్లి: ప్రశాంతమైన అనకాపల్లికి చంద్రబాబు సీఎం రమేష్‌ను తీసుకొచ్చి రౌడీయిజాన్ని ప్రేరేపిస్తున్నాడని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఇలాంటి వ్యక్తిని ఎంపీగా గెలిపిస్తే అనకాపల్లిని దోచుకుంటాడని, ఆయనను చిత్తుచిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. శనివారం అనకాపల్లి రింగ్ రోడ్డులో గల పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో అడుగడుగునా ప్రజా సంక్షేమానికి చంద్రబాబు అడ్డుపడటమే కాకుండా తన బినామీలతో, ధనబలంతో వ్యవస్థలను మేనేజ్ చేస్తూ పేదలను, వృద్ధులను, వికలాంగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. తెల్లవారుజామునే అవ్వాతాతల ఇంటికి వెళ్లి పెన్షన్ అందించే వలంటీర్లపై ఈసీకి ఫిర్యాదు చేయించి లక్షలాదిమంది వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగులను చంద్రబాబు ఇబ్బందులకు గురి చేశాడన్నారు. ఈ పాపం రేపటి ఎన్నికల్లో చంద్రబాబుకు శాపంగా మారడం ఖాయమని హెచ్చరించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాన్ గాలి వీస్తోందని, మరోమారు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు, శాసనమండలి విప్ వరుదు కళ్యాణి, ఎమ్మెల్యే అభ్యర్థులు కంబాల జోగులు, కన్నబాబురాజు, పెట్ల ఉమాశంకర్ గణేశ్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మలసాల భరత్ కుమార్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి. వేదికపై మంత్రులు ముత్యాలనాయుడు, అమర్‌నాథ్

• తెలంగాణ

బీఆర్‌ఎస్‌ని ఓడించాం.. బీజేపీనీ ఓడిస్తాం

తుక్కుగూడ జనజాతర బహిరంగ సభలో రాహుల్‌గాంధీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి బీటీమ్‌గా ఉన్న బీఆర్‌ఎస్‌ను ఓడించామని.. లోక్‌సభ ఎన్నికల్లో ఏటీమ్ బీజేపీని కూడా ఓడిస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. మోదీ దగ్గర ఈడీ, సీబీఐ, సంపద ఉంటే తమ దగ్గర నిజాయతీ, ప్రజల ప్రేమ ఉన్నాయని చెప్పారు. దేశ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా కాంగ్రెస్ మేనిఫెస్టోను రూపొందించామని తెలిపారు. ఈ మేనిఫెస్టోకు ఐదు గ్యారంటీలు ఆత్మలాంటివన్నారు. ఈ విప్లవాత్మక మేనిఫెస్టో దేశ ముఖచిత్రాన్ని మార్చబోతుందన్నారు. శనివారం రాత్రి హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ జన జాతర సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. తెలంగాణతో తనది రాజకీయ బంధం కాదని కుటుంబ బంధమని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని ప్రకటించారు. నిరుద్యోగులందరికీ ఏడాదికి రూ.లక్ష వేతనంతో అప్రెంటీస్‌షిప్ పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. నారీ న్యాయ్ పేరుతో కుటుంబంలోని ఒక మహిళకు ఏటా రూ.లక్ష ఇస్తామని తెలిపారు. కిసాన్ న్యాయ్ పథకం ద్వారా రుణమాఫీ చేస్తామన్నారు. పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పారు. శ్రామిక్ న్యాయ్ పథకం ద్వారా గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారితో పాటు ఇతర రంగాల్లోని కార్మికులకు రోజుకు రూ.400 కనీస వేతనంగా ఇస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వ ముఖ్యమంత్రి (కేసీఆర్) వేల మంది ఫోన్లు ట్యాప్ చేశారని రాహుల్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్‌లో మోదీ తన మనుషులను పెట్టుకున్నారని ఆరోపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద కుంభకోణం ఎలక్టోరల్ బాండ్ల కుంభకోణమన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కాలు విరిగిందని, అధికారం పోయిందని, కూతురు జైలుకెళ్లిందని ఇన్నాళ్లు సంయమనం పాటించామని.. ఏదిపడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. తాను జానారెడ్డి టైపు కాదని.. తప్పుడు మాటలు మాట్లాడితే అంగీ, లాగు ఊడదీసి చర్లపల్లి జైల్లో చిప్పకూడు తినిపిస్తానన్నారు.

వ్యాపారులకు చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి

విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ డిమాండ్


విజయవాడలో జరిగిన సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శించిన చాంబర్ ప్రతినిధులు


చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా కడపలో మూసివేసిన కిరాణా దుకాణాలు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్)/కడప కల్చరల్/తణుకు అర్బన్: కిరాణా దుకాణాల్లో గంజాయి అమ్ముతున్నారంటూ రావులపాలెంలో వర్తక వ్యాపారులపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్యులు, ఇతర వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఈ వ్యాఖ్యలను విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఖండించగా, రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ చింతకుంట పుల్లయ్య మండిపడ్డారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విజయవాడలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.విద్యాధరరావు మీడియాతో మాట్లాడారు. తక్షణమే చంద్రబాబు తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని, కిరాణా వ్యాపారులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాబు వ్యాఖ్యలు ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతీశాయన్నారు. ఎక్కడైనా కిరాణా దుకాణంలో గంజాయి అమ్ముతూ పట్టుబడిన ఘటనలు రాష్ట్ర చరిత్రలో ఉన్నాయా అని ప్రశ్నించారు. ఎక్కడో గంజాయి దొరికితే వ్యాపారులకు దాన్ని ఆపాదించడం సరికాదన్నారు. ఆర్యవైశ్యులను అవమానించడం బాబుకు అలవాటుగా మారిందని, ఉద్దేశపూర్వకంగానే విమర్శలు చేశారని మండిపడ్డారు. చంద్రబాబు క్షమాపణ చెప్పే వరకు ఊరుకునేది లేదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు పల్లపోతు మురళీకృష్ణ మాట్లాడుతూ బాబు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన తీరును ఖండిస్తూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఈమని దామోదర్‌రావు, మద్దాల సుధాకర్, శేగు వెంకటేశ్వర్లు, పోకూరి రమేశ్, ఎస్.వెంకటేశ్వరరావు, నాళం నాగేశ్వరరావు, మద్ది బాలు పాల్గొన్నారు.

వైశ్యుల ఆత్మగౌరవాన్ని కించపరచకండి

కిరాణా షాపుల్లో గంజాయి అమ్ముతున్నారంటూ టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై కడప నగర ఆర్యవైశ్య ప్రముఖుడు, రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ చింతకుంట పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైశ్యుల ఆత్మాభిమానాన్ని కించపరుస్తూ మాట్లాడటం చంద్రబాబుకు తగదన్నారు. తక్షణమే ఆయన మాటలను వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో ఆర్యవైశ్యుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల్లో ఓటు రూపంలో తమ సమాధానం చెబుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా శనివారం మధ్యాహ్నం గంటపాటు కిరాణా దుకాణాలను మూసివేశారు.

అంత చులకనా?: కారుమూరి

కిరాణా వ్యాపారులను గంజాయి అమ్మకందారులుగా చిత్రీకరిస్తున్న చంద్రబాబు దుర్మార్గుడని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రావులపాలెం బహిరంగ సభలో చంద్రబాబు కిరాణా దుకాణాల్లో గంజాయి అమ్ముతున్నారంటూ వ్యాపారులను కించపరిచే వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. అధికారంలో ఉండగా ఎస్సీలు, బీసీలపై, ఈ మధ్య టిప్పర్ డ్రైవర్‌కి ఎమ్మెల్యే సీటా? అంటూ అవహేళన చేసి, తాజాగా ఆర్యవైశ్యులపై వ్యాఖ్యలు చూస్తుంటే పక్కా ప్రణాళిక ప్రకారమే పేద వర్గాలను టార్గెట్ చేస్తున్నట్టుగా అర్థమవుతోందన్నారు. చెప్పినవే కాదు.. చెప్పనివి కూడా చేసిన సీఎం వైఎస్ జగన్ సేవా రాజకీయాలు మాత్రమే చేస్తారని చెప్పడానికి గర్వపడుతున్నానని కారుమూరి అన్నారు. ఈ సమావేశంలో నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల పాల్గొన్నారు.

చంద్రబాబు బాగు కోసమే పవన్ పార్టీ

- చంద్రబాబు ఎస్టేట్‌కు మేనేజర్‌లా మారావ్!
- కాపులకు నువ్వు చేసిందేమిటి!
- కాపు సమావేశంలో ముద్రగడ ఫైర్


సమావేశంలో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం, చిత్రంలో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: చంద్రబాబు బాగుకోసమే పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టారని మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఎస్టేట్‌కు పవన్ కళ్యాణ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు కమ్మ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన తణుకు నియోజకవర్గ కాపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాపు ఉద్యమాన్ని తప్పుపడుతున్న పవన్ కాపులకు ఏం చేశారని నిలదీశారు. ప్రజలను డబ్బులకు అమ్ముడుపోయే వారిలా చిత్రీకరిస్తూ పిఠాపురంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటుకు రూ.లక్ష ఇచ్చి తనను ఓడించేందుకు ప్రయత్నిస్తున్నారనడం బాధాకరమన్నారు. 'క్లబ్బులు నడిపే వారితో సోషల్ మీడియాలో నన్ను తిట్టిస్తున్నావు. నీకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రెస్‌మీట్ ద్వారా నేరుగా నన్ను తిట్టవచ్చు. అప్పుడు నేనేంటో నీకు చూపిస్తా' అంటూ ముద్రగడ సవాల్ విసిరారు. 21 అసెంబ్లీ సీట్లకు పరిమితమై త్యాగపురుషుడిగా కీర్తి సాధించావంటూ ఎద్దేవా చేశారు. వాటిలో కూడా టీడీపీ నుంచిజనసేనకు వచ్చినవారి సంఖ్యే అధికమని తెలిపారు. ముద్రగడ భార్య చనిపోయిందని, కొడుకు చనిపోయాడని నీచాతి నీచంగా పోస్టులు పెట్టిస్తున్న నిన్ను చూస్తుంటే అసహ్యమేస్తోందని చెప్పారు. నీచాతినీచంగా నాణ్యమైన లిక్కర్ ఇస్తామంటూ రాజకీయాల్లో కొత్త ఒరవడిని తీసుకువచ్చారని విమర్శించారు.

పవన్‌ను ఇంటికి పంపించండి

ఈ ఎన్నికల్లో పవన్‌ను రాజకీయంగా ప్యాక్ చేసి ఇంటికి పంపించాలని కాపు నాయకులకు ముద్రగడ పిలుపునిచ్చారు. పేదల పెన్నిధిగా నిలబడ్డ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కి అండగా నిలబడతామని, జగన్ చేసిన మంచే ఆయనకు రక్షగా ఉంటుందని చెప్పారు. ఒక ముఖ్యమంత్రిని నిన్ను తొక్కేస్తా అంటూ ఊగిపోవడం, ఉక్రోషంగా, ఉద్రేకంగా మాట్లాడే పవన్ తీరు ఏ రాజకీయ నాయకుడికీ లేదని, రాజకీయాల్లో గౌరవప్రదమైన భాష వాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, నరసాపురం ఎంపీ అభ్యర్థి ఉమాబాల, ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

సీపీఎంకు9.. సీపీఐకి 8 సీట్లు

- ఉభయ పార్టీలకు ఒక్కో ఎంపీ సీటు
- కాంగ్రెస్ పార్టీ నిర్ణయం

సాక్షి, అమరావతి: ఇండియా కూటమి పొత్తులో భాగంగా రాష్ట్రంలో వామపక్ష పార్టీలకు సీట్లు ఖరారయ్యాయి. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలతో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బృందం జరిపిన చర్చల్లో సీట్లు ఖరారు చేశారు. పొత్తులో భాగంగా సీపీఎంకు 9 అసెంబ్లీ స్థానాలు, సీపీఐకి 8 అసెంబ్లీ సీట్లను కేటాయించారు. సీపీఎంకు అరకు లోక్‌సభ స్థానంతోపాటు విజయవాడ సెంట్రల్, గన్నవరం, మంగళగిరి, కర్నూలు, నెల్లూరు, రంపచోడవరం, గాజువాక, కురుపాం అసెంబ్లీ సీట్లను కేటాయించారు. మరో ఎమ్మెల్యే సీటుపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా.. సీపీఐకి ఒక ఎంపీ, 8 అసెంబ్లీ స్థానాలను కేటాయించగా.. ఆ పార్టీ అభ్యర్థులను సైతం ప్రకటించింది. గుంటూరు లోక్‌సభకు జంగాల అజయ్‌కుమార్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయవాడ పశ్చిమకు జి.కోటేశ్వరరావు, ఏలూరుకు బండి వెంకటేశ్వరరావు, విశాఖ పశ్చిమ అత్తిలి విమల, తిరుపతికి పి.మురళి, రాజంపేటకు భూక్యా విశ్వనాథనాయక్, అనంతపురం అర్బన్‌కు సి.జాఫర్, కమలాపురానికి గాలి చంద్ర, పత్తికొండకు పి.రామచంద్రయ్యను ప్రకటించారు.

బాబు మళ్లీ మభ్యపెడుతున్నారు

- 2014లో హామీలు నెరవేర్చలేదు.. ఇప్పుడు మళ్లీ కొత్త వాగ్దానాలు
- ఆయన గ్యారంటీలు, వారంటీలను ప్రజలు నమ్మరు
- మాజీమంత్రి కురసాల కన్నబాబు


మాట్లాడుతున్న కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కొత్త హామీలతో గ్యారంటీలు, వారంటీలంటూ వస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మబోరని మాజీమంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ రమణయ్యపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమిగా ఏర్పడిన టీడీపీ-జనసేన-బీజేపీలు 2014లో కూడా కలిసే ఉన్నాయన్నారు. నాటి మేనిఫెస్టోలో చంద్రబాబు సుమారు 650 హామీలిచ్చారని కన్నబాబు గుర్తుచేశారు. ఇందులో ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా, ఇప్పుడు మళ్లీ కొత్త హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు తిరుగుతున్నారని ఆయన విమర్శించారు. అప్పట్లో రైతు రుణమాఫీ చేస్తామన్నారని, అక్కచెల్లెమ్మల బంగారం తానే విడిపిస్తానన్నారని.. అలాగే, అప్పట్లో ఆయనిచ్చిన హామీ ప్రకారం సుమారు రూ.87,612 కోట్ల రైతు రుణమాఫీ చేయాల్సి ఉండగా రూ.15 వేల కోట్లు మాత్రమే చేశారని కన్నబాబు చెప్పారు. ఇక రూ.14,502 కోట్ల ద్వారా రుణమాఫీ చేస్తానని.. ఇంట్లో ఆడపిల్ల పుడితే రూ.25 వేలు జమ చేస్తామన్నారని, ఏ ఒక్కరికైనా చేశారా అని కన్నబాబు ప్రశ్నించారు. బాబు వస్తే జాబు వస్తుందని, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారని, నిరుద్యోగ భృతి ఇచ్చి ఉంటే ప్రతి ఇంటికి 2014 నుంచి ఐదేళ్ల కాలంలో రూ.1.20 లక్షలు ఇచ్చి ఉండాలని.. కానీ ఎక్కడా నిరుద్యోగ భృతి ఇవ్వలేదని కన్నబాబు చెప్పారు.

వలంటీర్ వ్యవస్థపై బాబు, పవన్‌ల అవహేళన..

ఇక వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ గతంలో చులకనగా మాట్లాడారని, ఇప్పుడు మాటమార్చి వారికి హామీలిస్తున్నారని కన్నబాబు ఎద్దేవా చేశారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి, వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని ఆపించి ఏం సాధించారని ప్రశ్నించారు. ఇంటింటికీ పింఛన్లు అందక సుమారు 35 మంది చనిపోయారన్నారు. పింఛన్ల లబ్ధిదారుల బాధలను గుర్తించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని చెప్పారు. రాష్ట్రానికి దిక్సూచిలా జగన్ పనిచేస్తున్నారని, చంద్రబాబు, ఆయన కూటమి అవసరం ఈ రాష్ట్ర ప్రజలకులేదని కన్నబాబు స్పష్టంచేశారు.

బాబు సెంటు స్థలమైనా ఇచ్చారా?

మరోవైపు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 32 లక్షల ఇళ్ల స్థలాలిచ్చారని, ఐదేళ్ల కాలంలో చంద్రబాబు సెంటు స్థలమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. అసలు నాటి మేనిఫెస్టోనే టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించారని చెప్పారు. ఆ రోజులేని నిబద్ధత, నైతికత ఈరోజు ఎలా వస్తుందని..రూ.4 వేల పింఛను ఏవిధంగా ఇస్తారని ప్రశ్నించారు. అలాగే, నాడు చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలుచేయించలేని వారు ఇప్పుడెలా చేయించగలరని కూటమి పార్టీలను ప్రశ్నించారు. చంద్రబాబు కేవలం మీడియా బలంతో వ్యవహారం నడుపుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

ఉండి అభ్యర్థిని మారిస్తే ఉండేలుదెబ్బే

చంద్రబాబుకు కార్యకర్తల హెచ్చరిక

- సైకిల్ గుర్తును తగలబెట్టిన రఘురామకు సీటు ఎలా ఇస్తారంటూ నిలదీత
- పాలకొల్లులో అధినేతను అడ్డుకునేందుకు విఫలయత్నం..


చంద్రబాబు ఎదుట నిరసన తెలుపుతున్న ఉండి టీడీపీ నేతలు

సాక్షి, భీమవరం/ పాలకొల్లు సెంట్రల్, సాక్షి, అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా రెండో రోజు పర్యటనలో చంద్రబాబుకు సొంత పార్టీ శ్రేణుల నుంచి నిరసన సెగ తగిలింది. ఉండి నియోజకవర్గంలో అభ్యర్థిని మారుస్తున్నట్టు ఇచ్చిన సంకేతాలపై కార్యకర్తలు ఆయనపై తిరగబడ్డారు. గత ఎన్నికల్లో సైకిల్ గుర్తును తగలబెట్టిన వ్యక్తికి సీటు ఎలా ఇస్తారని ప్రశ్నించిన తెలుగు తమ్ముళ్లు.. రామరాజును కాదని రఘురామకృష్ణరాజుకు టికెట్‌స్తే చిత్తుగా ఓడిస్తామంటూ చంద్రబాబు ఎదుటే తేల్చిచెప్పారు. ఉండి నియోజకవర్గం కూటమి అభ్యర్థిగా టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు పేరును చంద్రబాబు మొదటి జాబితాలోనే ప్రకటించారు. ఈ మేరకు రామరాజు ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు. ఉండి సీటు తనదేనని, రెండు మూడు రోజుల్లో చంద్రబాబు ప్రకటిస్తారని రఘురామకృష్ణంరాజు తన అనుచరులతో చెబుతున్నట్టుగా జరుగుతున్న ప్రచారం ఎమ్మెల్యే రామరాజు వర్గానికి మింగుడు పడలేదు. ఈ తరుణంలో అభ్యర్థి మార్పుపై చంద్రబాబు ఇచ్చిన సంకేతాలు పార్టీ క్యాడర్‌లో అగ్గిరాజేశాయి. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం పాలకొల్లు ఎస్ కన్వెన్షన్ హాలులో పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన కూటమి అభ్యర్థులు, ముఖ్య నేతలతో చంద్రబాబు భేటీ అయ్యారు. సమావేశానికి ఉండి ఎమ్మెల్యే రామరాజుతోపాటు రఘురామకృష్ణరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామరాజుకు ప్రచారం స్పీడు తగ్గించాలని చంద్రబాబు చెప్పినట్టు పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ సమాచారంతో ఉండి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ఎమ్మెల్యే రామరాజు అనుచరులు పాలకొల్లులోని ఫంక్షన్ హాలు వద్దకు చేరుకుని బయటే బైఠాయించి నిరసనకు దిగారు. రామరాజును మారిస్తే తమ సత్తా చూపిస్తామని, ఉండిలో పార్టీ విజయాలకు బ్రేక్ వేస్తామని హెచ్చరించారు. సమావేశం అనంతరం బయటకు వచ్చిన చంద్రబాబును అడ్డుకునే యత్నం చేశారు. చంద్రబాబు వారికి సమాధానం చెప్పకుండా సెక్యూరిటీ సిబ్బంది సాయంతో వెళ్లిపోయారు. ఉండి కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే మంతెన రామరాజు మాట్లాడుతూ చంద్రబాబు, పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. అయితే ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఎన్నోఏళ్లుగా పార్టీ విజయానికి పనిచేస్తున్న కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

బ్రోకర్‌కు టికెట్టా!

రాజకీయ బ్రోకర్‌గా, వివాదాస్పదుడిగా ముద్రపడిన రఘురామకృష్ణరాజుకు ఉండి సీటు ఇచ్చేందుకు చంద్రబాబు సిద్ధపడడమేమిటని కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. అయితే అసలు ఈ ఉదంతంలో చంద్రబాబు ఆలోచనలు వేరుగా ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున నరసాపురం ఎంపీగా గెలిచిన రఘురామ ఆ పార్టీలో తన ఆటలు సాగకపోవడంతో కొద్దినెలలకే రాజకీయ బ్రోకర్‌గా మారి టీడీపీకి, చంద్రబాబుకు అప్పుడిగా మారిపోయారు. ఆయనకు అనుకూలంగా పనిచేశారు. చంద్రబాబు చేసిన కుట్రలన్నీ రఘురామకు తెలుసని, అందుకే ఇప్పుడు ఆయనకు సీటు ఇవ్వకపోతే ఇబ్బందికర పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి ఉంటుందనే ఆందోళనలో చంద్రబాబు ఉన్నట్టు తెలుస్తోంది. రఘురామ కూటమి తరఫున నరసాపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఏడాది క్రితమే ప్రకటించారు. బీజేపీలో చేరి నర్సాపురం ఎంపీ సీటు తెచ్చుకోవాలని కలలు కన్నారు. కానీ బీజేపీ అందుకు అంగీకరించలేదు. దీంతో రఘురామకృష్ణంరాజు ఆశలు అడియాసలయ్యాయి. ఈ నేపథ్యంలో తన సంగతి తేల్చాలని చంద్రబాబుపై రఘురామ ఒత్తిడి తెచ్చారు. ఇంతకాలం అన్ని పనులకూ ఆయనను ఉపయోగించుకున్న కారణంగా రఘురామ బాధ్యత చంద్రబాబుపైనే పడింది.

నర్సీపట్నంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ వీరంగం

కమలం గుర్తు చీరల పంపిణీలో వివాదం


సీఎం రమేష్‌కు నోటీసులు ఇస్తున్న పోలీసులు

నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా)/సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి పార్లమెంట్‌కు బీజేపీ తరఫున పోటీ చేస్తున్న సిఎం రమేష్ వ్యవహారశైలి వివాదస్పదంగా మారింది. ఇటీవల చోడవరంలో ఓ సంఘటనలో కేసు నమోదు కాగా శనివారం నర్సీపట్నంలో కృష్ణా ప్యాలెస్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యకర్తలకు చీరల పంపిణీ కార్యక్రమం వివాదానికి దారి తీసింది. విషయం తెలుసుకున్న నర్సీపట్నం టౌన్ సిఐ క్రాంతికుమార్, మున్సిపల్ కమిషనర్ రవిబాబుతో పాటు ఎన్నికల యంత్రాంగం అక్కడికి చేరుకుని ఆరా తీయడంతో సిఎం రమేష్ అధికారులపై చిందులు తొక్కారు. ఓటర్లకు సింబల్ తెలియడానికి కమలం గుర్తు కలిగిన చీరలు ఇవ్వడం తప్పా అని ప్రశ్నించారు. ఇవి తాయిలాలు కాదని అధికారులపై చిందులు తొక్కారు.

సీఎం రమేష్‌కు 41ఏ నోటీసులు జారీ

అనకాపల్లి జిల్లా చోడవరంలో జీఎస్టీ చెల్లించకుండా అనధికారికంగా టైల్స్ వ్యాపారం చేస్తున్న బుచ్చిబాబు ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఐ అధికారులపై దాడికి దిగడమే కాకుండా, విధులకు ఆటంకం కల్గించిన వ్యవహారంలో సీఎం రమేషకు శనివారం రాత్రి పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చారు. ఈ నెల 9న విచారణకు హాజరు కావాలని అనకాపల్లి ఎస్‌డీపీవో ఆదేశించారు.

తక్కువ ధరకే మద్యం అందిస్తా

పల్నాడు జిల్లా ప్రజాగళం సభల్లో టీడీపీ అధినేత చంద్రబాబు



సాక్షి, నరసరావుపేట: ప్రజలకు నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకే అందేలా చూస్తానని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుపేర్కొన్నారు. పల్నాడు జిల్లా క్రోసూరు, సత్తెనపల్లిలలో జరిగిన ప్రజాగళం బహిరంగ సభలలో శనివారం ఆయన మాట్లాడారు. సభకు చిన్నపిల్లలు ఎక్కువగా వచ్చారని వ్యాఖ్యానించిన ఆయన వారిని ఉద్దేశించి మీకు ఓటు హక్కు లేకపోయినా గ్రామాల్లో ర్యాలీగా తిరిగి టీడీపీకి అనుకూలంగా ప్రచారం చేయాలని కోరారు. అందరికన్నా తానే పెద్ద యువకుడినని తనను తాను అభివర్ణించుకున్నారు. తాను భావి తరాల గురించి ఆలోచిస్తానని 2000 సంవత్సరంలోనే విజన్-2020 ప్రణాళిక రూపొందించానని, అందువల్లే హైదరాబాద్ ఇంత అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ప్రస్తుతం 2047నాటికి దేశం, రాష్ట్రం ఎలా ఉండాలో లోచిస్తున్నానన్నారు. సీఎం వైఎస్ జగన్ హయాంలో రాష్ట్రం సర్వనాశనమైందని, రానున్నది ఎన్‌డీఏ ప్రభుత్వమేనని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక పెదకూరపాడుకు ఐటీ పార్క్ తెస్తానని పేర్కొన్నారు. ప్రపంచంలోని పెద్ద కంపెనీలను తీసుకొస్తానన్నారు. ఇదిలా ఉంటే క్రోసూరులోని ఇరుకు వీధుల్లో ప్రజాగళం సభ నిర్వహించి రోడ్లను బ్లాక్ చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు గంటలకొద్దీ ఇబ్బందిపడ్డారు. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే కార్యకర్తలు వెళ్లిపోవడం కనిపించింది. సభా ప్రాంగణం దగ్గర్లో మద్యం ఏరులై పారింది. సభలో ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

చంద్రబాబుపై చర్యలు తీసుకోండి

- టీడీపీ పాటలు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్నాయి
- వీటిని తక్షణమే నిలిపేయాలి
- సీఎం వైఎస్ జగన్‌ను కించపరుస్తూ మాట్లాడుతున్నారు
- ఇప్పటికే నోటీసులు ఇచ్చినా చంద్రబాబు తీరు మారలేదు
- ఈసీకి ఆధారాలతో సహా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే విష్ణు ఫిర్యాదు


రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు

సాక్షి, అమరావతి: టీడీపీ విడుదల చేసిన పాటలు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫిర్యాదు చేశారు. అలాగే ఐటీడీపీ వెబ్‌సైట్‌లో సీఎం వైఎస్ జగన్‌ని కించపరుస్తూ.. 'సైకో పోవాలి.. సైకిల్ రావాలి' అనే పాటను పదేపదే ప్రదర్శిస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. నరసాపురం సభలోనూ ఆ పాట ప్రదర్శించిన సమయంలో చంద్రబాబు హావభావాలు జుగుప్సాకరంగా ఉన్నాయన్నారు. పైగా ఆ పాటలో కులాలు, మతాల ప్రస్తావన ఉందని తెలిపారు. ముఖ్యమంత్రిని కించపరిచేలా ప్రదర్శిస్తున్న ఆ పాటను తక్షణమే నిలుపుదల చేయాలని కోరారు. అదేవిధంగా 'సీమ చెల్లెమ్మ' పాటపై కూడా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం వెలగపూడి సచివాలయంలో సీఈవో మీనను కలిసి ఆధారాలతో కూడిన లేఖను అందజేశారు. అనంతరం విష్ణు మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికే మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్ల సభల్లో చంద్రబాబు వాడిన భాషపై ఈసీ నోటీసులు ఇచ్చిందన్నారు. అయినా చంద్రబాబు తీరు మారకపోవడం శోచనీయమన్నారు. పైగా మళ్లీ బహిరంగ సభల్లో 'గంజాయి ఫ్యామిలీ', 'శవ రాజకీయాలు' అంటూ దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు.

పురందేశ్వరిపైనా చర్యలు తీసుకోవాలి

టీడీపీ, జనసేన, బీజేపీలకు అజెండా అంటూ లేదని, ప్రభుత్వంపై దుమ్మెత్తిపోయడం, అధికార పక్షాన్ని దుర్భాషలాడటమే పనని మల్లాది విష్ణు ధ్వజమెత్తారు. ఐపీఎస్ అధికారులపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. నిష్పక్షపాతంగా పనిచేస్తున్న 22 మంది అధికారులకు రాజకీయ రంగు పులమడం ఏమాత్రం సరికాదన్నారు. పురందేశ్వరి వెనుక ఎవరున్నారో ఈపాటికే ప్రజలు గ్రహించాచారన్నారు. మైండ్ గేమ్ ఆడుతూ, అధికారులపై ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతున్న ఆమెపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు చెప్పారు. అలాగే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కోర్టు పరిధిలో ఉన్న వివేకా కేసుపై బహిరంగ సభల్లో పదేపదే మాట్లాడుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీ అవినాష్ రెడ్డిపై నిందారోపణలు చేయడంపై ఫిర్యాదు చేశామన్నారు. ఒక యువ సీఎంతో పోటీపడలేక చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఏనాడూ ప్రజలతో మమేకం కాలేదన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, నవరత్నాలు కార్యక్రమం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరిగే నిత్యాన్నదానానికి పెనమలూరు మండలం కానూరుకు చెందిన బోడపాటి లక్ష్మీప్రసూనాంబ శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ ఉద్యోగులు

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ డి.కె. బాలాజీని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



డీజే టిల్లు సందడి

విజయవాడలో టిల్లు స్క్వేర్ చిత్ర యూనిట్ శనివారం సందడి చేసింది. తమ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపింది.

-IIలో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహరి (సోమ)
విజయవాడ	6.26	4.38
జగ్గయ్యపేట	6.26	4.43
మచిలీపట్నం	6.24	4.37
గుడివాడ	6.26	4.38

మరో మణిహారం.. చిరు ఆటంకం

- విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు 95 శాతం పూర్తి
- కేవలం 900 మీటర్ల మేర పనులు పెండింగ్
- విద్యుత్ టవర్ల మార్పిడిపై కోర్టు కేసులతో ఆటంకం
- ఓ పార్టీ ప్రోద్బలంతోనే రైతులు అడ్డుకుంటున్నారని ఆరోపణలు



నిర్మాణం పూర్తయిన విజయవాడ వెస్ట్ బైపాస్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ నగరానికి మరో మణిహారం సిద్ధమైంది. ఎన్నో ఏళ్లుగా నగర వాసులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలను దూరం చేసే ప్రాజెక్ట్ అది. 95 శాతం నిర్మాణం పూర్తయినా, ఓ రాజకీయ పార్టీ స్వార్థంతో ప్రారంభోత్సవం కాకుండా ఆగిపోయింది. ఆ ప్రాజెక్టే విజయవాడ వెస్ట్ బైపాస్. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలను తొలగించాలని కాంట్రాక్ట్ సంస్థతో పనులను శరవేగంగా చేయించింది. 95 శాతానికి పైగా పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేసింది. రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ టవర్ల మార్పిడి అంశంపై కొంత మంది రైతులు కోర్టును ఆశ్రయించడంతో ప్రారంభోత్సవం చేసుకునే అవకాశం లేకుండా పోయింది.

ఇదీ ప్రాజెక్టు స్వరూపం..

ప్యాకేజీ–3 కింద చిన అవుటుపల్లి నుంచి గొల్లపూడి వరకు 30 కిలోమీటర్ల మేర రూ.1,148 కోట్ల అంచనాలతో వెస్ట్ బైపాస్ నిర్మాణం చేపట్టారు. మెగా సంస్థ ఫిబ్రవరి 2021లో పనులు ప్రారంభించింది. ఈ రహదారి కోసం 14 గ్రామాల్లో భూసేకరణ చేశారు. కృష్ణా జిల్లాలో వెదురుపావులూరు, రామచంద్రాపురం, కొండపావులూరు, బీబీ గూడెం, గన్నవరం, చిన్న అవుటుపల్లి, ఎన్టీఆర్ జిల్లాలో గొల్లపల్లి, జక్కంపూడి, అంబాపురం, పి.నైనవరం, పాతపాడు, కె.వి.కండ్రిక, నున్న గ్రామాల పరిధిలో మొత్తం 188.92 హెక్టార్ల భూమిని సేకరించారు. భూ సేకరణకు రూ.416.60 కోట్లు ఖర్చు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు శరవేగంగా ముందుకు సాగాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ బైపాస్ పనులు పూర్తయితే విజయవాడ నగర వాసులకు ట్రాఫిక్ కష్టాలు పూర్తిగా తీరిపోతాయి. విశాఖపట్నం – హైదరాబాద్ వయా విజయవాడ, హైదరాబాద్ – విశాఖపట్నం వయా విజయవాడ వెళ్లే ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది.

కుట్రకోణం..

విద్యుత్ లైను టవర్ల మార్పిడికి సంబంధించి రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించింది. అయితే ఈ రహదారిని ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తెస్తే విజయవాడ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతో రైతుల ముసుగులో ఓ పార్టీ నాయకులు కోర్టుకు వెళ్లి పనులను అడ్డుకున్నారన్న ఆరోణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి మంచి పేరు రాకుండా సాంకేతిక కారణాలతో ఆటంకాలు కలిగిస్తున్న ఆ పార్టీ నాయకులపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కావాలనే ఆటంకాలు



విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. విద్యుత్తు టవర్లు ఉన్న ప్రాంతంలో మాత్రమే కొంత మేర రహదారి నిర్మాణం చేయాల్సింది. రైతుల పేరుతో కొంత మంది కావాలనే కుట్ర చేసి, సాంకేతిక కారణాలను సాకుగా చూపి పనులు అడ్డుకుంటున్నారు. ఈ రహదారి అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

– అవుతు శ్రీనివాసులరెడ్డి, నున్న

సర్వీసు రోడ్డు

ప్యాకేజీ–3కు సంబంధించి హైవేకు పూర్వం ఉన్న రోడ్లకు అనుసంధానం చేసే విధంగా 11.2 కిలో మీటర్ల స్లిప్ రోడ్లు వేశారు. అయితే చుట్టు పక్కల గ్రామాల వరకు మొత్తం సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు హైవే అధికారులు సానుకూలంగా స్పందించి ఈ మేరకు ప్రతిపాదనలు, నేషనల్ హైవే అథారిటీకి పంపారు. రహదారి సేఫ్టీ, ప్రభుత్వ భూమి సంరక్షణ, ప్రహరీ నిర్మిస్తున్నారు.

అడ్డంకిగా మారిన విద్యుత్తు లైన్లు

బైపాస్ రోడ్డుకు మధ్యలో హై ఓల్టేజీ విద్యుత్ లైన్లు వెళ్తున్నాయి. కృష్ణా జిల్లాలో ఒక చోట, ఎన్టీఆర్ జిల్లాలో 12 చోట్ల ఏపీ ట్రాన్స్‌కో, ల్యాంకో, పవర్ గ్రిడ్‌కు సంబంధించిన విద్యుత్ లైన్లను మార్చాల్సి ఉంది. ఇవి గొల్లపూడి, జక్కంపూడి అంబాపురం, నున్న ప్రాంతంలో ఉన్నాయి. వీటికి సంబంధించి పరిహారం నిమిత్తం విజయవాడ సబ్ కలెక్టర్ రైతులతో చర్చించారు. మామూలుగా టవర్ బేస్ ప్రాంతంలో మార్కెట్ విలువకంటే 100 శాతం అదనంగా పరిహారం ఇస్తారు. వైర్లు వెళ్లే ప్రాంతంలో పది శాతం పరిహారం ఇస్తారు. అయితే ప్రభుత్వం పనులకు అడ్డంకి కాకుండా, రైతులకు మేలు కలిగే విధంగా ప్రత్యేక జీఓ ద్వారా పరిహారాన్ని మంజూరు చేసింది. దీని ప్రకారం ప్రభుత్వం టవర్ బేస్ ఏరియాలో మార్కెట్ విలువ కంటే అదనంగా 250 శాతం అంటే 2.5 రెట్లు, వైర్లు వెళ్లే ప్రాంతంలో మార్కెట్ విలువలో పది శాతం, పంట నష్టం జరిగి ఉంటే దానికి పరిహారం సైతం నేషనల్ హైవే అధికారులు జిల్లా కలెక్టర్ వద్ద డిపాజిట్ చేశారు. ఈ మేరకు కృష్ణా జిల్లా కలెక్టర్ పేరుతో రూ.1.1 కోట్లు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ పేరుతో రూ.21.85 కోట్లు డిపాజిట్ చేశారు. అయితే విద్యుత్ లైన్లు వెళ్లే ఆరు ప్రాంతాల్లో రైతులు కోర్టుకు వెళ్లారు. ఆ ప్రాంతాల్లో మొత్తం 1.49 కిలోమీటర్ల పరిధిలో ఈ విద్యుత్ లైన్లు విస్తరించి ఉన్నాయి. వాటి పరిధిలో కేవలం 900 మీటర్ల మేర మాత్రమే రహదారి పనులు నిలిచిపోయాయి. దీంతో కోర్టు కేసులు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకొంటున్నారు.



బైపాస్ రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ లైన్లు

వైఎస్సార్ పింఛన్ కానుక 98.91 శాతం పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక 98.91 శాతం మందికి అందింది. జిల్లాలో మొత్తం 2,38,157 మంది లబ్ధిదారులు ఉన్నారు. శనివారం సాయంత్రానికి 2,34,701 మందికి పింఛన్లు అందాయి. జిల్లాలో అత్యధికంగా తిరువూరు (అర్బన్)లో 99.16 శాతం, నందిగామ అర్బన్‌లో 99.15 శాతం, మైలవరంలో 99.14 శాతం, చందర్లపాడు మండలంలో 99.12 శాతం, జి.కొండూరు మండలంలో 99.07 శాతం పంపిణీ పూర్తయింది.

అందరికీ అందుబాటులో అధునాతన గుండె వైద్యం



లబ్బీపేట(విజయవాడతూర్పు): అందరికీ అందుబాటులో అధునాతన గుండె వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే తెలిపారు. విజయవాడలో శనివారం జరిగిన ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సర్జన్స్ ఆవిర్భావ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండె వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. గుండె వైద్యంలో అధునాతన విధానాలు అందుబాటులోకి వస్తున్నాయని, వాటితో క్లిష్టతరమైన గుండె ఆపరేషన్లను సైతం విజయవంతంగా చేయగలుగుతున్నామని వివరించారు. తొలుత ఈ సభను విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్డియాక్ సర్జన్స్ డాక్టర్ వరుణ్, డాక్టర్ వివేక్, డాక్టర్ జయకృష్ణణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

9న టీటీడీ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తొమ్మిది నుంచి 16వ తేదీ వరకు క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు జరగనున్నాయి. బందరు రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ వేడుకలు జరుగుతాయని ఉమ్మడి కృష్ణాజిల్లా సూపరింటెండెంట్ మేడవరం కాంతికుమార్ తెలిపారు. ఆయన టీటీడీ కల్యాణమండపంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదో తేదీ సాయంత్రం గబ్బిట ఆంజనేయ శాస్త్రి ఆధ్వర్యంలో పంచాంగ పఠనం, పది నుంచి 16వ తేదీ వరకు రోజూ సాయంత్రం శ్రీమద్రామయణంలోని వివిధ అంశాల ఆధారంగా మండీలక శ్రీ కృష్ణకుమార్, మరదూరి నరసింహాచార్యులు, రొంపిచెర్ల ఉదయ్ కుమార్ ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయని వివరించారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల దేవాలయ సూపరింటెండెంట్ రామచంద్రరావు, కల్యాణ మండపం మేనేజర్ భాస్కరరెడ్డి, హిందూ ధర్మప్రచార పరిషత్ సిబ్బంది బి. వెంకటబాల కోటేశ్వరరావు, నండూరి వెంకట తాండవకృష్ణ, ప్రోగ్రామ్ అసిస్టెంట్ సి.వి.కె. ప్రసాద్, గట్ల నరసింహారావు, తురగా ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

భక్తులతో పోటెత్తిన తిరుమలగిరి ఆలయం



జగ్గయ్యపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమలగిరిలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. తెల్లవారు జాము నుంచే రెండు తెలుగు రాష్ట్రాల నుంచి స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఆలయం వద్ద పొంగళ్లు వండి మెట్ల పూజ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ఆలయ ఈఓ నూతక్కి వెంకట సాంబశివరావు దాతలు, గ్రామస్తుల సహకారంతో భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. దర్శనం టిక్కెట్లు, లడ్డూ ప్రసాదాలు, నిత్యన్నదానానికి విరాళాల ద్వారా రూ.6.85 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. రెండు వేల మందికి అన్నప్రసాదం వితరణ చేశామని ఆలయ చైర్మన్ భరద్వాజ్ తెలిపారు. చిల్లకల్లు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

గంగాభవాని అమ్మవారి జాతర ప్రారంభం



కోడూరు గంగాభవానీ అమ్మవారి ప్రధాన జాతరోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి పుట్టింటివారైన కంచర్లపల్లి వంశీయులు ఉదయం పసుపు, కుంకుమ, చీరలు, పూల దండలు, గాజులను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన ప్రభను దేవాలయం చుట్టూ తిప్పి, సారెను పండితులకు అందించారు. డప్పు వాయిద్యాలకు అనుగుణంగా భక్తులతో కలిసి పోలీసు సిబ్బంది డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. – కోడూరు

ఇఫ్తార్ విందులో మంత్రి జోగి

పెనమలూరు: కానూరులో శనివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో మంత్రి, పెనమలూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జోగి రమేష్ పాల్గొన్నారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ దేవభక్తుని చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. రంజాన్‌ను ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో చేసుకోవాలని కోరారు. ముస్లింలకు రంజాన్ పవిత్రమైన పండుగన్నారు. మాజీ సర్పంచ్ దేవభక్తుని సుబ్బారావు, రహీం, చాంద్‌బాషా, ఖాదర్, చాగంటిపాటి శివరామకృష్ణ, రబ్బాని, వెలగపూడి వరప్రసాద్, అన్వర్, సుభాని, గుల్జార్, అష్రఫ్, కత్తెర బాషా, మస్తాన్, కాకి శ్రీనివాసరావు, పి.సాంబయ్య పాల్గొన్నారు.



గడువులోపు సీ–విజిల్ సమస్యల పరిష్కారం

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీ–విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు అత్యంత కచ్చితత్వంతో పరిష్కరిస్తున్నామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా శనివారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులు హాజరయ్యారు.

ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో ఆ లోగా పూర్తిచేయాల్సిన కార్యకలాపాలపై సీఈఓ ముకేష్ కుమార్ మీనా పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) ఉల్లంఘనలపై సీ–విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారం, సీజర్స్ గ్రీవెన్స్ పరిష్కార కమిటీ పనితీరు, ఓటర్ల జాబితాకు సంబంధించి వివిధ ఫారాల పరిష్కారం, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు తదితరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా, వివిధ మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారం, నివేదిక నిర్వహణ వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా పోస్టర్లు, బ్యానర్ల ఏర్పాటు, వాహనాలు ఉపయోగించడం తదితరాలపై ఇప్పటి వరకు సీ–విజిల్ ద్వారా 374 ఫిర్యాదులు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్)ను కూడా పకడ్బందీగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికార యంత్రాంగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు సమన్వయంతో వ్యవహరిస్తున్నట్లు వివరించారు. జిల్లాస్థాయి గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీ ద్వారా ఎప్పటికప్పుడు సీజర్ కేసులను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 41 కేసులను రిలీజ్ చేసినట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె.రాణా జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో జిల్లాలో ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ అమలుకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. 11 అంతర్రాష్ట్ర సరిహద్దు పోలీస్ చెక్‌పోస్టులు, రెండు సెబ్ చెక్‌పోస్టులు, ఏడు ఇంటర్ డిస్ట్రిక్ట్ పోలీస్ చెక్‌పోస్టుల వద్ద నిఘా, సీజర్లపై చర్చించి, కార్యకలాపాలు సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, కె.శ్రీనివాసరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ రాణా, జేసీ సంపత్ కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కాలుష్య రహితం.. ఆరోగ్య హితం

- ఆరోగ్యంగా జీవించడం ప్రతి ఒక్కరి హక్కు
- ఆ దిశగా గ్రామీణులకు వైద్యాన్ని చేరువ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- విజయవాడ సహా జిల్లాలో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించిన వైనం
- ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకునేలా పటిష్ట చర్యలు
- నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



స్వచ్ఛమైన పర్యావరణం కోసం నగరంలో ఏర్పాటు చేసిన గ్రీన్‌కారిడార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆరోగ్యంగా జీవించడమనేది ప్రతి ఒక్కరి హక్కుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. అందులో భాగంగా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'నా ఆరోగ్యం – నా హక్కు' అనే నినాదాన్ని ప్రకటించింది. ప్రతి ఒక్కరూ నాణ్యమైన వైద్య సేవలు పొందడంతో పాటు ఆరోగ్య, వైద్య విద్య, సమాచారం, సురక్షితమైన తాగునీరు, స్వచ్ఛమైన గాలి, పోషకాహారం, పర్యావరణ పరిస్థితులు, స్వేచ్ఛను పొందే హక్కును అందాలనే లక్ష్యంతో ఈ నినాదాన్ని ఇచ్చినట్లు పేర్కొంది. ఆ దిశగా ఇప్పటికే వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. ప్రతి ఒక్కరూ నాణ్యమైన వైద్య సేవలు పొందేలా అనేక వైద్య పథకాలను అమలు చేస్తోంది. స్వచ్ఛమైన నీరు అందిస్తూ, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది.

గ్రామీణుల చెంతకే నాణ్యమైన వైద్యం

ప్రతి ఒక్కరూ నాణ్యమైన వైద్య సేవలు పొందడం అనేది హక్కుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది పిలుపునివ్వగా, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఎప్పుడో చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రజలు నాణ్యమైన వైద్య సేవలు పొందేలా ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలుచేస్తోంది. ఆయా విభాగాల్లో నిపుణులైన వైద్యులు గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. అంతే కాదు నాడు–నేడుతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రూపురేఖలు మార్చి, ఆధునిక సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి, వాటి ద్వారా టెలిమెడిసిన్ విధానంలో స్పెషాలిటీ వైద్యుల సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రజలందరికీ ఇప్పటికే నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేసింది. రక్షిత మంచి నీటి పథకాలకు సైతం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తోంది.

స్వచ్ఛమైన గాలి

గాలిలో కాలుష్యం, దుమ్ముశాతం ఎక్కువగా ఉంటే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. స్వచ్ఛమైన గాలి అనేది ప్రతి ఒక్కరి హక్కుగా డబ్ల్యూహెచ్ఓ గుర్తించింది. ఆ దిశగా ప్రభుత్వం నాలుగేళ్ల కిందటే చర్యలు తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో విజయవాడ వంటి ప్రాంతాల్లో గాలిలో దుమ్ము శాతం ఎక్కువగా ఉన్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి హెచ్చరికలు వచ్చాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 24 గంటలూ పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టడంతో పాటు, నగరంలో గ్రీనరీని పెంపొందించారు. పార్కులను అభివృద్ధి చేయడం, రోడ్ల వెంట గ్రీన్ కారిడార్‌లు ఏర్పాటు చేసి గాలిలో దుమ్ముశాతాన్ని తగ్గించగలిగారు. పలు ప్రాంతాల్లో కంటిన్యూయిస్ యాంబియట్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ సిస్టమ్ (సీఏఏక్యూఎం)లు ఏర్పాటు చేసి నిరంతరం పరిశీలన జరుపుతున్నారు. ఇలా కాలుష్యం కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా కాపాడుతున్నారు.

నాణ్యమైన పోషకాహారం

చిన్నప్పటి నుంచే నాణ్యమైన పోషకాహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు బలవర్ధకమైన ఆహారం అందిస్తోంది. పాఠశాలలకు వెళ్లే పిల్లలకు గోరుముద్దలో ప్రత్యేక మెనూ అమలు చేస్తోంది. గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషకాహారం అందిస్తోంది. వ్యాధులతో ఆస్పత్రిలో చేరిన వారికి సైతం పోషక విలువలు కలిగిన ఆహారం అందించేలా ప్రభుత్వం ఏడాది కిందట డైట్ చార్జీలు పెంచింది. నిరుపేదలకు సైతం పోషక విలువలు కలిగిన ఆహారం అందేలా చర్యలు తీసుకుంది. ప్రజలందరూ స్వేచ్ఛగా జీవించేలా రక్షణ చర్యలు తీసుకుంది. మహిళలపై దాడులను నివారించేందుకు దిశ చట్టాన్ని అందుబాటులోకి తెచ్చింది.

ఆరోగ్య రంగానికి పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. జబ్బు చేసిన ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలను కల్పించింది. కరోనా సమయంలో లక్షలాది మందికి నాణ్యమైన సేవలు అందించింది. గ్రామీణ ప్రాంతాలకు స్పెషలిస్టు వైద్యులను పంపించడం అనేది దేశంలో ఎక్కడా లేదు. రాష్ట్రంలోనే అమలవుతోంది. ఇదొక గొప్ప కార్యక్రమంగా చెప్పవచ్చు.

– డాక్టర్ ఎస్.ఎస్.విఠల్‌రావు, విశ్రాంత అదనపు సంచాలకుడు, వైద్యవిద్యాశాఖ

క్లుప్తంగా

పింఛన్‌కు వెళ్తూ స్పృహ తప్పి పడిపోయిన వృద్ధురాలు



గౌరవరం(జగ్గయ్యపేట): పింఛన్ కోసం వెళ్తూ ఓ వృద్ధురాలు స్పృహ కోల్పోయి కింద పడిన ఘటన గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గౌరవరంలోని ఎస్సీ కాలనీకి చెందిన బొజ్జా జ్ఞానమ్మ అనే వృద్ధురాలిని సచివాలయంలో పింఛన్ అందుకోవడానికి మధ్యాహ్నం వేళ కుటుంబసభ్యుల సహకారంతో ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో సచివాలయం వద్దకు వచ్చేసరికి ఆమె స్పృహ తప్పి కిందపడిపోయింది. దీంతో అక్కడ ఉన్నవారు జగ్గయ్యపేట ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా ఎడమ చెయ్యి విరిగిపోయిందని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు వలంటీర్ ద్వారా తీసుకునే పింఛను సచివాలయం వద్దకు వచ్చి తీసుకోవడం ఏంటంటూ బాధను వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి

పెనమలూరు: బాత్రూం కడిగే యాసిడ్ తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప శ్రీనివాసానగర్‌కట్ట మూడో లైన్‌కు చెందిన కొప్పనాతి ధనుంజయ కుటుంబం నివసిస్తోంది. ధనుంజయ తల్లి నాగమణి (58) మానసికంగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఈ నెల 4వ తేదీ కొబ్బరినీళ్లు అనుకుని బాత్రూం కడిగే యాసిడ్ తాగి తీవ్ర అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు నాగమణిని ఏమైందని ప్రశ్నించగా యాసిడ్ తాగానని చెప్పింది. ఆమెను వెంటనే పటమటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి అత్యవసర వైద్యం కోసం తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న నాగమణి ఈ నెల 5వ తేదీ సాయంత్రం నాగమణి మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి కుమారుడు ధనుంజయ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణా నదిలో గుర్తు తెలియని పురుష మృతదేహం లభ్యమైంది. కృష్ణలంక పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజీవ్‌గాంధీ పార్కు ఎదురుగా కృష్ణా నదిలో వ్యక్తి మృతదేహం తేలియాడుతున్నట్లు శనివారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీసి పురుషుడిగా గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఊరు, పేరుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదు. అతని వయసు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

- దమ్మపేట వద్ద ప్రమాద ఘటన
- దేహాల పైనుంచి లారీ వెళ్లడంతో ఛిద్రమైన శరీరాలు
- మృతులు ఎన్టీఆర్ జిల్లా చీమలపాడు వాసులు
- కోళ్లఫాంలో పని నిమిత్తం వస్తుండగా ప్రమాదం



క్షతగాత్రుడు చీపు బాలకృష్ణ



మృతులు భార్య, కుమార్తెలు (ఫైల్)

దమ్మపేట: లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన చీపు బాలకృష్ణ తన భార్య లక్ష్మి(23), కుమార్తెలు చరణశ్రీ(8), షణ్మితశ్రీ(6)తో కలసి బైక్‌పై తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా వీఎం బంజర నుంచి అశ్వారావుపేట వైపునకు కోళ్లఫారంలో పనికి కుదిరే నిమిత్తం వెళ్తున్నాడు. ఈక్రమంలో మందలపల్లిలోని ప్రభు నర్సరీ సమీపాన లారీని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా ఎదురుగా మరో వాహనం అడ్డొచ్చింది. ఆ వాహనం సైడ్ మిర్రర్ బైక్‌కు తగలడంతో అదుపు తప్పింది. బాలకృష్ణ ఓ వైపు పడిపోగా మిగిలిన ముగ్గురు కుటుంబ సభ్యులు మరోవైపు పడిపోయారు. ముగ్గురు కుటుంబ సభ్యుల మీదుగా వెనుక నుంచి వస్తోన్న లారీ దూసుకెళ్లడంతో ఘటనాస్థలిలోనే మృతి చెందారు. లారీ శరీరాల పైనుంచి వెళ్లడంతో ముగ్గురి దేహాలు ఛిద్రం కాగా.. శరీర భాగాలు తెగిపోయి రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఇంకో వైపు పడిపోయిన బాలకృష్ణ కాళ్లకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే బాలకృష్ణను దమ్మపేట ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అలాగే, ఆయన భార్య, ఇద్దరు పిల్లల మృతదేహాలను అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈసందర్భంగా బాలకృష్ణతో స్థానికులు మాట్లాడి వివరాలు ఆరా తీసే క్రమాన... తాను ప్రేమ వివాహం చేసుకుని, తల్లిదండ్రులకు దూరంగా జీవిస్తున్నామని పేర్కొన్న ఆయన తన భార్యాపిల్లలకు ఏమైందో చెప్పాలని అడగడం స్థానికులకు కలచివేసింది.

సాఫీగా సాగిపోతున్న జీవితంలో..

ప్రేమించి, పెద్దలను ఎదిరించి కులాంతర వివాహం చేసుకుని స్వశక్తితో కుటుంబాన్ని పోషిస్తున్న బాలకృష్ణ జీవితంలో రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. సాఫీగా సాగిపోతున్న ఆయన కుటుంబంలో ఈ ప్రమాదం తీరని శోకాన్ని మిగిల్చింది. ఘటనా స్థలిలోనే భార్య ఇద్దరు పిల్లలు మరణించగా బాలకృష్ణ తీవ్రషాక్‌కు గురయ్యాడు. ప్రమాద సమయంలో పర్సు పోవడంతో ఎలాంటి గుర్తింపు కార్డులు లభించలేదు. షాక్‌లో ఉన్న బాలకృష్ణ అప్పుడప్పుడు లీలగానే తనకు సంబంధించిన విషయాలు చెబుతున్నాడు. అతి కష్టమ్మీద ఆయన చెప్పిన వివరాల ప్రకారం... ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన బాలకృష్ణది గౌడ సామాజికవర్గం. పదేళ్ల క్రితం దళిత సామాజిక వర్గానికి చెందిన లక్ష్మిని ప్రేమించాడు. వీరి ప్రేమకు పెద్దల అంగీకారం లభించకపోవడంతో ఎదిరించి పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి రెండు వైపులా కుటుంబాలతో సంబంధాలు పెద్దగా లేవు. బాల కృష్ణ, లక్ష్మికి కుమార్తెలు చరణశ్రీ, షణ్మితశ్రీ ఉన్నారు. డ్రైవర్‌గా పని చేస్తూ తన కుటుంబాన్ని బాలకృష్ణ పోషిస్తుండగా, కోళ్లఫాంలో పని కుదరడంతో కుటుంబంతో కలిసి ద్విచక్ర వాహనంపై వీఎం బంజర నుంచి అశ్వారావుపేటవైపు వెళ్తుండగా దమ్మపేట సమీపాన ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి షాక్‌లో ఉన్న బాలకృష్ణను చూసిన స్థానికులకు కంట నీరు ఆగడం లేదు. పదేపదే తన భార్యాబిడ్డలు ఎక్కడున్నారంటూ అక్కడికి వచ్చిన వారందరినీ అడిగాడు. 'నీ పేరు ఏమిటి, ఏ ఊరు, ఎక్కడ పని చేస్తావు' అని అడిగితే 'మా.. ఆవిడనే అడగండి. ఆమె చెబుతుంది. నాకేమీ తెలియదు. నాకేమీ గుర్తురావడం లేదు. ఎక్కడుంది తను? పిల్లలు ఏరీ? మా అన్నాతమ్ముళ్లతో నాకు సంబంధాలు లేవు' అంటూ కన్నీళ్లతోనే చెబుతున్నాడు. దీంతో ఆయన భార్యాపిల్లలను మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి ఆస్పత్రికి తరలించామని అక్కడి సిబ్బంది చెప్పారు. కాగా, బాలకృష్ణ కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్ సాధించి సమాచారం అందించగా.. 'పెళ్లికి ముందే బాలకృష్ణ మా కుటుంబానికి దూరం అయ్యాడు. డ్రైవరు వృత్తి చేసుకుని బతికేవాడు. మాకు తెలియకుండానే కులాంతర వివాహం చేసుకుని మాకు దూరంగా బతుకుతున్నాడు' అంటూ ముక్తసరిగా బదులిచ్చారు. బాలకృష్ణ తండ్రి చనిపోగా తల్లి ఒక్కరే ఉన్నారు. తమ్ముడు కొత్తగూడెంలో ఉంటాడని సమాచారం. మృతురాలు లక్ష్మి స్వగ్రామమైన వీఎం బంజర మండలం లింగగూడెం వెళ్లి వివరాలు సేకరిస్తామని పోలీసులు తెలిపారు.

టిల్లు స్క్వేర్ చిత్ర యూనిట్ సందడి



మాట్లాడుతున్న హీరో సిద్ధార్థ జొన్నలగడ్డ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టిల్లు స్క్వేర్ చిత్ర యూనిట్ విజయవాడలో సందడి చేసింది. గాంధీనగర్‌లో చిత్రం ప్రదర్శిస్తున్న థియేటర్‌కు శనివారం యూనిట్ సభ్యులు విచ్చేశారు. ప్రేక్షకులతో కలిసి చిత్రాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా హీరో సిద్ధార్థ జొన్నలగడ్డ మాట్లాడుతూ డీజే టిల్లు చిత్రానికి కొనసాగింపుగా వచ్చిన టిల్లు స్క్వేర్ చిత్రం రూ. 100 కోట్ల వసూళ్లకు చేరువ కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. డీజే టిల్లు విజయంతో టిల్లు స్క్వేర్ నిర్మించామన్నారు. కథా బలం ఉంటే భాష, యాసతో సంబంధం లేకుండా ప్రేక్షకులు చిత్రాలను విజయవంతం చేస్తారన్నారు. టిల్లు స్క్వేర్ పూర్తిగా కమర్షియల్ యూత్ ఎంటర్టైన్మెంట్ చిత్రం అన్నారు. డీజే టిల్లు స్క్వేర్‌కు కొనసాగింపుగా కథను రెడీ చేస్తున్నామని వెల్లడించారు. చిత్ర దర్శకుడు మల్లిక రామ్ మాట్లాడుతూ ప్రతి చోట కలెక్షన్లు బాగా వస్తున్నాయని, తమను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంగీత దర్శకుడు రామ్ మిరియాల, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని, జనరల్ మేనేజర్ ఆశిష్ నీలగిరి పాల్గొన్నారు.

12 ఎకరాల సుబాబుల్ తోట దగ్ధం

నరసింహారావుపాలెం(వీరులపాడు): ఓ రైతు తన పొలంలో చెత్త తగలబెట్టి మంటలు ఆర్పకుండా నిర్లక్ష్యంగా వెళ్లడంతో పక్కనే ఉన్న సుమారు 15 ఎకరాల సుబాబుల్ తోటకు వ్యాపించి పంట దగ్ధమైన ఘటన శనివారం గ్రామంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామానికి చెందిన ఎర్రగుంట వెంకటేశ్వరరావుకు నరసింహారావుపాలెం గ్రామంలో చెరుకు తోట ఉంది. దానిలో పంట వ్యర్థాలకు నిప్పు పెట్టి మంటలను ఆర్పకుండా వెళ్లాడు. వీస్తున్న గాలులకు మంటలు పక్కనే ఉన్న సుబాబుల్ తోటకు వ్యాపించాయి. దీన్ని గమనించిన రైతులు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించడంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్న ఫైర్ అధికారులు మంటలను అదుపు చేశారు. 12 ఎకరాలకు పైగా పంట అగ్నికి ఆహుతైందని సుబాబుల్ రైతు ఉప్పుశెట్టి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ మహాలక్ష్మణుడు, పలువురు సిబ్బంది ఉన్నారు.

యువజనోత్సవాల్లో 'సిద్ధార్థ' ప్రతిభ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): లూథియానాలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాల్లో కృష్ణా యూనివర్సిటీ తరఫున సిద్ధార్థ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మార్చి 28 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు 37వ జాతీయ అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాల్లో సాంస్కృతిక పోటీలు జరిగాయన్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను కళాశాల ఆవరణలో శనివారం అభినందించారు. నాటక పోటీల్లో కపిరాజు అనే ప్రదర్శనకు ప్రథమ బహుమతి, శాస్త్రీయ సంగీత వాయిద్య పోటీల్లో ద్వితీయ బహుమతి పొందారని కళాశాల డైరెక్టర్ బాబురావు వివరించారు. వీరిని సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ వెంకటేశ్వరరావు, కళాశాల డీన్ రాజేష్ సీ.జంపాలతో పాటుగా అధ్యాపకులు అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఈ విద్యా సంవత్సరంలో వారు చెల్లించాల్సిన ఫీజును మాఫీ చేస్తున్నామని కళాశాల ప్రతినిధులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి



బంగారు పతకం అందిస్తున్న ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుద్ధి

పెనమలూరు: విద్యార్థులు ఆధునిక విద్యపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుద్ధి అన్నారు. కానూరులో శనివారం వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ 47వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ సుబుద్ధి మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యను అభ్యసించాలన్నారు. ప్రధానంగా పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు సాంకేతిక విద్యపై పట్టు సాధిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి మంచి ఉద్యోగాలు పొందుతారని చెప్పారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ యూజీసీ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీని సిద్ధార్థ అకాడమీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్‌టుబీ యూనివర్సిటీగా గుర్తించిందని తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీ అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ తమ కాలేజీలో చదివిన విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో రాణించి ఉన్నత హోదాల్లో ఉన్నారని చెప్పారు. నాణ్యమైన బోధనతో విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా ఉన్నత ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను, ప్రతిభ చాటిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. అకాడమీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ఉంగుటూరు: చెన్నై–కోల్‌కత జాతీయ రహదారిపై చిన్న అవుటపల్లి వద్ద రెండు లారీలు ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. జార్ఖండ్‌కు చెందిన సకల్‌దేవ్ జగ్గయ్యపేట నుంచి సిమెంట్ లోడుతో తణుకు వెళ్తున్నాడు. గన్నవరం మండలం చిన్న అవుటపల్లి మధుకాన్ క్రాస్ రోడ్డు వద్ద మరొక లారీ యూటర్న్ తీసుకుంటోంది. ప్రమాదవశాత్తు లారీ అదుపుతప్పి యూటర్న్ తీసుకుంటున్న లారీ వెనుక భాగాన్ని ఢీకొంది. ఘటనలో లారీడ్రైవర్ సకల్‌దేవ్ క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. ఆత్కూరు పోలీసులు, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో బాధితుడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ పైడిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్లుప్తంగా

వీఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా శ్రీనివాస్



పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్-2 ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా వీఎంసీ మేనేజర్ బొమ్మాడి శ్రీనివాస్‌ను నియమిస్తూ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్-2 అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన అనసూయ గతనెలలో ఉద్యోగ విరమణ చేయటంతో కమిషనర్ ఆ స్థానంలో శ్రీనివాస్‌ను నియమించారు. శనివారం శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.

నేడు ఆర్యవైశ్య సంఘాల ప్రమాణ స్వీకారోత్సవం



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ అర్బన్, జిల్లా ఆర్యవైశ్య సంఘాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం మొగల్రాజపురంలోని అమ్మ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ తెలిపారు. కస్తూరిబాయిపేటలోని విజయవాడ అర్బన్ ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రమాణ స్వీకారోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గడ్డం సత్యనారాయణ, పూర్వ అధ్యక్షుడు దర్శి వాసు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో తమ సంఘం ఎప్పుడూ ముందుంటుందన్నారు. రానున్న రోజుల్లో నూతన కార్యవర్గ సభ్యులు సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న భక్తిగీతాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై అమ్మవారి భక్తి గీతాలను ఆలపించారు. శనివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం సంతాన వేణుగోపాల భజన మండలికి చెందిన పి.ఉదయశ్రీ గీత బృందం పలు అమ్మవారి భక్తి గీతాలను ఆలపించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తులు ఎంతో ఆసక్తితో భక్తి గీతాలను ఆలకించారు. అనంతరం భజన మండలి సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందచేశారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని తెన్నేరు గ్రామ శివారు ఖాళీ పొలాల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7020 నగదు స్వాధీనం చేసుకున్నారు. గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు.

పేరంటాలమ్మ ఆలయంలో రేపు చండీహోమం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 8వ తేదీన అమావాస్య సందర్భంగా చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ శనివారం తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తామని, పాల్గొనదలచిన భక్తులు ముందుగా ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈనెల 9న తెలుగు సంవత్సర ఉగాది సందర్భంగా ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈనెల 13న క్రోధి నామ సంవత్సర చైత్రశుద్ధ పంచమి వసంత నవరాత్రుల సందర్భంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన అష్టోత్తర శతకలశార్చన అభిషేకం, శ్రీ మహాలక్ష్మి యాగం జరుగుతుందన్నారు. ఆలయంలో నిర్వహించబోయే ఆయా పూజాది కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

పెనమలూరు: గంగూరు గ్రామంలో ఆటో డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగూరు ఉర్దూ స్కూల్ ప్రాంతానికి చెందిన నందిపాముల సురేష్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి అదే ప్రాంతానికి చెందిన కోటమ్మ ఫోన్ చేసి ఆటో కిరాయికి రావాలని కోరింది. దీంతో సురేష్ ఆటోతో కోటమ్మ ఇంటికి వెళ్లాడు. అయితే అక్కడ కుమారి, కోటమ్మ, సతీష్ పలువురు వ్యక్తులు ఉన్నారు. ఆటో డ్రైవర్ సురేష్ వద్దకు వెళ్లి సతీష్, కోటమ్మలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుమారి పట్ల అసభ్యంగా మాట్లాడుతున్నావు ఏమిటని అతనిపై దాడి చేశారు. దీంతో సురేష్ తలకు గాయమైంది. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో సతీష్, కోటమ్మలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తూర్పులో శరవేగంగా అభివృద్ధి

- రూ.140 కోట్లతో మౌలిక సదుపాయాలు
- నియోజకవర్గంలో రూ.650 కోట్ల అభివృద్ధి
- సీసీ, బీటీ రోడ్లతో పాటు సైడు డ్రెయిన్‌లు ఏర్పాటు
- ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చెందిన రహదారులు



పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు



కామినేనినగర్ రోడ్డు



కరెన్సీనగర్ రోడ్డు



లబ్బీపేట(విజయవాడతూర్పు): సమర్థుడైన నాయకుడు ఉంటే నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయవచ్చో ఈ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసి చూపించారు. ప్రచారం కోసం షో రాజకీయాలు చేయడం కాకుండా, ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పని చేసే నాయకుడుంటే నియోజకవర్గం ఎలా అభివృద్ధి చెందుతుందో తూర్పు నియోజకవర్గాన్ని చూస్తే తెలుస్తుంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో ఏకంగా రూ.650 కోట్ల మేరకు అభివృద్ధి జరగ్గా, కేవలం రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాల కోసమే రూ.140 కోట్లు ఖర్చు చేశారు. ఒకప్పుడు గుంతల మయంగా, వర్షం వస్తే నీళ్లు నిలిచి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉండే కాలనీల్లోని రోడ్లు, నేడు రివ్వున దూసుకుపోయే విధంగా అభివృద్ధి చెందాయి. అందుకు వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ కృషి ఎంతో ఉందని నియోజకవర్గ ప్రజలే అంటున్నారు.

కాలనీలు బాగుపడ్డాయి

ఒకప్పుడు మూడో డివిజన్‌లోని కనకదుర్గనగర్, కరెన్సీనగర్, కామినేనినగర్ వెళ్లాలంటే రోడ్లు దుమ్ము కొట్టుకుపోయేవి. వర్షం వస్తే నీరు నిలిచి ఇబ్బందులు పడేవాళ్లు. ఇప్పుడు పరిస్థితి మారింది. రోడ్లన్నీ బీటీ, సిమెంటు రోడ్లు వేశారు. ఆ రోడ్లపై కాలనీ వాసులు రివ్వున దూసుకుపోతున్నారు. సుమారు ఆ డివిజన్‌లో ఏకంగా రూ.18 కోట్ల అభివృద్ధి జరిగింది. నాలుగో డివిజన్‌లోని ఎన్టీఆర్ కాలనీలో ఒకప్పుడు రోడ్లు గుంతల మయంగా ఉండేవి. దేవినేని అవినాష్ చొరవతో రూ.4.50 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు వేశారు. ఇప్పుడు కాలనీలోని రోడ్లు మిలమిల మెరుస్తున్నాయి. ఇలా అన్నీ కాలనీల్లో ఇదే పరిస్థితి.

గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం

గత ప్రభుత్వంలో కాలనీల్లోని రోడ్లు అస్తవ్యస్తంగా ఉండేవి. వర్షం వస్తే నీళ్లు నిలిచి నడవలేని పరిస్థితి ఉన్నా పాలకుల నుంచి కనీస స్పందన లేదు. ప్రజలు ఈ విషయం ఎన్నిసార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడమే కాకుండా నియోజకవర్గంలోని రహదారులను అభివృద్ధి చేశారు. దీంతో ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి ఉన్న ప్రభుత్వమని ప్రజలు కొనియాడుతున్నారు.

మౌలిక సదుపాయాలకు రూ.140 కోట్లు

కాలనీలో రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏకంగా రూ.140 కోట్లు వెచ్చించారు. అందులో పెద్ద మొత్తంగా రోడ్ల నిర్మాణాలకు ఖర్చు చేయగా, మంచినీటి సరఫరా, యూజీడీ లైన్లు, సైడు డ్రెయిన్ నిర్మాణ పనులు కూడా చేశారు. కొండ ప్రాంతాల్లో మెట్ల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యతఇచ్చారు.

కాలనీలు అభివృద్ధి చెందాయి



తూర్పు నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఇటీవల వేసిన రోడ్లు తళతళా మెరుస్తున్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జిగా దేవినేని అవినాష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న గద్దే రామ్మోహన్ షో రాజకీయాలు తప్ప చేసిందేమీ లేదు. అన్ని వర్గాలను వంచించారు. ఇప్పుడు అన్నీ నేనే చేశానని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు.

–చింతగుంట విజయ్ ఆనంద్‌కుమార్, ఫకీరుగూడెం

వేగంగా అభివృద్ధి



తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. ముఖ్యంగా కృష్ణానది రిటైనింగ్ వాల్ నిర్మాణంతో పాటు, రోడ్లు, డ్రైన్‌లు వంటి పనులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. గతంలో పాలకులు మాటలు చెప్పడమే కానీ పనులు చేయలేదు. నేడు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి చిత్తశుద్ధి చాటుకున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపించారు.

–చందా కిరణ్‌తేజ, మాచవరం

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



లబ్బీపేట(విజయవాడతూర్పు): పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. ఆయన శనివారం ఎంజీ రోడ్డులోని మదీనా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఎంతో పవిత్రంగా ఉపవాసాలు నిర్వహిస్తారని, ఈ సందర్భంగా నిర్వహించే ఇఫ్తార్ విందులకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎండీ రిజ్వాన్, వక్ఫ్ బోర్డు స్టేట్ డైరెక్టర్ మీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్క్యూబ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11 కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. పకీర్‌గూడెం, ప్రగతినగర్, శ్రీరాంనగర్, చంద్రమౌళీపురం, ఎంజీ రోడ్డు బెంజిసర్కిల్ ప్రాంతం, మైత్రేయవీధితో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అవినాష్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి



18వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నఅవినాష్ సతీమణి సుధీర



7వ డివిజన్ ఉడ్‌పేటలో ప్రచారం నిర్వహిస్తున్న మెరకనపల్లి మాధురి తదితరులు



స్థానికులతో మాట్లాడుతున్న క్రాంతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌ను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని అవినాష్ సతీమణి దేవినేని సుధీర విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కృష్ణలంక 21వ డివిజన్‌లోని మెట్ల బజార్, హరిజన సేవా సంఘం వీధి, ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ రోడ్లలో, రాణిగారితోట 18వ డివిజన్‌లోని మాదంశెట్టి సీతయ్య వీధి, కోరె నామయ్య వీధుల్లో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా సుధీర మాట్లాడుతూ గడిచిన 58 నెలల్లో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికీ చేరువయ్యేలా చేసిన దేవినేని అవినాష్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా అవినాష్‌ను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ పర్యటనలో వైఎస్సార్ సీపీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీర్ హుస్సేన్, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, 18వ డివిజన్ కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు జోగా పద్మ, గొర్ల రత్నం, మోటేపల్లి శ్రావణి, గొర్ల లక్ష్మి, గుమ్మడి లలిత, జోగా రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

17వ డివిజన్‌లో...

తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ గెలుపును కాంక్షిస్తూ రాణిగారితోట, 17వ డివిజన్‌లోని పలు వీధుల్లో శనివారం స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అవినాష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన వారిని గెలిపిద్దాం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో రూ.650 కోట్లతో అభివృద్ధి పథంలో నడిపించిన దేవినేని అవినాష్‌తో పాటు, ఎంపీగా కేశినేని శ్రీనివాస్‌లను గెలిపిద్దామని 7వ డివిజన్ కార్పొరేటర్, నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు మెరకనపల్లి మాధురి అన్నారు. ఆమె శనివారం డివిజన్‌లోని ఉడ్‌పేటలోని పలు వీధుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా, స్థానిక సమస్యలు పరిష్కరించిన వారిని రానున్న ఎన్నికల్లో ఎన్నుకుందామని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లలో మన ప్రాంతంలో ఒక్కసారి కూడా కనిపించని వారు నేడు వచ్చి ఓట్లు అడుగుతున్నారని, కరోనాలో కనిపించని నాయకులకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో వడ్లమూడి సంపత్, మెరకనపల్లి కుటుంబరావు, తుళ్లూరి ఉదయ్, హరీష్, కొండా, మట్టా ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

తూర్పులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం

గుణదల(విజయవాడ తూర్పు): ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తాయని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ సోదరి క్రాంతి అన్నారు. 2వ డివిజన్ పరిధిలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఆయన రూపొందించి అమలుపరుస్తున్న సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది మంది పేదలు లబ్ధి పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధి విధానాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని వివరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ గెలుపు ఖాయమని తెలిపారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు మోయిన్, రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం

- మేము మాటల మనుషులం కాదు
- మాది చేతల ప్రభుత్వం
- ఎంపీ కేశినేని శ్రీనివాస్
- 9వ డివిజన్‌లో దేవినేని అవినాష్‌తో కలిసి ప్రచారం



పటమటలంకలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): మేము మాటల వ్యక్తులం కాదు, మాది చేతల ప్రభుత్వం అని, టీడీపీ చిల్లర నేతల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 9వ డివిజన్ పటమటలంక ప్రాంతంలో శనివారం వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్‌తో కలిసి కేశినేని శ్రీనివాస్(నాని) ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపిన నాయకుడు దేవినేని అవినాష్ అన్నారు. ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు స్క్యూబ్రిడ్జి వద్ద అండర్ పాస్ ఏర్పాటుకు కృషి చేయడం అభినందనీయం అన్నారు. వైఎస్ జగన్ అందించే పథకాలు తమకు అందాయని ప్రతి గడపలో ప్రజలు చెబుతున్నారన్నారు.

రాష్ట్రంలో ఫ్యాన్‌గాలి వీస్తోంది

రానున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి వీస్తోందని దేవినేని అవినాష్ అన్నారు. స్క్యూబ్రిడ్జి అండర్ పాస్ పనులు ఎలా పూర్తి చేస్తారో అని ఎల్లో మీడియాలో వ్యతిరేక వార్తలు రాశారని, ఆ పనులను పూర్తి చేస్తున్నామన్నారు. టీడీపీ నేతలు నిస్సిగ్గుగా అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రిటైనింగ్‌వాల్ టీడీపీ నిర్మిస్తే 2020లో వచ్చిన వరదల్లో నీరు ఎందుకు ఇళ్లలోకి వచ్చాయో గద్దే రామ్మోహన్ సమాధానం చెప్పాలన్నారు. ఓటమి భయంతోనే టీడీపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజలు అందరూ వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి వల్లూరు ఈశ్వరప్రసాద్, అధ్యక్షుడు గద్దె కళ్యాణ్‌రామ్ పాల్గొన్నారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శనిత్రయోదశి పందర్భంగా ఉదయం శనీశ్వరస్వామివారికి విశేష తైలాభిషేకం చేశారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో శ్రీనందీశ్వరస్వామివారికి ప్రదోష సమయంలో అభిషేకం, అర్చన చేశారు. ఆలయ ప్రధాన పూజారి జీఆర్‌వీ సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బాపు మ్యూజియంలో చేనేత హస్తకళా మేళా



చేనేత హస్తకళా మేళాలో వస్త్రాలను పరిశీలిస్తున్న వాణీ మోహన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని బాపు మ్యూజియంలో చేనేత, హస్తకళా ప్రదర్శన, అమ్మకాలు ప్రారంభించినట్లు మేళా నిర్వాహకులు తెలిపారు. ఈనెల 19వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల నుంచి నేరుగా ఉత్పత్తిదారులు తాము తయారు చేసిన నాణ్యమైన వస్త్రాలు విక్రయిస్తారన్నారు. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, మంగళగిరి చీరలు, డ్రెస్ మెటీరియల్స్, బెంగాలీ కాటన్, శారీస్, జైపూర్ బెడ్ షీట్స్, ఖాదీ వస్త్రాలు, పొందూరు ఖద్దరు, కొండపల్లి, ఏటికొప్పాక చెక్క బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, 1 గ్రామ్ జ్యూయలరీ, పూజా వస్తువులు, లెదర్ బ్యాగులు మొదలైన వస్తువులు అమ్మకానికి ఉన్నాయని నిర్వాహకురాలు పద్మజ తెలిపారు. ఈ ప్రదర్శనను పురావస్తు శాఖ కమిషనర్ వాణీమోహన్ ప్రారంభించి వస్త్రాలను తిలకించారన్నారు.

‘తూర్పు’లో 100 మంది వలంటీర్ల రాజీనామాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తూర్పు నియోజకవర్గ పరిధిలోని 2,3,5,6,7 డివిజన్లకు చెందిన 100 మంది వలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. పటమటలోని సర్కిల్-3 మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జోనల్ కమిషనర్ కృష్ణకు వీరంతా తమ రాజీనామా లేఖలను అందజేశారు. తమపై టీడీపీ నాయకులు వారి అనుచరులతో అసత్య ఆరోపణల చేస్తూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ తామంతా రాజీనామా చేస్తున్నామని వలంటీర్లు చెప్పారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గ్రామానికి చెందిన వెలిశిల కీర్తికుమారి 2014వ సంవత్సరంలో విజయవాడ చిట్టినగర్‌కు చెందిన సంజయ్‌కుమార్‌ను కట్న కానుకలు ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. వీరికి పాప పుట్టింది. అయితే పెళ్లి సమయంలో భర్త ప్రభుత్వ ఉద్యోగం అని చెప్పగా అతనికి ఎటువంటి ఉద్యోగం లేదు. పైగా ఆడపిల్ల పుట్టిందని, ఇచ్చిన కట్నం చాలదని, అదనపు కట్నం తీసుకరమ్మని భర్తతో పాటు మామ విజయ్‌కుమార్, అత్త వెరినీకమ్మ, ఆడపడుచు ప్రశాంతి, ఆమె భర్త అజయ్‌కుమార్ వేధింపులకు గురి చేయటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు వరకట్నం వేధింపు కేసు నమోదు చేశారు.

అభివృద్ధితోనే సంక్షేమం సాధ్యం

కృష్ణలంక(విజయవాడతూర్పు): సమాజంలో అభివృద్ధి, ప్రగతిని సాధించడం ద్వారానే సంక్షేమాన్ని అమలు చేయగలమని ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ఎస్.మహేంద్రదేవ్ అన్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం ‘అభివృద్ధితో సంక్షేమం-సుపరిపాలనకు సవాళ్లు’ అనే అంశంపై చర్చా గోష్టి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహేంద్రదేవ్ మాట్లాడుతూ ప్రపంచంలో మొదటిసారిగా బ్రెజిల్‌లో ప్రత్యక్ష నగదు పంపిణీ పథకాన్ని అమలు చేశారని, నేడు ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలలో ఇలాంటి పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధికి తోడ్పడే సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. రిటైర్డ్ ఐఏఎస్ ఎల్.వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజల భవిష్యత్తును నిర్దేశించే నేతలు కావాలని, సమాజ. ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. ఎన్నికల సమయంలో రాజకీయ వైరుధ్యాలున్నా ఎన్నికల తర్వాత అందరం ఐక్యంగా అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఏ రాజకీయ పార్టీకీ కొమ్ము కాయటం లేదని స్పష్టం చేశారు.

మార్కెటింగ్ సృష్టించే విలువలపై వెబినార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరి నీరజ అధ్యక్షతన శనివారం మార్కెటింగ్ సృష్టించే విలువలపై వర్చువల్‌గా వెబినార్ జరిగింది. కార్యక్రమంలో విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల డీన్ డాక్టర్ రాజేష్ సీ జంపాల ముఖ్యఅతిథిగా పాల్గొని ‘వస్తు సేవల కల్పనలోనూ, వాటి అవసరాన్ని ప్రచారం చేయడంలోనూ, వాటిని వినియోగదారుడికి అందజేయడంలోనూ మార్కెటింగ్ పాత్ర’ అనే అంశంపై ప్రధాన ఉపన్యాసం చేశారు. నేడు మార్కెట్‌లో బ్రాండును బట్టి వస్తు సేవల అమ్మకాలు జరుగుతున్నాయని, వినియోగదారులను గుర్తించడంలోనూ, వారిని సంతృప్తి పరచడంలోనూ, తమ వస్తువులను మాత్రమే వాడేటట్లు చేయడంలో మార్కెటింగ్ పాత్రను వివరించారు. మార్కెటింగ్ మౌలికాంశాలను, నాలుగు పీ(ప్రోడక్ట్, ప్రైస్, ప్లేస్, ప్రమోషన్)లు గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నీరజ మాట్లాడుతూ నేటి అత్యాధునిక యుగంలో మన జీవితాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదిగిన మార్కెటింగ్ రంగం గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు వెబినార్ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
ఆదివారం ॥ 7-4-2024

వైరల్



జీవితం అనే గురువు పాఠాలు, గుణపాఠాలు నేర్పుతుంది

సంజయ్ లీలా భన్సాలి 'హీరామండీ- ది డైమండ్ బజార్' వచ్చే నెల నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. 'హీరామండి'లో మనిషా కోయిరాల నటించింది. 'హీరామండి' విడుదలకు ముందు ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో తన జీవితంలోని ప్రధాన సంఘటనల గురించి సుదీర్ఘమైన నోట్ రాసింది మనిషా. క్యాన్సర్‌తో తాను పోరాడిన రోజులను గుర్తు తెచ్చుకుంది.

'ఎన్నో మంచి పాత్రలలో నటించాను. ఎంతో మంది ఉత్తమ దర్శకులతో కలిసి పనిచేశాను. ఎంతోమంది స్నేహాన్ని పొందాను. దేవుడి దయతో క్యాన్సర్‌తో పోరాడి గెలిచాను. జీవితంలో ఎత్తుపల్లాలు ఉంటాయి. నా జీవితంలో ఎన్నో లోతులను చూశాను. జీవితాన్ని మించిన గురువు లేదు. ఎన్నో పాఠాలు, గుణపాఠాలు నేర్పుతుంది. కాలం విలువను తెలుసుకున్నాను' అంటూ రాసింది. మనిషా కోయిరాల రాసిన ఈ నోట్ నెట్‌జనులను బాగా కదిలించింది.

స్కేట్‌బోర్డ్‌పై మనాలి టు కన్యాకుమారి

'మనాలి నుంచి కన్యాకుమారికి ఎలా వెళతాం?' అనే ప్రశ్నకు 'స్కేట్‌బోర్డ్ మీద' అని ఎవరూ చెప్పరు. 'మీరు చెప్పకపోతేనేం... నేనైతే స్కేట్‌బోర్డ్ మీదే వెళ్లాను' అంటున్నాడు రితిక్. ప్రొఫెషనల్ స్కేట్ బోర్డర్ అయిన రితిక్ క్రాడ్జెల్ మనాలి నుంచి కన్యాకుమారికి స్కేట్‌బోర్డ్ మీద వెళ్లాడు.



ఈ ప్రయాణానికి సంబంధించిన వీడియోలు నెట్‌లోకాన్ని అబ్బురపరుస్తున్నాయి.

చిన్న బ్యాక్‌ప్యాక్‌తో బయలుదేరిన రితిక్ 100 రోజుల్లో తన ప్రయాణాన్ని పూర్తి చేశాడు. రీల్స్, వీడియోలలో తనకు ఎదురైన అనుభవాలను నెటిజనులతో పంచుకున్నాడు. గూగుల్ మ్యాప్స్ పనిచేయకపోవడం నుంచి దట్టమైన పొగమంచుతో హైవేల జీరో విజిబిలిటీ వరకు రితిక్‌కు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి.

ఎన్ని సవాళ్లు ఎదురైనా ముందుకే వెళ్లాడు. రితిక్ సాహసం, ఓపికకు నెటిజనులు ప్రశంసల వర్షం కురిపించారు.

చిప్స్ ఉండగా పూల చింత ఏల!

'పెళ్లి ఊరేగింపు కారును దేనితో అలంకరిస్తారు?' అనే ప్రశ్నకు టక్కున వినిపించే జవాబు... పువ్వులు.

పూల కొరతో, ఖర్చు అనుకున్నారో.. వైవిధ్యం కోసమో ఏమో తెలియదుగానీ ఈ పెళ్లి కారును పొటాటో చిప్స్ ప్యాకెట్స్‌తో అలంకరించారు. సత్పాల్ యాదవ్ అనే ఇన్‌స్టాగ్రామ్ యూజర్ పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. చిప్స్‌తో ముస్తాబైన ఈ పెళ్లి కారు గురించి నెటిజనులు సరదాగా స్పందించారు.

'పొటాటో చిప్స్ బ్రాండ్‌ను ప్రమోట్ చేసే పబ్లిసిటీ ఇది'

'చిప్స్ అంటే ఎంత ఇష్టముంటే మాత్రం ఇలానా!'

'చిప్స్‌కు బదులుగా ఫైవ్‌స్టార్ చాక్లెట్స్‌తో ముస్తాబు చేసి ఉంటే కారు వెంట జనాలు పరుగులు తీసేవారు'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.



మా నాయినే! కొబ్బరికాయను తలకేసి కొట్టుకున్నాడు



కొబ్బరికాయను రాయిపై కొడితే పగులుతుంది. నుదుటిపై కొడితే? వైరల్ అవుతుంది! విషయంలోకి వస్తే... తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి కొబ్బరికాయ పట్టుకొని పూజాపీఠం దగ్గర శ్లోకాన్ని జపించాడు. ఆ తరువాత తల పైకి లేపి కొబ్బరికాయను నుదుటి మీద కొట్టుకున్నాడు. 'యాక్షన్‌కు రియాక్షన్' అనేది ప్రకృతి ధర్మం కదా! సదరు వ్యక్తి వెంటనే కుప్పకూలిపోయాడు. ఈ వీడియో వైరల్ కావడం మాట ఎలా ఉన్నా వ్యక్తి చర్యను నెటిజనులు ఖండించారు. 'ఆపరేషన్ సక్సెస్ బట్ పేషెంట్ డెడ్', 'గాయపడింది నువ్వు కాదు... కొబ్బరికాయ'లాంటి సరదా కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

ది గ్రేట్ వడా పావ్ వార్



ఢిల్లీ 'వైరల్ వడా పావ్ గర్ల్'గా పాపులర్ అయిన చంద్రికా గెరా దీక్షిత్ తాజాగా తన ఫుడ్ కార్ట్ సార్టప్‌తో రాత్రికి రాత్రి సెన్సేషన్‌గా మారింది. దీక్షిత్ పాపులారిటీ మాట ఎలా ఉన్నా ఆమెకు పోటీదారులు పెరిగారు. దీక్షిత్ ఫుడ్ కార్ట్ చుట్టుపక్కల పోటీదారులు వడా పావ్ బండ్లను ఏర్పాటు చేస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. 'పాపులారిటీనే కొంపముంచిందా!' లాంటి హెడ్‌లైన్స్ నెటిజనుల నుంచి లైన్ కట్టాయి.

'నిన్న నేను రానందున తన బండిని ఉంచానని ఆంటీ చెప్పింది. ఈరోజు కూడా ఇక్కడే పెట్టింది. ఒకరి వ్యాపారాన్ని దెబ్బతీయాలనుకోవడం సమంజసమా!' అని తన ఆవేదనను వెళ్లగక్కింది దీక్షిత్.


ఫుడ్ వ్లాగర్ ఫూడీ మానేహా ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది.

ఈ వీడియో వైరల్ కావడంతో పోటీదారు ఆంటీ 'ఒకరి వ్యాపారాన్ని దెబ్బతీసే ఉద్దేశం నాకు లేదు. నా పని నేను చేసుకుపోతున్నాను' అని ఎర్రటి ఎండల్లో కూల్‌గా బదులిచ్చింది. 'బండి ఎవరు పెట్టారనేది కాదు... రుచి ముఖ్యం' అని కూడా సెలవిచ్చింది.

మన తెలుగువాడి బయోపిక్

చూపు లేకపోయినా అంట్రప్రెన్యూర్‌గా విజయం సాధించిన మన తెలుగువాడు శ్రీకాంత్ బొల్లా బయోపిక్ ఫస్ట్‌లుక్ వైరల్ అయ్యింది.
రాజ్ కుమార్ రావు శ్రీకాంత్ పాత్ర పోషిస్తున్నాడు.


శ్రీకాంత్ బొల్లా



శ్రీకాంత్ బొల్లా పాత్రలో రాజ్ కుమార్ రావు

పుట్టుకతో అంధత్వం వెంటాడినా విజయాలు అందుకోవడానికి అది అడ్డుకాదని నిరూపించిన తెలుగు పారిశ్రామికవేత్త శ్రీకాంత్ బొల్లా బయోపిక్ 'శ్రీకాంత్' ఫస్ట్‌లుక్ విడుదలైంది. మంచి నటుడిగా పేరు గడించిన రాజ్‌కుమార్ రావు శ్రీకాంత్ పాత్రను పోషిస్తుండటం విశేషం. మచిలీపట్నంలో జన్మించిన శ్రీకాంత్ బొల్లా ఇంజినీరింగ్ చదువు విషయంలో చాలా సవాళ్లు ఎదుర్కొన్నాడు. అంధుడైన కారణాన ఐఐటీలో సీటు పొందలేకపోయాడు. అయితే పట్టుదలతో మసాచూసెట్స్ యూనివర్సిటీలో తొలి అంతర్జాతీయ అంధ విద్యార్థిగా దఖలయ్యి చదువుకున్నాడు. భారత్‌కు తిరిగి వచ్చి పారిశ్రామిక రంగంలో కీర్తి గడించాడు. బొల్లా జీవితం ఇప్పటికే ఎందరికో ఆదర్శం అయ్యింది. వెండితెర మీద ఆయన జీవితం చూసి మరెందరో స్ఫూర్తి పొందుతారు. తుషార్ హీరానందాని ఈ సినిమా దర్శకుడు.

నగదు మాత్రమే ఇవ్వండి



జేబులో డబ్బులు పెట్టుకోవడం జనం మానేశారు. ఖర్మగాలి ఫోన్ పే పని చేయకపోతే తెల్లముఖాలు వేస్తున్నారు. నగదు లావాదేవీల వల్ల ఎంత ఖర్చవుతున్నదో ఎంత మిగిలి ఉన్నదో తెలిసేది. కాని ఆన్‌లైన్ పేమెంట్లకు హద్దు లేదు. ఈ నేపథ్యంలో చెన్నైలో ఆటో నడిపే ఒక పెద్దాయన తన ఆటోలో పెట్టిన నోటీస్ ఇంటర్‌నెట్‌లో వైరల్ అయ్యింది.
నగదు అవసరాన్ని గుర్తు చేసే పోస్ట్ ఇది.

'జీ పే చేయొద్దు. డబ్బు డ్రా చేయడానికి ఏటీఎం దగ్గర ఆపమని అడగొద్దు' అని చెన్నైలో ఒక ఆటోబాబాయ్ పెట్టిన బోర్డు ఇంటర్‌నెట్‌లో వైరల్ అయ్యింది. గతంలో అందరి దగ్గర డబ్బులుండేవి. ఆటో ఎక్కినా దిగినా డబ్బు ఇచ్చి బేరం ముగించేవారు. ఇప్పుడు అందరూ జీపే, ఫోన్‌పే చేస్తున్నారు. అయితే కొన్ని దుకాణాల్లో ఇప్పటికీ 'నగదు మాత్రమే' అనే బోర్డులు ఉన్నాయి. దానికి కారణం డిజిటల్ లావాదేవీల్లో ఏదైనా మోసం జరుగుతుందేమోనని. ఈ ఆటోబాబాయ్‌కి కూడా అలాంటి అనుభవాలు ఎదురై ఉండొచ్చు. లేదా ఎక్కిన వారు జీపే పని చేయకపోతే ఏటీఎం దగ్గరకు వెళదామని టైమ్ వేస్ట్ చేస్తూ ఉండొచ్చు. అందుకనే స్పష్టంగా 'ఏటీఎం దగ్గర ఆటో ఆపమని అడగొద్దు' అంటూ బోర్డ్ పెట్టాడు. చెన్నైలో ఇతని ఆటో ఎక్కిన మహిళ ఈ బోర్డును ఫొటో తీసి 'ఎక్స్'లో పెడితే ఇంటర్‌నెట్‌లో మంచి డిబేట్ నడిచింది. 'ఇలాగైతే ఎలా' అని కొందరంటే 'బ్యాంకు ట్రాన్సాక్షన్స్ అన్నీ డిజిటల్ పేమెంట్ల వల్ల ప్రభుత్వానికి ఎందుకు తెలియాలి?' అని కొందరు ప్రశ్నించారు. చివరకు ఆటో ఎక్కిన మహిళ తన అపార్ట్‌మెంట్ దగ్గర దిగి, సెక్యూరిటీ దగ్గర అప్పు తీసుకుని ఆటో బాబాయ్‌కి చెల్లించి బతుకు జీవుడా అనుకుంది.

హెల్త్

నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



ఏయే వయసుల్లో ఏయే వ్యాక్సిన్‌లు! ఏయే వైద్య పరీక్షలు..?



ఆరోగ్య సమస్య ఏమైనా వస్తే చికిత్స తప్ప ప్రత్యామ్నాయం లేదు. కానీ సమస్య రాకుండా ముందే నివారించుకుంటే ఆరోగ్యానికి ఢోకా ఉండదు. చికిత్స కంటే నివారణే మేలు అనే సూక్తి మేరకు వ్యాధుల నివారణకు ఉపయోగపడే అంశాల్లో మొట్టమొదటి అంశం టీకాలు (వ్యాక్సిన్లు). రెండో అంశం... లక్షణాలు కనిపించగానే చేయించాల్సిన వైద్యపరీక్షలు. నేడు 'వరల్డ్ హెల్త్ డే'. ఈ సందర్భంగా ఏ వయసులో వారు ఏయే వ్యాక్సిన్లు తీసుకోవాలన్న అంశంపై అవగాహన కోసం ఈ కథనం.

టీకాలు

చిన్నారి పుట్టిన వెంటనే... ఓపీవీ, బీసీజీలతో పాటు హెపటైటిస్ బి వ్యాక్సిన్ ఇస్తారు. ఆ తర్వాత 6, 10, 14 వారాల్లో ఇస్తారు).

ఆరు వారాలప్పుడు : ● డీ-ట్యాప్ (డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్) / డీపీటీ టీకా ఫస్ట్ డోస్ ● హెచ్ఐబీ (హిబ్) (హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి) టీకా ఫస్ట్ డోస్ ● ఐపీవీ (ఇనాక్టివేటెడ్ పోలియో వైరస్)/ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) టీకా ఫస్ట్ డోస్ ● పీసీవీ 13 (న్యూమోకోకల్ కాంజుగేట్ టీకా) ఫస్ట్ డోస్ ● రొటావైరస్ టీకా మొదటి డోస్ (ఇది నోటిద్వారా ఇస్తారు) ● హెపటైటిస్-బి వ్యాక్సిన్ రెండో డోస్.

పది వారాలప్పుడు: ● డీ-ట్యాప్ (డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్) / డీపీటీ టీకా రెండో మోతాదు ● హెచ్ఐబీ (హిబ్) (హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి) టీకా రెండో మోతాదు ● ఐపీవీ / ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) టీకా రెండోడోస్ ● పీసీవీ 13 రెండో మోతాదు ● నోటిద్వారా ఇచ్చే రొటావైరస్ టీకా రెండో డోస్ ● హెపటైటిస్-బి మూడో డోస్.

పద్నాలుగు వారాలప్పుడు: ● డీ-ట్యాప్ (డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్) / డీపీటీ టీకా మూడో మోతాదు ● హెచ్ఐబీ (హిబ్) (హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి) టీకా మూడోమోతాదు ● ఐపీవీ (ఇనాక్టివేటెడ్ పోలియో వైరస్)/ ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) టీకా మూడో మోతాదు ● పీసీవీ 13 (న్యూమోకోకల్ కాంజుగేట్ టీకా) మూడో మోతాదు ● రొటావైరస్ టీకా మూడో డోస్ (ఇది నోటిద్వారా ఇచ్చే డోస్) ● హెపటైటిస్-బి వ్యాక్సిన్ నాలుగో మోతాదు.

ఆరు నెలల వయసప్పుడు : ● ఇన్‌ఫ్లుయెంజా టీకా మొదటి మోతాదు ● ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) మొదటి మోతాదు

ఏడు నెలల వయసప్పుడు : ● ఇన్‌ఫ్లుయెంజా టీకా రెండో మోతాదు

తొమ్మిది నెలల వయసప్పుడు : ● ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) రెండో మోతాదు ● ఎమ్ఎమ్ఆర్ (తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా) టీకా ఫస్ట్ డోస్ ● టైఫాయిడ్ కాంజుగేట్ వ్యాక్సిన్ ఇస్తారు.

పన్నెండు నుంచి 15 నెలల వయసప్పుడు: ● ఎమ్ఎమ్ఆర్ (తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా) టీకా రెండో మోతాదు ● వారిసెల్లా (చికెన్‌పాక్స్) టీకా మొదటి మోతాదు ● హెపటైటిస్-ఏ టీకా మొదటి మోతాదు (దీని రెండో డోస్ సాధారణంగా 18 నెలలప్పుడు ఇస్తారు) ● పీసీవీ (ప్యాక్‌డ్ సెల్ వాల్యూమ్) బూస్టర్.

పద్దెనిమిది నెలల వయసప్పుడు : ● డీట్యాప్ టీకా మొదటి బూస్టర్ డోస్ ● హెచ్ఐబీ (హిబ్) టీకా మొదటి బూస్టర్ డోస్ ● ఐపీవీ లేదా ఓపీవీ టీకా ● హెపటైటిస్-ఏ రెండో డోస్.

మూడేళ్ల వయసప్పుడు: ● వారిసెల్లా వ్యాక్సిన్ రెండో డోస్ టీకా.

ఐదేళ్లప్పుడు: ● డీ-ట్యాప్ టీకా రెండో బూస్టర్ ● ఐపీవీ టీకా ● ఎమ్ఎమ్ఆర్ టీకా మూడో డోస్.

పది నుంచి పన్నెండేళ్ల వయసప్పుడు: ● హెచ్‌పీవీ టీకా మొదటి డోస్ (దీని రెండు, మూడు డోసులు 9 నుంచి 18 ఏళ్ల వయసప్పుడు) ● టీడ్యాప్ టీకా బూస్టర్ డోస్ ● మెనింగోకోకల్ కాంజుగేట్ టీకా మొదటి డోస్ (దీని బూస్టర్ 16 ఏళ్ల వయసప్పుడు ఇవ్వాల్సి ఉంటుంది).

పదిహేను నుంచి 16 ఏళ్ల వయసప్పుడు: ● మెనింగోకోకల్ కాంజుగేట్ టీకా బూస్టర్ డోస్ ● టీడీ / డీటీ టీకా.

18 నుంచి 65 ఏళ్ల వరకు: ఈ వయసులో ఎవరికైనా మంచి వ్యాధి నిరోధకత ఉంటుంది. గతం లో ఏదైనా వ్యాక్సిన్ తీసుకోకపోతే... డాక్టర్ సలహా మేరకు తీసుకోవచ్చు. వ్యాక్సిన్ తీసుకున్నదీ లేనిదీ గుర్తులేనప్పుడు డాక్టర్‌కు ఆ విషయం చెబితే... వారు కొన్ని పరీక్షల ద్వారా వ్యాక్సిన్ తీసుకున్నదీ లేనిదీ నిర్ధారించి అవసరమైతే ఇస్తారు.

65 ఏళ్లు పైబడిన వారికి: ఈ వయసు దాటాక కొన్ని వ్యాక్సిన్లు తప్పనిసరిగాను, మరికొన్ని అవసరాన్ని బట్టి తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు... ● పీసీవీ-13 అండ్ పీపీఎస్‌వీ 23 అనే వ్యాక్సిన్లను సాధారణంగా 65 ఏళ్లు దాటినవారికి ఇస్తుంటారు. ఇవి నిమోనియాను నివారించే నిమోకోకల్ వ్యాక్సిన్లు. ఇందులో తొలుత పీసీవీ-13 ఇస్తారు. ఆ తర్వాత రెండు నెలలకు పీపీఎస్‌వీ-23 ఇస్తారు ● టీ-డ్యాప్ వ్యాక్సిన్ : చిన్నప్పుడు తీసుకున్న టెటనస్, డిఫ్తీరియా, పెర్టుసిస్ వ్యాధులను నివారించే వ్యాక్సిన్ తాలూకు బూస్టర్ డోసులను 65 ఏళ్లు పైబడ్డ తర్వాత ప్రతి పదేళ్లకోమారు తీసుకుంటూ ఉండాలి.


డాక్టర్ బీవీఎస్ అపూర్వ
కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్

ముందుగానే కొన్ని వైద్య పరీక్షలు చేయించడం వల్ల కొన్ని వ్యాధుల్ని కనుగొని సంపూర్ణంగా నయం చేసుకోవచ్చు. ఉదాహరణకు సర్వైకల్ క్యాన్సర్ అనే వ్యాధికి సుదీర్ఘమైన ముందస్తు వ్యవధి ఉంటుంది. అంటే అసలు వ్యాధి రావడానికి పదేళ్ల ముందునుంచే 'ప్రీ-సర్వైకల్ పీరియడ్' ఉంటుంది. పాప్ స్మియర్ అనే పరీక్ష ద్వారా వ్యాధి రాబోయే దశాబ్దకాలం ముందుగానే దాన్ని కనుగొనవచ్చు. క్యాన్సర్ ను ఎంత త్వరగా కనుగొంటే అంత తేలికగా నయమవుతుంది. ఆరోగ్యంగా ఉండటం కోసం ముందస్తుగా ఏయే వయసుల్లో ఏయే వైద్యపరీక్షలు ఉపకరిస్తాయో తెలుసుకుందాం.

పరీక్షలు

0 - 10 ఏళ్ల వయసులో: ఈ వయసులో అవసరం అయితే తప్ప పెద్దగా వైద్యపరీక్షలు అవసరం లేదు.

11 - 20 ఏళ్లు : ఇది యుక్త వయసులోకి మారే దశ. నిర్దిష్టంగా ఏవైనా వైద్యసమస్యలు ఉండటం లేదా లక్షణాలు కనిపించడం వంటి సమయాల్లో తప్ప... ఈ వయసులోనూ పెద్దగా వైద్యపరీక్షలు అవసరం పడవు.

20 - 30 ఏళ్లు : ఈ వయసులో కొన్ని లైంగిక సాంక్రమిక వ్యాధులు (ఎస్‌టీఐ'స్) కోసం మరీ ముఖ్యంగా హెపటైటిస్-బీ నిర్ధారణ పరీక్షలు చేయించి హెచ్‌బీజీ వ్యాక్సిన్ తీసుకోవాలి. అలాగే అమ్మాయిలైతే పాప్‌స్మియర్ వంటి గైనిక్ పరీక్షలు చేయించుకుని, 12 ఏళ్ల నుంచి 26 ఏళ్ల మధ్యకాలంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ప్రయోజనకరం.

30 నుంచి 40 ఏళ్లు : ఈ వయసు నుంచి డయాబెటిస్ కోసం హెచ్‌బీఏ1సీ అనే రక్తపరీక్షలు, రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలి. ఏవైనా తేడాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి ఈసీజీ, టూ డీ ఎకో, అవసరాన్ని బట్టి ట్రెడ్‌మిల్ వంటి పరీక్షలు చేయించాలి. అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలూ మంచిదే. మహిళలైతే డాక్టర్ సలహా మేరకు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మామోగ్రామ్ పరీక్ష చేయించాలి.

40 - 50 ఏళ్లు : ఈ వయసు నుంచి దేహంలో కొన్ని మార్పులు మొదలవుతాయి. అందుకే ఈ వయసులో పరీక్షలు తరచూ చేయిస్తుండటం మేలు. రక్తపోటును తెలుసుకోవడం కోసం సిస్టోల్, డయాస్టోల్ ప్రెషర్స్, రక్తంలో చక్కెర మోతాదుల కోసం హెచ్‌బీఏ1సీతో పాటు అవసరమైతే గ్లూకోస్ టాలరెన్స్ టెస్ట్ (జీటీటీ), పొద్దున్నే పరగడుపున, ఏదైనా తిన్న తర్వాత చేసే ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, పోస్ట్ ప్రాండియల్ వైద్య పరీక్షలతోపాటు అవసరాన్ని బట్టి కొన్నిరకాల క్యాన్సర్ పరీక్షలు చేయించడం మంచిది.

అలాగే మహిళలైతే ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ కోసం బోన్ డెన్సిటీ పరీక్ష చేయించాలి. దాంతోపాటు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలను డాక్టర్ చెప్పిన వ్యవధుల్లో చేయించాలి.

ఇక పురుషులైతే ఈ వయసు నుంచి ప్రోస్టేట్ స్పెసిఫిక్ ఏంటీజెన్... సంక్షిప్తంగా పీఎస్ఏ అనే పరీక్షను డాక్టర్లు చెప్పిన వ్యవధుల్లో చేయించుకుంటూ ఉండాలి.

50 - 60 ఏళ్లు : చాలామంది 50 ఏళ్ల వరకు ఎలాంటి పరీక్షలు చేయించకపోవచ్చు. అయితే అలాంటివాళ్లంతా ఈ 50 - 60 ఏళ్ల మధ్యవయసులో తప్పక వైద్యపరీక్షలు చేయించాల్సిన అవసరం తప్పక వస్తుంది. ముందు నుంచి పరీక్షలు చేయించని వాళ్లతోపాటు ఈ వయసులోని అందరూ ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ కోసం బోన్ స్కాన్, కోలన్ క్యాన్సర్ నిర్ధారణ కోసం కొలనోస్కోపీ, గుండె జబ్బుల కోసం తరచూ ఈసీజీ, టూ డీ ఎకో, ట్రెడ్‌మిల్ పరీక్షలతో పాటు లక్షణాలను బట్టి ఇతర వైద్యపరీక్షలు చేయిస్తుండాలి.

మహిళలకు 50 ఏళ్ల వయసు తర్వాత మెనోపాజ్ రావడంతో గుండెకు ఉండే ఒక సహజ రక్షణ తొలగిపోతుంది. అందువల్ల గతంలో చేయించినా, చేయించక పోయినా ఈ వయసు నుంచి మహిళలు గుండెకు సంబంధించిన అన్ని స్క్రీనింగ్ పరీక్షలు అంటే ఈసీజీ, టూడీ ఎకో, ట్రెడ్‌మిల్ వంటి పరీక్షలు చేయించాలి.

60 నుంచి 70 ఏళ్లు : ఈ వయసులో వాళ్లనే సీనియర్ సిటిజెన్‌గా పరిగణిస్తుంటారు. పురుషులూ మహిళలు అన్న తేడా లేకుండా... ఈ వయసు నుంచి అందరూ... ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ కోసం బోన్ స్కాన్, కోలన్ క్యాన్సర్ నిర్ధారణ కోసం కొలనోస్కోపీ, గుండెజబ్బుల కోసం తరచూ ఈసీజీ, టూ డీ ఎకో, ట్రెడ్‌మిల్ పరీక్షలతోపాటు లక్షణాలను బట్టి మరికొన్ని ప్రత్యేకమైన పరీక్షలు అవసరమవుతాయి.

70+ పైబడ్డాక... ఆపైన కూడా...

ఈ వయసు నుంచి లక్షణాలను బట్టి ఓ వ్యక్తి సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండేందుకు పైన పేర్కొన్న వైద్యపరీక్షలతో పాటు కొన్ని వ్యాక్సిన్లు, మరికొన్ని మందులు తీసుకోవాలి. ఒకవేళ పోషకాహార లోపం ఉంటే, తగిన ఆహారం తీసుకోవాలి. దాంతోపాటు అవసరం అయితే మరికొన్ని హెల్త్ సప్లిమెంట్స్ వంటివి తీసుకోవాల్సి ఉంటుంది.


డాక్టర్ హరికిషన్
సీనియర్ కన్సల్టెంట్
జనరల్ ఫిజీషియన్